ఆంధ్రసచిత్రవారపత్రిక



21-2-75
60 పైసలు


నవతా చిత్ర వారి
జమీందారు గారి అమ్మాయి
దర్శకత్వం: సింగీతం శ్రీనివాసరావు నిర్మాత: యన్.కృష్ణంరాజు
సహ నిర్మాతలు: డి.శ్రీరంగరాజు, ఆర్.విజయరామరాజు
రచన: డి.వి.నరసరాజు, సంగీతం: జి.కె.వెంకటేశ్ ఛాయ: సుఖదేవ్ కూర్పు: వాసు కళ: కళాధర్
సోల్ డిస్ట్రిబ్యూటర్స్ అన్నపూర్ణా పిక్చర్స్ అన్నపూర్ణా ఫిలింస్ రిలీజ్



డూండీ రూపకల్పనలో మరో మరపురాని కథ
త్రిమూర్తి ప్రొడక్షన్సు వారి
అభిమానవతి
కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: డూండీ
శ్రీ ఫిలింస్
నిర్మాతలు: జి. సాంబశివరావు పి. బాబ్జీ.
సంగీతం: చక్రవర్తి
Veeka

ఉత్తరాలు

ముఖచిత్రం

మీరు సాధారణంగా నటీమణుల ముఖచిత్రములనే వేయుచున్నారు. నటుల యొక్క ముఖ చిత్రములను కూడా ప్రచురించి మమ్ములను ఆనందపరుస్తారని ఆశిస్తాం.

తరువాత ఈ పత్రికలోనే మా అభిమాన అందాల నటులైన శ్రీ నాగేశ్వరరావుగారి సన్మాన సభగూర్చి మాకు తెలిపిన "శ్రీ శ్రీనివాస్"గారికి మా సిండికేట్ యొక్క కృతజ్ఞతలు.

కె. నాగేశ్వరరావు, ఎస్. ప్రసాదరావు, కె. చిన్నారావు, (విజయనగరం).

* * *

పత్రిక ముఖచిత్రం ఎక్కువగా స్త్రీబొమ్మలనే వేస్తున్నారు. మగవారి బొమ్మలను కూడ వేయవలెనని కోరుతున్నాను.

ఎస్. రామనాథబాబు, ఎస్. సీతారామలక్ష్మి, (వెంకటరాయపురం.)

★ 7—2—'75 సంచిక చూశారుకదా! సం.]

సీరియల్

చెల్లూరి సీతారాజేశ్వరరావు గారి" భవబంధాలు' సీరియల్ ముగింపు ఆసక్తికరంగా వున్నది. త్యాగమయి అయిన "మనోరమ" పాత్ర పదికాలాలపాటు మరిచిపోలేము.

సిరికొండ వెంకటేశం, (కరీంనగర్)

కథలు

ఈ వారం 31.1.75 ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురించబడిన "పేరునాదే"కథ మాకు బాగా వుంది. డార్విన్‌నోన్‌కథ చదవడానికి చాల ఆసక్తిదాయకంగా వుంది. ముందు ఏం జరుగనున్నది అన్న సందేహాలు కలిగిస్తూ, చక్కని రచనాశైలిలో ముత్యాల్లాంటి సంభాషణలతో పొదగబడిన"డైవోర్స్ '70" నాటకం ఆంధ్ర సచిత్ర వారపత్రికకే మకుటంలా వెలుగుతోంది.

పి. హెచ్. సత్యనారాయణమూర్తి, పృథ్వీరాజు, (ఆదిలాబాదు)

సినిమా

ఏ పత్రికా అందించనటువంటి సినిమా విశేషాలను, శ్రీనివాస్‌గారి ద్వారా తెలుసుకుంటున్నాము ఎంతైనా శ్రీనివాస్‌గారు అభినందనీయులు.

వి. జె. స్వామి, (భువనేశ్వర్)

* * *

సినిమా విషయంలో— సంక్రాంతి సంచికలో శ్రీనివాస్‌గారు నాగేశ్వరరావు చిత్రాల గూర్చి వ్రాస్తూ, "దొరబాబు పాత్ర చాలా మందికి నచ్చలేదు. అక్కినేని వెయ్యతగ్గ వేషం కాదన్నది నా అభిప్రాయం" అని అన్నారు. కాని చిత్రం విడుదల అయే వరకు ప్రతివారం పత్రికలోను దొరబాబులో అక్కినేని నటనగూర్చి తెగ ప్రశంసించేరు. యిప్పటి యీ అభిప్రాయం అప్పుడు కలగలేదా శ్రీనివాస్ గార్కి! అయినా ప్రజలకి నచ్చని చిత్రం యింకా ఎందుకు ఆడుతున్నట్టో!

పి. వి. రామశర్మ (విశాఖపట్నం—4)

* * *

సంక్రాంతి సంచికలో శ్రీనివాసుగారి "సినిమా విశేషాలు"లో చిన్న పొరపాటు జరిగింది. "1974లో మన నటులు" అనె శీర్షికలో శ్రీనివాస్ కృష్ణను గూర్చి వ్రాస్తూ, ఆయన 74 లో నటించిన 12 చిత్రాలను మాత్రమే వ్రాశారు. కృష్ణ 74 లో 13 చిత్రాలలో నటించారు. శ్రీనివాస్ 'ఆడంబరాలు—అనుబంధాలు' అనే చిత్రాన్ని తెలుపలేదు.

యుస్. బుచ్చిబాబు, (వెలగలేరు.)

వానపాముల్లో లోహాలు

ది. 31.1.75 వ తేదీ గల "ఆంధ్ర సచిత్ర వారపత్రిక" (38 వ పేజి)లో "వానపాములలో లోహాలు" అను శీర్షిక క్రింద మీరు ప్రచురించిన వివరాలు చదివితిని. పాశ్చాత్య దేశాలలో జరిపిన పరిశోధనలవల్ల వానపాముల శరీరములలో సీసము, తుత్తునాగము, నికెల్ ఇత్యాది లోహములు కనుగొనబడినాయని అందులో వుంది.

కాని అనేక వేల సంవత్సరముల క్రిందటనే ప్రాచీన మహర్షులు వ్రాసిన ఆయుర్వేద గ్రంథాలలో, వానపాముల శరీరముల నుండి లోహములు వెలువరించే పద్ధతులు చెప్పబడియున్నాయి. క్రింది ఉదాహరణలు గమనించ ప్రార్థన.

వాగ్భటకృతమైన "'రసరత్నసముచ్చయం" సంస్కృత భాషయందు ప్రకటించబడినది. దానికి శ్రీ చిపుకుల సత్యనారాయణశాస్త్రిగారి తెలుగు టీకలు సుమారు 50 సం.లకు పూర్వమే ప్రచురించబడినది. దీనిలో భూనాగసత్వము తీయువిధము వర్ణింపబడినది.

భూనాగము అనగా వానపాము :

"తగినన్ని వానపాములను తెచ్చి పేడతోకలిపి పిడకలుచేసి ఎండించి, వానినికాల్చిబూడిదచేసి, ఆబూడిదను నీటితో కడిగి, పై బూడిదను తొలగించవలెను. ఇట్లు కొన్నిసార్లు కడిగిన అడుగున, రాగి రంగుగల రవ్వలు కనబడును. వీనిని బంగారుతో కలిపి, కరిగించి ముద్రికలు చేయుదురు"

ఇట్లు వానపాముల నుండి లోహము తీయు పద్ధతి వర్ణింపబడినది. అదేగ్రంథమునందు వానపాములను నెమళ్ళచేతగాని, కోళ్ళచేతగాని తినిపించి వానిరెట్టను క్షీరపదార్థములతోకలిపి నూరి, కాచ్చి మసిచేసి నీటితోకలిపి, పైతేటను పారబోసి అడుగున రవ్వలవలె, బరువైన లోహసంబంధమైన భూనాగసత్వము గ్రహించువిధము వర్ణింపబడెను. పై విషయములనుబట్టి ఈ నాడు మనము నిర్లక్ష్యము చేయుచున్న ఆయుర్వేదశాస్త్రమున, ఆధునిక శాస్త్ర పరిశోధనలా కనబడుచున్న ఎన్నో విషయములు తెలుపబడియున్నట్లు మనము గ్రహింపగలము.

పిల్లలమర్రి వెంకట రామయ్య (రాజమండ్రి)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెం శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 - 1972)
శుక్రవారం : 21-2-'75
ఆనందనామ సం. మాఘమాస శు. దశమి
సంపుటము : 68 సంచిక : 23
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
★
సంవత్సర చందా – రు. 33–80 పై.
ఆరుమాసాల చందా – రు. 16–90 పై.
విడిప్రతి వెల 60 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520003.

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :
నటి భారతి

హైదరాబాద్ నోట్‌బుక్

—తిరుమల రామచంద్ర

నూతన శాసన సభాపతి :

శ్రీ రేబాలదశరథరామిరెడ్డి శాసన సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అందరికీ సంతోషం కలిగించింది. శ్రీ దశరథరామిరెడ్డి ప్రముఖన్యాయవాది. శాసన సభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా, జిల్లాసహకారబ్యాంకి అధ్యక్షులుగా, పూర్వపుమద్రాస్ రాష్ట్ర సహకార బ్యాంకి ఉపాధ్యక్షులుగా, ఆంధ్ర రాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సహకారబాంకు అధ్యక్షులుగా రాష్ట్ర రోడ్డురవాణాసంస్థసభ్యులుగా ఆంధ్రప్రదేశ్ కోస్తాప్రాంత అభివృద్ధి మండలి అధ్యక్షులుగా ఎంతో అనుభవంగలవారు· 67 సంవత్సరాల వారయినా కార్యదక్షతలో యువకులు. ఆయన అభినందనలకు సమాధానం చెబుతూ అన్నట్టు శాసనసభ గౌరవప్రతిష్ఠలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పరిరక్షిస్తారనడంలో సందేహం లేదు.

జంటనగరాలలో రిపబ్లిక్ దినోత్సవం నిరుడికన్నా మహోత్సాహంగా జరిగిందని వాడవాడ తిరిగిన నేను గట్టిగా చెప్పగలను. కొన్ని వాడలలో ప్రతిచౌరాస్తాలోను పతాకంనాటడం, జాతీయ గీతాలాపన, ప్రసంగాలు జరిగాయి. సికింద్రాబాద్ పెరేడుగ్రౌండ్సులో తాత్కాలిక గవర్నర్ శ్రీ ఎస్. వోబుల్‌రెడ్డి సైనిక వందనం స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ వోబులురెడ్డి జనవరి 25న శ్రీ ఖండూభాయ్‌దేశాయ్ స్థానంలో తాత్కాలిక గవర్నర్‌గా నియమితులయారు. ఆయన జనవరి 27న శాసన సభ, ఉభయ శాసన సభల సమావేశాన్ని ప్రారంభిస్తూ ఈ సంవత్సరం కూడ ఆంధ్రప్రదేశ్‌లో బాగా పంటలు పండగలవని ఆశాభావం ప్రకటించారు. ఇదివరకు గవర్నర్‌గావున్న శ్రీ ఖండూభాయ్‌దేశాయ్‌కి జనవరి 22న ఘనంగా వీడ్కోలు యివ్వబడింది. ఆయన జనవరి 25న పదవి నుంచి విరమించారు.

శ్రీ గిరికి 'భారతరత్న' బిరుదు :

మాజీ రాష్ట్రపతి శ్రీ వరాహగిరి వెంకటగిరికి 'భారతరత్న'బిరుదం లభించడం ఆంధ్ర ప్రజలకందరికీ ఆనందం కలిగించింది. శ్రీ గిరి కాలంలో దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయి. తూర్పుపాకిస్తాన్ బంగ్లాదేశ్ అయింది. భారత శాస్త్రజ్ఞులు శాంతియుత కార్యక్రమాలకోసం అణ్వస్త్రాలను తయారు చేయగలిగారు. ఇలాటి గొప్ప విజయాలు సాధించటానికి కారణమైన శ్రీ గిరికి భారతరత్న బిరుదం లభించడం ఎంతైనా ఉచితం. అలాగే సంఘానికి ఎన్ని విధాలుగానో సేవ చేసిన డాక్టర్ చింతామణి దేశ్‌ముఖ్‌కు, శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌కు పద్మవిభూషణ బిరుదం లభించడమూ జంటనగరాల ప్రజలకు సంతృప్తి కలిగించింది. ప్రముఖ రంగస్థల నటుడు శ్రీ కె. రఘురామయ్యకు (ఈలపాట రఘురామయ్య), ప్రముఖ సంఘసేవిక శ్రీమతి ఎ.డబ్ల్యు. అహమ్మద్‌కు పద్మశ్రీ లభించాయి. శ్రీ రఘురామయ్య డెబ్బదిఏళ్ళవాడైనా, యువకునివలె ఈలపాట పాడగలరు, నటించగలరు. పాతతరం నటులలో మిగిలినవారు ప్రస్తుతం ఈయన ఒకరే. పలువురు పోలీసు ఉద్యోగులకు రాష్ట్రపతి పతకాలు లభించాయి. కాని రచయితకు ఎవరికీ రాలేదని నా మట్టుకు నాకు విచారంగానే వుంది.


సాహిత్యంలో భాష :

మైసూరులోని మానస గంగోత్రి ఆవరణలో వున్న కేంద్రభాషా సంస్థ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజస్) "సాహిత్యంలో భాష"అనే గోష్ఠిని జనవరి 16, 17, 18 తేదీలలో జరిపినప్పుడు, తెలుగువారు పలువురు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి నేను (తిరుమల రామచంద్ర) పాల్గొని "మధ్యతరగతి భాష" అనే పరిశోధన వ్యాసం చదివాను. 16వ తేది ఉదయం ఈ గోష్ఠిని ప్రముఖ ఆంగ్ల రచయిత శ్రీఆర్. కె. నారాయన్ ప్రారంభించారు. రోజుకు రెండు సమావేశాలు జరిగాయి. సంస్థ డైరెక్టర్ డాక్టర్ దేవీప్రసన్న పట్నాయక్ స్వాగతం చెబుతూ రచయిత రచనలలో భాషను ఎలా వాడతాడో వానిశక్తి ఏమిటో వివిధ భారత భాషల సాన్నిహిత్యం ఎంతవరకు వుందో తెలుసుకొని సన్నిహితత్వం సంపాదించడం ఈ గోష్ఠిలక్ష్యమన్నారు. శ్రీ నారాయన్ రచయితగా తన అనుభవాలు చెప్పారు. కొలంబియా విశ్వ విద్యాలయం భారతశాఖ ఆచార్య బార్బరాస్టోలర్ మిల్లర్ సంస్కృత కవితలో "శృంగార భాష" అనే విషయంపైన, నవకాంతబారువా కవితపై బెజిబారువా వ్యాసాలు చదివారు. రెండవనాడుమైసూరు విశ్వవిద్యాలయం ఇంగ్లీషు ప్రొఫెసర్ శ్రీ సి. డి. నరసింహయ్య అధ్యక్షత వహించారు. కమల్‌కుమార్ మజుందార్ రచనలలోని అస్తవ్యస్తతను శ్రీమతి నవనీతాసేన్ (జాదవపూర్ విశ్వవిద్యాలయం) సమకాలిక తమిళ సర్జనాత్మక రచనలలో ... ర భాషపై శ్రీ వి. జ్ఞానసుందరం, శ్రీ పెరియా

(10వ పేజీ చూడండి)



నీకు బొత్తిగా బుర్రలేదు - పదిమంది ప్రజలమీద పెత్తనం చెలాయిస్తాం గాని పెళ్లాంమీద చెలాయిస్తామటోయ్ !



నేను కొత్తగా బదిలీవచ్చి ఆఫీసులో అడుగు పెట్టగానే దాదాపు అందరూ తలోసారి చెప్పిన మాటల సారాంశ మల్లా ఒక్కటే—

"అటెండరు అప్పలాజుతో చాలా జాగ్రత్తగా ఉండాలి సార్! పక్కా తాగుబోతు వెధవండీ! ఏదో ఒక వంక చెప్పి, ఎప్పుడూ డబ్బులు అప్పు అడుగుతుంటాడు.

చోటుపెట్టారో, మళ్లీ మళ్లీ పీక్కు తింటాడు! అసలు కొద్దో గొప్పో ఇవ్వక పోయినా ముప్పే వాడితో. మీ సీట్లో ఏదో ఒక ఫైలుదాచేసి మిమ్మల్ని ఇరకాటంలో పెడు తుంటాడు సార్!" అని.

ఈ అటెండరుసంగతి చాలా విచిత్రంగా ఉందే అనుకుంటూ సీటులో కూర్చొని పనిచేసుకొంటున్నాను.

"నమస్కారం సార్!"

తలెత్తి చూశాను.

"నేనే సార్! అటెండరు-అప్పలాజును. నన్నుగురించి తమరు రాగానే చాలామంది మీకు చెడుగా చెప్పిఉంటారని నాకుతెలుసు! నేనలాంటివాణ్ణి కాదుసార్! అంతాఅబద్ధం! మీరే చూస్తారుగా!" అన్నాడతను.

పీక్కుపోయిన ముఖం, లోతుకుపోయిన కళ్ళు-తైలసంస్కారం నోచుకోని జుట్టు. ఆకుమడిలా పెరిగిన గడ్డం. అస్థిపంజరాన్ని గుర్తుకుతెస్తున్న శరీరం-భుజంమీద చిరిగిన చొక్కా-ఇది అతని అవతారం. మనిషి చాలా దీనంగా కనిపిస్తున్నాడు. ఇంతలో అతనే మళ్లీ అందుకున్నాడు.


"ప్రస్తుతం రికార్డు సెక్షనులో అట్టే పనిలేదు సార్! రెండుగంటలవరకు మీకేదన్నా ఎసిస్టెన్స్ కావాలంటే ఇస్తాను. పనేమన్నాఉంటే ఇవ్వండిసార్"

"ఇతని సరుకెంతో టెస్టుచేద్దాం!" అనుకుని ఒక స్టేట్‌మెంట్ ఇచ్చి- "కాపీచేసి చివర టోటల్సు వెయ్యి"మన్నాను. ఆశ్చర్యం! అంతపెద్ద స్టేట్‌మెంటూ అతను అర గంటలో వేసేశాడు. పది నిముషాల్లో టోటల్సు వేశాడు. అతని చేతిరాత ముత్యాల బాటలా ఉంది. తప్పు పట్టుకుందామని టోటల్సు నేను చెక్‌చేశాను. నాకాపని అరగంట పట్టింది గానీ, తప్పు మాత్రం

దొరకలేదు. అతన్ని మనసులో అభినందించకుండా ఉండలేకపోయాను.

"సార్! ఇలా చూడండి!" అన్నాడతను. అతని చేతిలో – నా సీటులోంచి తీసిన ఒక ఫైలుంది. ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూశానతనివైపు.

"దీనిలో ఒక తప్పుంది సార్! పట్టుకోండి!" అన్నాడు–ఫైలు నాచేతికిస్తూ.



అదినా "ప్రెడిసిసర్" "డిస్పోజ్" చేసిన ఫైలులోని "రిపోర్టు" ఆ పేజీ మొత్తం చదివాను. మామూలుగా చదివానేమో నాకేమీ తప్పు కనిపించలేదు.

"ఏమీ తప్పున్నట్టు లేదే!" అన్నాను – అతనివైపు చూస్తూ."

"అలా అంటే ఎలాసార్! తమరు పరీక్షగా చూసినట్టులేదు." అతను చాలా వినయంగా అన్నాడు.

అతని ముందు ఓడిపోవటం ఇష్టంలేక, మరొక్కసారి, ఆ డిస్పోజలును పరీక్షగా చదివాను. ఈసారి తప్పు దొరికింది గూడాను, ఇంతకు ముందు పరీక్షగా ఫైలు చూడనందుకు నొచ్చుకున్నాను. ఇంతకీ ఆ తప్పేమిటంటె చాలా నవ్వొచ్చే ఆంగ్ల పదం.

"నన్ ఆఫ్‌ది ఫీల్డు ఆఫీసర్స్ హాజ్ నాట్ సబ్‌మిటెడ్ హిజ్ రిపోర్ట్!" అని ఉంది ఒకచోట.

ఏఫీల్డు ఆఫీసరూ–తన రిపోర్టు పంపి ఉండలేదు అని అర్థమివ్వటానికి బదులు – ఆ వాక్యం – దానికి వ్యతిరేకమైన అర్థమిస్తోంది–మధ్యలో "నాట్" అనే ఆంగ్ల పదం అనవసరంగా ఉపయోగించటంవల్ల.

ఆ డిస్పోజలును క్రింద నుంచి పైవరకూ –అందరూ తమ విలువైన సంతక రాజాలతో అలంకరించారు గనుక, అది అలాగే చేరవలసిన ఆఫీసులకు వెళ్ళిపోయింది.

దాని సంగతలా ఉంచండి. అటెండరు అప్పలరాజు పట్టుకున్న తప్పు ఇదేనని నమ్మకమేమిటి? అందుకని అతనితో– "మిస్టర్! అప్పలాజూ! ఆతప్పేదో నాకు తెలిసింది. నేను అటు తిరిగి ఒక కాగితంమీద రాస్తాను దాన్ని. నువ్వటు తిరిగి మరో కాగితంమీద రాయి." అన్నాను. ఇద్దరం అలాగే చేశాము. అతని కాగితం తీసుకుని చూద్దానుగదా! అతను రాసినది ఆవిషయమే! అప్పలరాజు సునిశిత బుద్ధిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. అతనంటే ఎందుకనో నాకు అభిమాన మేర్పడింది.

"మరి నిన్నందరూ అలా చెడుగా చెపుతుంటా రెందుకని? నువ్వు జీతమంతా తాగుడుకు తగలేసి – ఇంట్లో పెళ్ళాం పిల్లలను పస్తులు పడుకో పెడతావటగా! రోజూ ఇతరుల్ని పీక్కుతింటావటగా!" ఆదరంగా ప్రశ్నించాను.

"సార్! నన్ను గురించి నేను చెప్పుకుంటే ఏం బాగుంటుంది చెప్పండి? ఎప్పుడో నూటికొకసారి తాగే నామీద ఈ ఆఫీసులో అంతులేని దుష్ప్రచారం! నిజానికివ్వాళ ఇంటిలో తిండి గింజలు కూడా లేవు. రాత్రికి నేను నాభార్యా పిల్లలు పస్తే! అయినా ఇవాళ తమబోటి వాళ్ళ కెవరికీ శ్రమ ఇవ్వదలుచుకోలేదు. చస్తే చస్తారు! చావనీయండి! జనాభా అన్నా తగ్గుతుంది" అన్నాడు. అతను రోషంగా – అసహాయంగా అన్నా అతని కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరగటం నేను గమనించక పోలేదు. అతని తీరు చూస్తే అతని మీద, అతని ఆర్థిక దైన్యస్థితిమీద, నా కంతులేని సానుభూతి కలిగింది.

వెంటనే జేబులో నుంచి ఓ అయిదు రూపాయలు తీసి, అతని కివ్వబోతూ – "దీనితో బియ్యం కొనుక్కుని మీ యింటికి తీసుకెళ్ళు." అన్నాను.

అంతలో ఒక "కొలీగ్" కల్పించుకొని "ఏమోయ్! అప్పలరాజూ! ఏమిటివ్వాళ సెక్షన్ హెడ్‌గారినే పట్టావ్! బలేవాన్ని కొట్టావులే! త్వరగా వెళ్ళుమరి! రత్తమ్మ సారాకొట్టు ఎదురు చూస్తుంటుంది!" అన్నాడు వెటకారంగా.

అప్పలరాజు ఏదో చెప్పబోయేటంతలో — ఆ కొలీగ్ తనే మళ్ళీ కల్పించుకుని– "సార్! అదంతా నాటకం! మీ రిచ్చే అయిదురూపాయలు వాడింటికి వెళ్ళవు. రత్తమ్మ సారా కొట్టుకి వెడతయి. పైగ అంతఃబబ్బ ఇవాళ

విూరిచ్చి, వాడిని మరో రెండు గ్లాసులు ఎక్కువ త్రాగమని పురికొల్పిన వారవుతారు. గుర్తుంచుకోండి!" అన్నాడు పెదవి విరుస్తూ.

నేనొక్క నిముషం ఆలోచించాను. డబ్బిస్తే నిజంగా అతనన్నట్లు అప్పలరాజు తాగి తగలెయ్యొచ్చు. అలా చేస్తేనో......? అనుకున్నాను. వాస్తవానికి నేను ఆలోచించిన పనికి ఏ ఫ్యానునో పంపవచ్చు. కానీ, అలా చేస్తే నాకు మనశ్శాంతేం ఉంటుంది? అందుకని నేను రిక్షాలో ఎక్కికూర్చుని "రా! అప్పలరాజా! రిక్షాఎక్కు!" అన్నాను.

"ఎక్కడికిసార్!" అన్నాడు అప్పలరాజు ఆవలించేసి.

"రత్తమ్మఇంటికి కాదులేవోయ్! రా!" అన్నాను నవ్వుతూ.

అతను రిక్షాఎక్కి నా ప్రక్కన బిడియ పడుతూ కూర్చోగానే కొంతమంది నావైపు ఆశ్చర్యంగా — కొంతమంది జుగుప్సగా చూశారు—ఇతని కేమన్నా మతి పోయిందా ఏమిటి అన్నట్లుగా. కాని నేను చిత్తశుద్ధిగా చేయదలచుకున్న పనిని అంతమాత్రం చేత వాయిదా వేసుకునే మనస్తత్వం కాదునాది.

రిక్షాని బజార్లోఆపి ఓ బియ్యపుకొట్లో అయిదు రూపాయల బియ్యం రెండు పొట్లాలుగా కట్టించాను. మా యిద్దరి చేతుల్లో సంచిఏదీ లేకపోవటంవల్ల, "రిక్షా వాడికి మీ యింటిఅడ్రసు చెప్పు అప్పలరాజు!" అన్నాను అతన్నుద్దేశించి. అతను అలాగేచేసి రెండు చేతులు జోడించి నాకు కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరిస్తూ "మీరెంత మంచి వారు సార్! నాకు మా పిల్లలకు రెండు రోజులు అన్నం పెడుతున్నారు" అన్నాడు.

"ఊహూ! అలా పొగడకు! అలా చేస్తే నేను చేసినదానికి ఫలిత ముండదు" అన్నాను. అప్పలరాజు పేదకుటుంబాన్ని నాశాయశక్తులా ఆదుకుంటున్నానన్న భావం నా కెంతో సంతృప్తిని కలుగ జేసింది.

ఇంతలో అప్పలరాజు ఇల్లు వచ్చేసింది. అతను బియ్యపు పొట్లాలని ఇంట్లో పడేసి రాగానే తిరిగి ఇద్దరం రిక్షాలో ఎక్కి ఆఫీసుకు వచ్చేశాం.

నేను చేసిన మేలును గురించి నన్నో- ఆప ద్బాంధవుడిలా - అనుకున్న దేవుడిలా చిత్రీక రించి ఆఫీసులో అందరికీ చెప్పి తెగ పొగిడే వాడు అప్పలరాజు. ఎందువల్లనో గాని ఆఫీసులో వారెవరూ నా మీద ఎలాంటి వ్యాఖ్యా చేయలేదు.

"శలవు సార్! నమస్కారం. కాస్త ఈ పేదవాణ్ణి అప్పుడప్పుడూ ఇలా కనికరిస్తూ ఉండండి! మీ పేరు చెప్పుకుంటూ ఉంటాము మా యింటిల్లపాదీను— నా చేత మీకు కావలసిన ఆఫీసుపని—సొంతపని చేయించు కోండి—నేను మీకు నమ్మినబంటును" అంటూ వెళ్ళిపోయాడు అప్పలరాజు.

"ఇతనిని త్వరలోనే త్రాగుడుకు పూర్తిగా దూరం చేయగలను నేను" అనుకుంటూ తృప్తిగా నిట్టూర్చాను,

ఆఫీసులో నా పని ముగిసే సరికి రాత్రి ఏడుగంటలయింది. అప్పటికి మిగతావాళ్లంతా వెళ్లిపోయి చాలా సేపయింది. హోటలుకెళ్లి భోజనంచేసి కొత్తపేటలోని నా రూముకు

తిరుగుముఖం పట్టాను. రిక్షాలోవెళ్లే కన్నా, నడక వంటికి మంచిదని మెల్లిగా అడుగు లేస్తున్నాను" రత్తమ్మ సారా దుకాణం, అన్న బోర్డు ఒకచోట కనుపించగానే కాళ్లకు బ్రేక్ వేసినట్లుగా ఆగిపోయాను. అంతేకాదు షాక్ తిన్నట్లు ఫీలయ్యాను ఆ దృశ్యంచూసి.

అక్కడ అప్పలరాజు — అమెండరు అప్పలరాజు — ఆఫీసువాళ్ల నోళ్లల్లో నానే అప్పలరాజు — అకస్మాత్తుగా నా అభిమానం సంపాదించుకున్న అప్పలరాజు — ఓ బల్లకు జేరబడి నిషాలో మునిగితేలుతూ—"సాయ్యోహె! ఏందనుకున్నావో...గుద్దుకు చంపేస్తాను ... నాయాల్ది ..." అంటూ ఇంకా ఏమేమో పేలుతున్నాడు. బాగా పట్టించినట్లుగా ఉంది వాలకం.

నాకు అప్పలరాజుమీద బలేకోప మొచ్చింది. దాన్ని ఆశ్చర్యం జయించింది. నా అంతరం గాన్ని మధిస్తే — వేధించి సాధించే ప్రశ్నల్లా ఒక్కటే! అప్పలరాజుకు త్రాగటానికి డబ్బె క్కడిదీ రోజు? గబగబా నడచి వచ్చి సారా దుకాణంలోకి అడుగు పెట్టిన నన్ను చూసి అక్కడ తెలిసిలో వున్న కొంతమంది ఆశ్చర్య పోయారు. నిషాలో ఉన్నవారు నా ఉనికిని పట్టించుకోవలసిన స్థితిలో లేరు.

పిప్పళ్లబస్తాలా ఉన్న రత్తమ్మ నన్ను విగాదిగా చూసి "ఏంబాబూ! మీరూ ఈ సరుకు తాగుతారా? వింతగా ఉందే!" అంది —కళ్లు పెద్దవిగా భయంకరంగా చేసి.

"అదిసరేగాని రత్తమ్మా! ముందీ సంగతి చెప్పు, ఈ అప్పలరాజు నీ కెంతిచ్చిలాగాడు?" అన్నాను ఆత్రుతగా.

"రోజూ రూపాయో- అర్ధోకన్నా ఎక్కువ తేలేని ఈ సన్నాసి ఇయ్యాల అయిదు రూపాయల సరుకు పొయ్యమని పూటుగా తాగాడు బాబుగారూ! అయితే డబ్బిచ్చి మాత్రం కాదండోయ్..." అని ఆగింది రత్తమ్మ.

"అంటే!" అన్నాను కంగారుగా— —ఉత్కంఠ ఉరకలేస్తోంది నాలో.

"ఎవరో ఓ మారాజు తిండిగింజలు కొని చ్చాట్ట కాసిన్ని. అవి తీసుకొచ్చి సరుకు పొయ్య మన్నాడు.ఏదైతే నాకేటిబాబూ! అందులో బంగారం లాటి బియ్యం గూడాను. ఇదిగో చూడండి!" అంటూ గజగమనంతో లోని కెళ్లి పట్టుకొచ్చింది రత్తమ్మ.

అవి అక్షరాలా నేను కొనిచ్చిన బియ్యపు పొట్లాలు! హతాశుణ్ణై వెనక్కు తిరిగాను. అడుగులు భారంగా పడుతున్నాయి. అంత కన్నా భారంగా ఉంది మనసు. మా కొలీగ్ అన్న మాటలు చెవుల్లో గింగురు మన్నాయి.

"మీరివ్వాళ వాణ్ణి మరో రెండుగ్లాసులు ఎక్కువ త్రాగమని పురికొల్పిన వారవు తున్నారు"

"తాగి తగలేస్తావని డబ్బును బియ్యంగా మార్చి యిచ్చాను నేను — నువ్వు బియ్యాన్ని మీ కుటుంబం కన్నీళ్లని— ఆకలి కడుపుల్ని— గ్లాసులోని సారాగా మార్చావు— ఆఫ్ట్రాల్— నీముందు నేనెంతోయ్ మిస్టర్! అప్పలరాజా! యూ ఆర్ రియల్లీ గ్రేట్!— ది గ్రేట్— నిజంగా నీముందు నేనోడిపోయాను— నిన్నా త్రాగుడు నుంచి భగవంతుడు గూడా మాన్పించలేడు."

ఎవరో వికటాట్టహాసం చేసినట్టయింది. కాదు. వెక్కిరిస్తున్నట్టుంది. ఇంతకూ అదెవరు? — నా సానుభూతి!— ఫలించని సానుభూతి!!


తప్పక చూడండి!
తారకరామా పిక్చర్స్ వారి
కథానాయకుని కథ
దర్శకత్వం: డి. యోగానంద్ నిర్మాత: కె. డి. వి. ప్రసాద్, బి.ఎ.
VIJAYA
విజయా కంబైన్స్

ధర్మపథం — అసంతృప్తి — బులుసు వెంకటరమణయ్య

మానవునికి ఆస్తిపాస్తులు సమృద్ధిగా ఉండవచ్చును. కీర్తి ప్రతిష్ఠలకున్నూ లోటు లేకుండా ఉండవచ్చు. అయినా చాలా మందికి వాటి విషయంలో సంతృప్తి ఉండదు. ఇంకా, ఇంకా కావాలనే ఆశ వుండనే వుంటుంది. దీన్ని గురించే ఈ శ్లోకం ప్రసిద్ధంగా ఉన్నది.

"నిస్స్వో వష్టి శతం శతీ దశశతం
లక్షం సహస్రాధిపః
లక్షేశః క్షితిపాలతాం క్షితిపతిః
చక్రేశతాం వాంఛతి,
చక్రేశః సురరాజతాం సురపతిః
బ్రహ్మాస్పదం వాంఛతి
బ్రహ్మా శైవపదం శివో హరిపదం
హ్యాశావధిం కో గతః ?"

డబ్బు లేనివాడు తనకు నూరు రూపాయలుంటే బాగుండునని అనుకుంటాడు. నూరు రూపాయలు లభించినట్లయితే తృప్తిపడక వెయ్యి రూపాయలు లభిస్తే బాగుండునని కోరుతాడు. వెయ్యి రూపాయలు వచ్చేయనుకోండి. ఇంకా ఆశతో తాను లక్షాధికారి కావాలని కోరుతాడు. లక్షాధిపతి అయినా తృప్తిపడక తనకు రాజ్యం లభిస్తే బాగుండుననుకుంటాడు. అది లభిస్తే చక్రవర్తిగా కావాలంటాడు. చక్రవర్తిత్వం లభించినా అంతటితో తృప్తిపడక ఇంద్ర పదవిని అభిలషిస్తాడు. అది లభిస్తే బ్రహ్మపదవి కావాలంటాడు. అది దొరికితే పరమేశ్వరుని స్థానాన్ని కోరుతాడు. అది లభిస్తే విష్ణు పదవినే ఆక్రమించాలనుకుంటాడు. ఇలా కోరికలు పెరుగుతూనే ఉంటాయి. ఆ ఆశకు అంతమనేది లేదు. అని దీని అభిప్రాయం.

ఈ విధంగా ఆశాపాశం చేత బద్ధులైన



వారు సంసారమనే మాయలో పడి చివరకు దుఃఖాన్నే అనుభవిస్తారు. అసంతృప్తి అనేది మానవుణ్ణి అజ్ఞాన మార్గంలోనే నడిపిస్తుంది. ఆశకు అంతమనేది ఉండాలి. అత్యాశ ఎంత మాత్రమూ తగదు.

అత్యాశ ఉన్నవానికి ఎప్పుడూ అసంతృప్తియే!

హైదరాబాద్ నోట్‌బుక్ (5వ పేజీ తరువాయి)

శ్వార్, శ్రీ సీతాంశు యాష్ చంద్ర (గుజరాత్) ఉమాశంకర్ జోషి, ఆలన్ జిన్స్‌బర్గ్ కవిత్వాలపైన డాక్టర్ హెచ్. ఎస్. బిలిగిరి(పూనా) నవ్యాంగ కవులు అంత్యప్రాసంలో చేస్తున్న పొరపాట్లపైన, సంస్థ పరిశోధనాధికారి, ఈ గోష్ఠి కార్యదర్శి శ్రీ బి. బి. రాజ్‌పురోహిత్ బేంద్రే కవిత్వంలోని అస్పష్టభాషను గురించి, వ్యాసాలు చదివారు. గోష్ఠిలో అన్నిభాషల వారు పాల్గొన్నారు. పాల్గొన్న తెలుగు వారిలో సదరన్ రీజినల్ భాషల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వి. వి.ఎల్. నరసింహారావు, లెక్చరర్లు, డాక్టర్ యద్దనపూడి వెంకటరమణారావు, శ్రీ కె. విశ్వనాథం రీసెర్చ్ అసిస్టెంటు శ్రీ పి. రామనరసింహం, జూనియర్ పరిశోధనాధికారి డాక్టర్. జి. సాంబశివరావు, గణాంకశాఖ తాలూకు శ్రీమతి శకుంతలాశర్మ శ్రీ డి. బసవయ్య, శ్రీ ఎం. తాతాజీ (సంస్థలోని లాంగ్వేజి లేబరేటరీ) మొదలయిన వారున్నారు. గోష్ఠి తర్వాత శ్రీ తాతాజీ, డాక్టర్ రాజ్‌పురోహిత్ ప్రతినిధులకు సంస్థలోని వివిధ శాఖలను చూపారు. సంస్థ దక్షిణభాషల బోధన విషయంలో చేస్తున్న అపూర్వ కృషికి ప్రతినిధులందరూ ఆశ్చర్యపడ్డారు. వీటన్నిటికీతోడు డైరెక్టర్ దేవీ ప్రసన్న పట్నాయక్, ఆయన శ్రీమతి మొదలయినవారి సౌజన్యాదరాలు చాలా ఆనందం కలిగించాయి.

ఉపశ్రుతి :

మైసూరులో బస్సులో వెళ్ళుతుండగా, కండక్టర్ డబ్బులు తక్కువ తీసుకుని టిక్కెట్లు ఇవ్వకపోవడం చూచి, "ఇది మా ఆంధ్రప్రదేశ్‌లోనే అనుకున్నాను. ఇక్కడ కూడా వుందా?" అన్నాను. పక్కనే వున్న తెలుగువారు కాబోలు "ఇందుగలడందు లేడని అన్నారు కదండి" అన్నారు. ఎవరా అని తిరిగిచూచాను.

ప్రశ్నావళి

వై. వి. ఆర్. ఆర్. హైద్రాబాదు.

మీరు ఆంధ్రప్రదేశ్‌కు రావాలని అనుకోడం లేదా ? మీ జీవితం అంతా తమిళనాడులోనే వుంటూ అరవతిండి తింటూ ఘాటుగా మాకు సమాధానాలు చెప్తూనే వుంటారా ?

ఘాటుగా సమాధానాలు చెప్పడానికి గుంటూరు గొడ్డుఖారమే తినక్కరలేదని నిరూపించవద్దా తమ్ముడూ...

ఎమ్. వి. ఎన్. ఎమ్. విశాఖపట్నం.

ఆడవాళ్లకి చదువెందుకండీ, దండగ.

ఎవరికీ— చదువెందుకని అడక్కండి.... చదువు ఉద్యోగం కోసమేకాదు. పీలాకట్నం కోసమే కాదు. జీవితాలు సాఫీగా సాగిస్తుందేగాని పరుగెత్తనివ్వదు— చదువు. క్రమశిక్షణకు లొంగనిస్తుందేగాని బానిసలను కానివ్వదు—చదువు.

పడివుండడానికి హోర్సు అని పేరు పెట్టి—మీ ఆడవాళ్లకి దాన్ని అంటకట్టారు. అది హో ఘనతేనా ?

హోర్సు చాలా శక్తివంతమైనది మూర్తిగారూ కాలం—హోర్సు కలిసి గొంగళీపురుగు సీతాకోక చిలుక అవుతూంది. తెలియదా ?

ఎం. వి. ఆర్. బూరుగ్గడ్డ.

మీ సమాధానాలను పట్టిచూస్తే మీరు మహం కాళీ దేవిలా వుంటారా ఏం ?

ఒక్క నాలుక మినహా. అమ్మవారిలా అస్తమానూ నాలుక బయట పడేయను అడపా తడపా 'టంగ్ ఇన్ ది చీక్' నాది !!

ఎమ్. వి. కె. ఆర్. సికింద్రాబాదు.

మన పిల్లలకీ పక్క పిల్లలకీ ఎందుకంత తేడా ?

అది సహజం. మన పిల్లల గోల సంగీతం. పక్కింటి పిల్లల సంగీతం గోల !!

జి. ఎస్. పుత్తూరు.

మనిషి కోరు కోరిక లేమిటి ?

ఒకటా వెయ్యా అలా చెప్పడానికి ? కాని ఒక్కటి మటుకు చెప్పకలను తమ్ముడూ, ఈ కోరికలు తీరే దారిలేదు. ఎందుకో తెలుసా ? "ఆనందం" స్టేషను ఐశ్వర్యానికీ పేదరికానికీ మధ్యది. ఏ రైలూ ఆగదు !

ఎస్. ఎస్. ఎస్. వి. ఆర్. ఆముదాలవలస.

పూర్వకాలంలో అమ్మాయిలు కాలేజీలకు వెళ్లేప్పుడు వచ్చేప్పుడూ క్రిందికి దించిన తల ఎత్తేవారు కాదు ! అని నా స్నేహితుడు చెప్తే ఆశ్చర్యం వేసింది. నిజమేనా ?

మీ స్నేహితుడే యుగం మనిషి బాబూ. నాకాలం లోనే అదిలేదు. ఇంక, బెనారెస్‌లో దుర్గబాయిగారు చదువుకునే రోజుల్లో సాయంత్రం జైలులా మూసేసేవారట గేట్లు. దానికి అభ్యంతరం చెప్తూ దుర్గాబాయిగారో పెద్ద పెట్టు అలజడిరేపి, ఆ పద్ధతికి స్వస్తి చెప్పించారట. అంచేత అప్పుడూ యీ వంచిన తల ఎత్తక పోవడం—లేదన్న మాటే— ఎక్కడెక్కడ స్త్రీలు అణగతొక్కబడినా అక్కడక్కడ ఆ కాలంలోనే తిరుగుబాటు తలెత్తిన సందర్భాలున్నాయి. అవి మీ మగవాళ్లు మరిచిపోయి— అన్ని కాలాల్లోనూ స్త్రీ బానిసగానే బ్రతికింది కదా— ఇప్పుడేంవచ్చిందీ ఇలాగోలచేయడానికి ! అనుకుంటూ వుంటారు !

ఎన్. వి. ఆర్. నరసాపురం.

ఎదుటి వారు మనకంటే ఉన్నతులు అవుతూ ఉంటే మనలో ఒక విధమైన బలహీనత ఏర్పడుతుంది. ఇది అభివృద్ధికి సోపానము అనుకోవాలా? ఎదుటి వ్యక్తి పట్ల అసూయ అనుకోవాలా?

పైకి వెడుతున్న వ్యక్తిని కూలదోయాలన్న తపనే అధికం అయితే— అసూయ అనుకోవాలి 'నేనూ అలా పెరగాలి. అందుకు శ్రమిస్తా'నని పోటీ పడ్డం ప్రారంభిస్తే— అభివృద్ధికి సోపానం అనుకోవాలి.

టి. జి. ఎ. ఇల్లెందు.

ఆడవాళ్ళు ఇల్లు దాటి బయటికివస్తే సమాజం వింతగా చూస్తారెందుకు ?

అలవాటు లేక. తరతరాలుగా తలుపుల వెనుక పడేసిన దాన్ని యీ రోజు నల్గురి మధ్య సగౌరవంగా చూడవలసి వస్తుందన్న చిన్నతనం వో పక్క, తమ ప్రత్యేకత పోతూందన్న భయం వో పక్క పీడించి— ఆడదాన్ని చిన్న చూపు చూసేలా చేస్తున్నాయి.

—కె. రామలక్ష్మి

కొత్త సీరియల్ **రంగుల వల** 7-3-'75 సంచికలో ప్రారంభం!

—సం.

రోజా

గోవిందరాజు సీతాదేవి

బ్రతుకు తెరువు కోసం ఏో చిన్న వుద్యోగంలో చేరటానికి భాగ్యనగరంలో అడుగు పెట్టింది వైదేహి. యెంతో కష్టంమీద ఏో కంపెనీలో టైపిస్టు వుద్యోగంతోబాటు మూడంతస్తుల మేడలోని పై భాగంలో చిన్నగది కూడా అద్దెకి దొరికిన తర్వాత 'అమ్మయ్య' అనుకోగల్గింది. ఈ ప్రయత్నంలో సాయపడిన దూరపు బంధువుకి మరీ మరీ కృతజ్ఞత చెప్పి తన గదిలోకి వచ్చింది.

దాదాపు ఆ మేడలో కాపురాలున్న వాళ్ళం దరూ వుద్యోగాల కోసం బైటకి వెళ్ళిపోయే వాళ్ళేలా కన్పించారు. కొన్ని కాపురాల వాళ్ళు యిళ్ళలోవున్నా భర్తలని ఆఫీసులకి పంపి తలుపులు బిగించి నిద్రపోవటమో లేక యిల్లు తాళం పెట్టి పేరంటాలకో లేక సినీ మాలకో వెళ్లిపోవటంగా కన్పించింది. ఉదయం తొమ్మిది వరకూ సందడిగా వుండే ఆ మేడ పది అవుతూనే నిశ్శబ్దం అయి పోయేది. మళ్లీ ఆరుగంటల కల్లా ఆ మేడలో రణగొణధ్వని మొదలయేది.

"యిన్ని కాపురాలున్నా తగూ లు లేనట్లుంది" అనుకున్న వైదేహికి కొన్నాళ్ల తర్వాత గానీ తెలియలేదు. అసలు వీళ్లకి పాపం టైము యెక్కడిదీ అని. ఆ మేడ యజమానురాలు చాలా మంచిదనే చెప్పాలి. ఒకటోతేదీ అవగానే వచ్చి అద్దె వసూలు చేసుకుని మళ్లీ ఫస్టుకి గానీ కన్పించదు. అద్దెలకున్న వాళ్ళు డబ్బు యెక్కువే యిచ్చినా హాయిగా బ్రతుకుతున్నాం అని తృప్తిగా గాలి పీల్చుకుంటూన్నారు.

వైదేహికి యిదంలా బాగానే వుంది కానీ ఆఫీసు లేని సమయంలో టైము గడవటం చాలా కష్టంగా వుంది. తనంత తను పరి చయం చేసుకోవాలంటే యిష్టంలేదు. పోనీ క్రింది వాటాల్లో వాళ్లయినా వాళ్లంతగా వాళ్లు పల్కరించేలా లేరు.

"ఏవూరు ఏంచేస్తూన్నారు" అని ఒక అరెండరు తల్లి అడిగి వూరుకుంది అంతే. యెవరికివారు యేదో మునిగిపోతూన్నట్లు వాళ్ల వాళ్ల టైముల ప్రకారం పరుగులు.

అబ్బ. యిక్కడి వాళ్లు బొత్తిగా యంత్రాల్లా వున్నారు అని విసుక్కుని ఈ నగరం అంతా యిలా లేదు. ఈ మేడలో వున్నవాళ్లే అని మరీ విసుక్కుంది. ఆ మేడ లోని పన్నెండు కాపురాల్లోని అందరినీ పరీక్షించి ఆఖరికి సాధ్వీమణితో పరిచయం చేసుకుంది. సాధ్వీమణి 'స్టెనో' ఆమె భర్త మరో కంపెనీలో 'స్టెనో'గా పనిచేస్తున్నాడు. ఆనందమూర్తి యెప్పుడు చూసినా హుషా రుగా నవ్వుతూ నవ్విస్తూ కాలం గడిపేస్తూ వుంటాడు. భార్యని కంటికి రెప్పలా చూసు కుంటూన్నట్లే కన్పించింది వైదేహికి.

పెళ్లి అయి రెండేళ్లు దాటినా పిల్లల కోసం ముచ్చటపడని ఆ యిద్దరినీ చూసి 'అబ్బ యిలా వుండాలి జీవితం అంటే' అను కుంది వైదేహి. సాధ్వీమణికీ వైదేహికీ పరిచయం — క్రమక్రమంగా పెరిగిన తర్వాత ఒక రోజు.

"వెధవ వుద్యోగం. విసుగ్గా వుంది. యింటికి కావల్సిన కనీసఔసరాలు సమకూర్చు కున్నాం. బ్యాంక్ బాలెన్స్ ఫర్లేదు. అయినా యింకా పిల్లలు అప్పుడేవద్దు అంటారు మావారు. నాకేమో బోర్‌లైఫ్ అన్పిస్తోంది" అంది దిగులుగా.

వైదేహి తెల్లబోయింది సాధ్వీమణి అలా అనేసరికి.

ఛీ. ఈవిడకి జీవితంలో సుఖపడటం చేత కాదు. అనుకూలుడైనభర్త యెంచక్కా ప్రతి పనిలోనూ సాయపడుతూ వంటపూర్తి చేసుకుని ఒకేసారి భోజనంచేసి స్కూటర్ మీద భార్యని కూర్చోబెట్టుకొని ఆమెని ఆఫీసు దగ్గర వదిలి తిరిగివస్తూ భార్యని తీసుకుని కావల్సిన సరుకులూ కూరలూ కొనుక్కుని యిల్లుచేర్చేభర్త లభించటం యెంతఅదృష్టం నిజం చెప్పాలంటే వైదేహి కంటే ఆనంద మూర్తే అందంగా హుషారుగా కన్పిస్తాడు. యిన్నివున్నా సాధ్వీమణికి జీవితం 'బోర్' అన్పి స్తోందిఅంటే యింక తనలాంటి పెళ్లికాని ఆడపిల్లలు వయస్సుమాట గుర్తుకి తెచ్చుకో టానికి ప్రయత్నించకుండా యంత్రంలామారి జీతండబ్బులు కూడా హాయిగా ఖర్చుచేసుకునే వీలులేక ప్రతినెలా తల్లిదండ్రులకి పంపుతూ 'పెళ్లి'అనే వూహ కలగా మిగిలిపోతూవుంటే కూడా ధైర్యాన్ని కూడగట్టుకుని యింత దూరంగా ఈ వుద్యోగంకోసం వచ్చి వంటరిగా బ్రతుకుతూన్న తనకు జీవితం యెంత 'బోర్' అనిపించాలి. కాలం మారిపోతోంది. కనీస అవసరాల ఖరీదే పెరిగి సామాన్య గృహస్తు నలిగిపోతూన్న ఈ రోజుల్లో నాలాంటి వైదేహిలు వందలూ వేలూ కాదు లక్షల్లో వుండే వుంటారు. అనుకుని నిట్టూర్పు విడుస్తుంది వైదేహి. పాతిక సంవత్సరాలు వెనక్కి తిరిగి చూస్తే ఈనాటిలా ఆడపిల్ల లని ఔసరాల కోసం యింతగా వుద్యోగాల్లో చేర్చి పెళ్లిళ్లమాట తలపెట్టేందుకే భయ పడలేదేమో ఆనాటి తల్లిదండ్రులు.

యీలాంటి ఆలోచనలు వైదేహికి మన శ్శాంతి లేకుండా చేస్తున్నాయని తెల్సినా వాటిని అరికట్టగల శక్తిలేదు. వంటరిగా తల్లిదండ్రులకి దూరంగా యిలా వుద్యోగం చెయ్యాల్సిందే. తప్పదు. ఆరుగురు ఆడపిల్లలు గల తన తండ్రి పెద్దపిల్లలిద్దరికి మాత్రమే పెళ్లి చెయ్యగలిగాడు. ఇంక కట్నాలిచ్చి పెళ్లి చేసేశక్తి లేక యస్సెల్సీ పూర్తి చేయించి టైపు పాస్‌కాగానే యెంతో ప్రయాసపడి ఈ వుద్యోగం వేయించుకున్నాడు కూతురికి. వైదేహికి తను అందగత్తెనని తెల్సు. సన్నగా పొడుగ్గా బంగారు తీగలా వున్నాననీ తెల్సు. ఈ అందం యే రాజకుమారుడు లాంటి వరుడినీ ఆకర్షించలేకపోయిందే అనే విచారం. యిరవైరెండేళ్ల వైదేహికి ఆ వయస్సులోని అందరమ్మాయిల్లానే అందమైన కలలు కనటం కూడా అలవాటే.

మూడో అంతస్తులో రెండే గదులు. ఒకటి వైదేహిది. మరొకటి తాళంవేసి వున్నదల్లా ఓ రోజు తెరిచి వుంది. పచ్చగళ్ల లుంగీ కట్టు కుని బనీను వేసుకుని భుజంమీద తువ్వాలు వేసుకుని యిటూ అటూ తిరుగుతూన్న అంద మైన యువకుడు ఆ గదిలో కన్పించేసరికి వైదేహికి క్షణం గుండె ఆగి తిరిగి కొట్టు కోవటం మొదలెట్టింది.

"యితనెవరూ! కొత్తగా వచ్చాడా లేక పాతవాడేనా అనే లక్ష సందేహాలని తీర్చుకునేం దుకు పరుగున సాధ్వీమణి దగ్గరకి వెళ్లింది.

ప్రారంభం!

తన ప్రశ్నలని వరసగా వదిలింది. అన్నీ విన్న సాధ్వీమణి తేలిగ్గా నవ్వేస్తూ.

''అబ్బ! యింతేనా! వేళగాని వేళలో వచ్చి తలుపుతట్టితే హడిలి చచ్చాను వైదేహీ'' అంటూ గుండెని రాచుకుంటూ కుర్చీలో కూర్చుని ఆ కుర్చీలో నువ్వూ కూర్చో తల్లీ అని గ్లాసుడు నీళ్ళుతాగి ''వైదేహీ అతనూ అతను పాండురంగమూర్తి అనీ ఓ చిన్న ఆఫీసరు. జీతం యెనిమిది వందలు రావచ్చు. వంటరిగానే వుంటాడు. వంటమాత్రం బాగా చేస్తాడు. యింతకిమించి వివరాలు కావాలంటే సాయంత్రం చెప్తాను. అవతల మావారి స్నానం పూర్తిఅయింది వస్తారు'' అనేసింది. వైదేహికి వళ్ళు మండిపోయి గిరుక్కున వెనక్కితిరిగి రెండేసిమెట్లు యెక్కి తన గదిలోకి వస్తూ తల తిప్పి పాండురంగ మూర్తి గదిలోకి చూసింది. అతను బట్టలు వేసుకుని ఆఫీసుకు కాబోలు రెడీ అయి డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని తలదువ్వుకుంటూ వెనక్కి తిరిగి చూశాడు.

వైదేహి చటుక్కున తల తిప్పుకుని వెళ్ళిపోయింది.

2

వారం రోజులు గడిచిపోయాయి. వైదేహి ఆఫీసునించి ఆలశ్యంగా యింటికి వచ్చి మెట్లెక్కి పైకి వెళ్ళబోతూన్నదల్లా సాధ్వీమణి వాటాలోనించి బిగ్గరగా నవ్వులు విన్పించి అక్కడే ఆగిపోయింది.

యేదో విషయాన్ని గూర్చి ఆనందమూర్తీ సాధ్వీమణీ పాండురంగమూర్తీ చర్చిస్తూన్నారు. పాండురంగమూర్తి గొంతు ఒకసారి నెమ్మదిగా మరోసారి గట్టిగా విన్పిస్తోంది. అతని మాటలకి సాధ్వీమణి విరగబడి నవ్వటం మరీమరీ విన్పిస్తూంటే వైదేహికి అకారణంగానే అసూయ కల్గుతోంది. ఆ ముగ్గురూ తరుచుగా అలా కల్సి కబుర్లు చెప్పుకోవటం వింటూనేవుంది. సాధ్వీమణి తనంత తనుగా పాండురంగ మూర్తిని పరిచయం చేస్తుందేమో అని చూసింది. పోనీ అతనైనా తనంత తానుగా పల్కరిస్తే యేం? అని కోపమూ వచ్చింది. అయినా వీళ్ళంతా యెంత పాత స్నేహితులైనా నన్ను యెందుకు కలుపుకోకూడదు! అని తనలో తనే వుడికిపోతూ మెట్లెక్కి పైకి వెళ్ళబోతూ కూడా ఆగి వెనక్కి తిరిగి సాధ్వీమణి వాటాలోకి రెండడుగులు వేసింది. అయితే అప్పటికే పాండురంగ మూర్తి వీధిలోకి వెళ్ళిపోవటంతో నిరాశపడి చకచకా మెట్లు యెక్కి పైకివచ్చి గది తలుపు తాళం తీసుకుని పక్కమీద వాలి తల నొక్కుకుంటూ "ఛీవెధవ జీవితం. అసలిది వెధవ్వూరు. యిక్కడి మనుషులు మరీ వెధవలు'' అనుకున్నా వైదేహికి తల నొప్పి తగ్గలేదు.

"వైదేహీ" అంటూ తాపీగా వచ్చి కూర్చుని కబుర్లు మొదలెట్టింది సాధ్వీమణి.

''తల్లీ నీకు ఈ సాయం సమయంలోనే కావల్సివచ్చాను. ఏం నీ మొగుడు ఇంగ్లీషు సినిమాకి వెళ్ళాడా'' అనుకుంటూ లోలోపల పళ్ళు కొరుక్కుంది సాధ్వీమణికి ఇంగ్లీషు సినిమాలంటే వళ్ళు మంట. చస్తే చూడదు.



భర్తని చూడనివ్వడు. అయితే ఆనందమూర్తి అప్పుడప్పుడూ భార్యకి మస్కాయిచ్చి ఇంగ్లీషు సినిమా చూసి వస్తూనే వుంటాడు. 'తిక్క కుదిరింది' అనుకుని లోలోపల సంతోషంగా వుంది వైదేహికి.

యిద్దరి కబుర్లూ సినిమాలూ సీరియల్సూ చుట్టి పాండురంగమూర్తి మీదకి తిరిగాయి. సాధ్వీమణి యింక పాండురంగమూర్తిని పొగడటం మొదలెట్టింది.

అయన చాలామంచివాడు వైదేహీ. మల్టి పర్పస్ ప్రాజెక్టులా నానాగుణ సంపన్నుడు. అంటే దోబీ 'దర్జీ' బీబీ అన్నిటా ఆయన చెయ్యి అమోఘం. పైగా వంటలూ పిండి వంటలూ యెంత బాగా చేస్తాడనీ అబ్బ. చెప్పలేను. ఆయన చేతిలో అమృతమే వుంది. ఆదివారాలు మేమిద్దరం 'గెస్ట్'లుగా వెడుతూ వుంటాం. ఆయనకి అదేమిటో వంటలో కొత్త కొత్త ప్రయోగాలుచేసి స్నేహితులకి పెట్టటం హాబీ.

సాధ్వీమణి మాటలకి వైదేహి విరగబడి నవ్వింది. "యిదేం హాబీ బాబూ! బ్రహ్మ దేవుడు ఆడపిల్లని చెయబోయి అబ్బాయిని చేశాడేమో కానీ లేకుంటే ఈ రోజుల్లో ఆడ పిల్లలు వంటా వార్పూకి దూరంగా వుంటే ఈ మగమహారాజుకిదేం ఖర్మ."

'సాధ్వీమణికీ మాటలు నచ్చకున్నా "యెవరి హాబీలు వాళ్లవిలె"అనేసి లేచి వెళ్లి పోయింది. వైదేహికి మళ్లీ విసుగ్గా వుంది క్యారియర్ కుర్రాడు యింకా గంటగ్గానీ రాడు. విసుగ్గా వారపత్రిక తీసుకుంది. అదీ చదవబుద్ధి కాలేదు. కానీ ప్రక్క గదిలోనించి గుత్తివంకాయ కూర ఘుమఘుమలాడుతూ వాసన వేస్తోంది. ఆ వాసన వస్తూన్నకొద్దీ ఆకూరతో భోజనం చేస్తే యెంత బాగుండూ అన్పిస్తూవుంది. కానీ ఈ మూర్తితో అసలు పరిచయమే లేదే. ఆడపిల్లతనుగా యేం పల్కరించగలదు. తను పల్కరిస్తే యెంత బాగుండూ అని లోలోపల తహతహ ఎక్కువ అవుతూవుంది. వారపత్రిక గిరాటు కొట్టి లేచి బాల్కనీలోకివచ్చి యిటూ అటూ పచార్లు చేస్తూ క్యారియర్ కుర్రాడిని లక్ష తిట్టేసింది. ఏడున్నర దాటిన తర్వాత కుర్రాడొచ్చి కారియర్ యిచ్చి వెళ్ళిపోయాడు. ఆకలి మండిపోతోంది కారియర్ విప్పి ప్లేటులో వడ్డించుకుంది. అన్నింటిరుచీ ఒకేలా వుండే ఆ పదార్థాలని చూస్తే యేడుపొచ్చింది. మార్కెట్టులో అతి చౌకగా వుంది కాబోలు గోరుచిక్కుడుకాయ కూర బూడిద గుమ్మడి కాయ కూటు చారూ చట్నీ అన్నీ ఒకేరుచిలా ఉన్నాయి. అవి నోట్లోకి పోనని మొరా యిస్తూంటే ఆకలికి ఆగలేక యెలాగో మింగుతోంది.

"ఛి ఛీ! ఈ భోజనం యింకా రెండు నెలలు తింటే హాయిగా స్వర్గం చేరుకోవచ్చు. అమ్మమ్మని రమ్మని రాసేస్తాను. అని లేచి వుత్తరం రాసేసి మర్చిపోకుండా మర్నాడు పోష్టు చేయాలని అనుకుని వచ్చి పక్కమీద వాలింది. అబ్బ ఈ ప్రక్కగదిలో యెవరన్నా గృహస్తు ఉన్నా హాయిగా వుండేది కాలక్షేపం.

'బ్రెడ్' బాసుంది

కావలసిన పదార్థాలు: పాలు—ఒకలీటరు, బ్రెడ్—ఒక పౌను, కండెన్స్‌డ్ మిల్క్—ఒక డబ్బా, నెయ్యి లేక డాల్డా — ఒక టేబిల్ స్పూన్, జీడిపప్పు, చారపప్పు — 25 గ్రాములు, ఏలకులు—6.

తయారుచేయు విధానము :

బ్రెడ్ స్లైసెస్‌లకు ప్రక్కలకుగల బ్రౌన్ కలర్ ముక్కలను తీసివేయాలి. కొన్నిపాలను తీసుకొని బ్రెడ్‌ని అర్ధగంట నానపెట్టాలి. మిగిలినపాలను మరగబెట్టి మరుగుతున్నప్పుడు అందులో గడ్డపాలు, నానినబ్రెడ్‌ను కలపాలి. ఈ మిశ్రమము చక్కగా క్రీమ్‌లాగ అయ్యే వరకు ఉంచాలి. నెయ్యిలో వేయించిన పలుకులు కలుపుకోవాలి. ఇది చాలారుచిగాఉండి, బ్రెడ్‌తో చేసిన బాసుందిలాగా ఉండదు, నిజంగా బాసుందీలాగే వుంటుంది!

—ఎమ్. వి. శోభారాణి.

అని విసుక్కుని అలా పనిఉన్నట్లుగా మెట్ల దగ్గరకి వెళ్లినట్లు వెడుతూ మూర్తి గదివైపుకి చూసింది. మూర్తి శుభ్రంగా గుత్తివంకాయకూరతో భోజనంచేసి ఆ కూర కొంత ఒక స్టీలుగిన్నెలో పెట్టి సాధ్వీమణికి కాబోలు తీసుకువెడుతూన్నాడు. వైదేహి చటుక్కున యివతలకి తప్పుకుంది మెట్ల దగ్గరనుంచి. మూర్తి వెళ్ళినవాడు అర్ధగంట అయినా పైకి తిరిగిరాలేదు.

వైదేహి లోలోపల వుడికిపోతూ తన గది లోకివచ్చి పడుకున్నదేకాని నిద్రపట్టలేదు.

ఈ బ్రహ్మవారి మహాశయుడికి ఆ సాధ్వీమణి తప్ప మరెవరూ మనుషుల్లా కన్పించరా నేనే పల్కరిస్తే. అవును. నేనే పల్కరిస్తాను. దృఢనిశ్చయంతో కళ్లు మూసుకుంది వైదేహి.

3

ఆదివారం మార్నింగ్‌షోకి పాత పిక్చర్‌కి వెళ్లి యెండలో యింటికి వచ్చి రిక్షావాడికి చిల్లర లేదనే నెపంతో గబగబా పైకివచ్చింది. కర్టెన్ గాలికి యిటూ అటూ వూగుతూ వుంది. లోపల మూర్తి యేంచేస్తున్నాడో తెలియదు చేత్తో తలుపు టిక్ టిక్‌న నెట్టింది రెండుసార్లు.

"యస్ కమీన్" అతని గొంతు యెంతో హాయిగా విన్పించింది.

'నమస్తే' ఒక్క అడుగు లోపలికి వేసింది వైదేహి. అతను అద్దం ముందు కూర్చుని తల దువ్వుకుంటున్న వాడల్లా వెనక్కి తిరిగి వైదేహిని చూడగానే ఆశ్చర్యపోయి చటుక్కున లేచి "ఓ! మీరా! నమస్తే ... రండి లోపలికి" ఏంపని అన్నట్లు ప్రశ్నిస్తూ న్నాయి అతని కళ్లు.

"ఫైవ్ రూపీస్ చేంజ్ కావాలి. రిక్షా వాడికి..."

"వున్నది యిస్తాను." అంటూ షర్టు జేబూలోనించి అయిదురూపాయి కాయితాలు లెక్క పెటి అందించాడు మూర్తి.

'థాంక్స్'అంటూ అయిదు కాయితం అందించింది.

"నో మెన్షన్" అంటూ చిరునవ్వునవ్వాడు. క్రిందకి వెళ్లి రిక్షా వాడిని పంపేసి గదిలోకి వెళ్లబోతూ కర్టెన్ ప్రక్కకి లాగి వున్నందు వల్ల అటుమూర్తి గదివైపు అప్రయత్నంగానే చూసింది.

ప్లేటులో వుప్మా కాబోలు పొగలు చిమ్ము తోంది. దానిలోని జీడిపప్పు పలుకులు చూస్తూంటే నోరు వూరేలా వుంది. ఆదగ్గరే ప్లాస్కు కప్పూ సాసరూ వగైరా. మూర్తి ఒక చెయ్యి మీద గడ్డం ఆన్చి ప్లేటు లోని వుప్మా చెంచాతో యిటూ అటూ కదు పుతూ అన్యమనస్కంగా వున్నట్లు కూర్చుని వున్నాడు. వైదేహి యింక వెళ్లి తనగది తాళం తెరిచి లోపలికివెళ్లి తలుపు దగ్గరగావేసుకుంది.

పిక్చరు అయి వస్తూ హోటల్లో టిఫెనూ టీ తీసుకుని వచ్చినా అప్పుడే ఆకలి అవుతూన్నట్లుంది. ఆ వుప్మా చూసినందువల్లనో యేమో ఆకలి మరీ యెక్కువైంది. ఆకలిమీద నుంచి మనస్సుని మళ్లించటానికి గ్లాసుడు నీళ్లు తాగి బట్టలు మార్చుకునివచ్చి వాలు కుర్చీలో కూర్చుంది.

"మూర్తి యేమనుకుంటున్నాడో! సిగ్గులేని పిల్ల అనుకోడు గదా! అనుకోడు అనే నమ్మకం కల్గుతోంది బాగా. కానీ ఈ విషయం సాధ్వీమణికి చెప్తాడా! చూస్తాను. సాధ్వీమణి సంగతి" అనుకుంటూ వుంటే, వైదేహికి యేదో చెప్పలేనంత తృప్తిగా వుంది. అయినా అతన్ని పల్కరించి మాట్లాడినంత మాత్రాన నా కొరిగిన లాభం యేమిటి? అనికూడా తనని తను ప్రశ్నించుకుంది. కానీ జవాబు లేదు. సాధ్వీమణి గనుక యితన్ని పరిచయం చేసి వుంటే ఈ విషయానికింత ప్రాధాన్యత వుండి వుండేది కాదేమో. అతనంత అతనుగా పల్కరించినా వేరొక విధంగా వుండి వుండేదని అన్పించింది. యేది యేమైనా వైదేహికి చాలా హుషారుగా వుంది. తనలో తనే కూనిరాగాలు తీస్తూ వుంది. సాయంకాలం కనకాంబరాల మాల కొనుక్కొని నీలం పువ్వులున్న తెల్ల ప్రింటెడ్ చీర కట్టుకుని అద్దంలో ముఖాన్ని అర్ధగంట చూసుకుని ఆఖరుకి గదివాకిలివేసి యివతలికి వచ్చింది. మూర్తి గదికి పెద్దతాళం కన్పించి నీరసపడి సాధ్వీమణి వాటాలోకి వెళ్లబోతుంటే అప్పుడే భార్యా భర్తలిద్దరూ స్కూటర్ యెక్కి యెటో వెళ్లిపోతూ వైదేహిని చూసి నవ్వుతూ చెయ్యివూపి భర్త నడుం చుట్టూ చెయ్యివేసి అతని వీపుమీద వాలిపోయినట్లుగా కూర్చున్న సాధ్వీమణిని చూస్తూంటే యెందుకో అర్ధంలేని కోపం ముంచుకొచ్చింది. గిర్రున వెనక్కి తిరిగి గదిలోకి వచ్చేసి వీధివైపు కిటికీదగ్గరకి కుర్చీ లాక్కుని కూర్చుంది. అప్రయత్నంగా కళ్లలో నీళ్లు తిరిగాయి. దుఃఖం కట్టలు తెంచుకుంటోంది. అలా రోడ్డువైపే చూస్తూ కూర్చుంది. వుబికివచ్చే కన్నీళ్లని తుడుచుకోవాలని కూడా అన్పించలేదు.

రోడ్డుమీద ఓ కుంటి ముసలాడు యివతల నుంచి అవతలకి దాటటానికి అవస్థపడుతున్నాడు. యిటూ అటూ కార్లూ లారీలూ రిక్షాలూ ఆటోలూ విరామం లేకుండా వస్తూనే వున్నాయి. అతను ప్రాణ భయంవల్ల కాబోలు అలాగే నిల్చున్నాడు పదినిమిషాలు. ముందుకి వెనక్కి కర్రకాలుతో నడుస్తూ. యింతలో పదేళ్లబాబు అతన్ని చెయ్యి ఆసరా యిచ్చి యిటూ అటూ చూసి గబగబా అవతలకి దాటించేశాడు. ఆ వృద్ధుడు యేదేదో ఆశీర్వదిస్తూంటే ఆ బాలుడి కళ్లు సంతోషంతో మెరుస్తూన్నట్లున్నాయి. వైదేహి ఆ కుర్రాడినే చూస్తోంది తదేకంగా.

"వైదేహిగారూ!" మూర్తి వాకిలిదగ్గర నిల్చుని మెల్లని స్వరాన పిల్చినట్లై వులిక్కిపడి వెనక్కి తిరిగింది.

అతను గోధుమకలర్ పాంట్, వైట్ టెరీ కాట్ షర్టూ వేసుకుని యెంతో అందంగా తీవిగా నిల్చున్నాడు. అలా రెండు నిమిషాలు చూసిన తర్వాతగానీ తన కన్నీళ్ల చారికలని గబగబా తుడుచుకోలేక పోయింది. ముఖాన్ని పమిటతో తుడుచుకుంటూ "రండి సినిమాకి వెళ్లలేదూ" అంది కుర్చీ చూపిస్తూ.

"సినిమాకా! నే వెళ్లాలనుకోలేదే...అవి ...మీరు ... మీరు" అని తటపటాయిస్తూ "నేను సమయం కాని సమయంలో వచ్చానా! సారీ" అంటూ వెళ్లిపోబోతూంటే వారిస్తూ.

"అహా యేంలేదు. కూర్చోండి" అంది కంగారుగా. అతను ఆగిపోయి. "చూడండి. నేను వూరికి వెడుతున్నాను. నా రూము తాళంచెవి కాస్త వుంచెండి. రెండురోజుల్లో వచ్చేస్తాను. వెంట తీసుకు వెళ్ళొచ్చు. కానీ అక్కడ మర్చిపోయివస్తే... యిబ్బంది. అసలు సాధ్వీమణిగారు వుంటే ఆవిడకే యిచ్చేవాడిని. కానీ...వాళ్లు బైటకి వెడతారని తెలియదు. నేనసలు యిలా వూరుకి వెడతానని వాళ్ళకీ తెలియదనుకోండి" అంటూ అతను అతి మొఖమాటపడి పోతున్నందుకు కాదుగానీ సాధ్వీమణి లేక పోవటంవల్ల నేను గుర్తుకొచ్చానన్నమాట అని కోపాన్ని మింగుకుంటూ.


"లాక్ వుంచటానికి అభ్యంతరం లేదు. ఆవిడరాగానే మీరు వెళ్ళారని చెప్పమంటే అలాగే చెప్తాను. 'లాక్' కూడా యిమ్మన్నా యిస్తాను" అంది ఆవేశాన్ని అదుముకుంటూ


"అహ. మీకా శ్రమ అక్కరలేదు. మీ దగ్గర వుంచండి."


'అలాగే' అంటూ తీసుకుంది వైదేహి. మూర్తి వెళ్ళిపోయాడు. మరీ నీరస పడి పోయింది. అతను మాట్లాడినా లేకున్నా రూములో వుంటేనన్నా కొంత ధైర్యం. యిప్పుడింక రాత్రంతా నిద్రకూడా కరువన్న మాట.

అబ్బ. 'ఏం జీవితం' తలపట్టుకుని పక్కమీద వాలిపోయింది.

(ఇంకా ఉంది)







ఆస్పత్రుల్లో పిల్లల్నెలుకలు కర్తింటాయా !?

ఆసుపత్రిలో చికిత్స కోసం వో చిన్న పిల్లను (కలకత్తా సిటీ ఆసుపత్రి) చేరిస్తే, పక్కమీద పడుకునివున్న ఆ పిల్లను ఎలుకలు తినేశాయట. 19వ తేదీన ఆమెను ఆసుపత్రిలో చేరిస్తే ఎలుకలు ఆమె ముఖాన్ని, వో చేతినీ తినేశాయట. తత్ఫలితంగా ఆమె చనిపోయిందట. ఆమెను చనిపోయాకనే ఎలుకలు తిన్నాయని ఆసుపత్రి అధికారులు అంటున్నారట. ఈ విషయాన్ని తేల్చడానికి ఆమె శరీరాన్ని పోస్ట్‌మార్టమ్‌కు పంపారట. ఆసుపత్రికి వెళ్ళిన జీవి సజీవంగా రాకపోతేపోయె శరీరం కూడా దక్కకుండా వాళ్ళ అనుమానాలకోసం ఖండఖండాలుగా చేసి అనక యిస్తారన్న మాట — హరిహరీ !

సైన్సు కందని మాయ.

మద్రాసు ఏ. యమ్. జైన్ కాలేజీలో ఆఖరి సంవత్సరం డిగ్రీకోర్సు చదువుతున్న బాలకృష్ణన్ అనే వో హరిజన యువకుడు జనవరి తొమ్మిదో తేదీ ఎలక్ట్రిక్ ట్రైనుతో మద్రాసుకు వస్తూ, రైలులో వో 60 ఏళ్ళ వృద్ధసాధువులాటి ఆయనతో ఆస్తికత్వం మీద, తదితర విషయాల మీద విస్తారంగా వాదనపెట్టుకున్నాడట. చాలాసేపు వాదించేసరికి ఆ సాధువుకు కాస్తకోపం కూడా కలిగిందట. బాలకృష్ణ తనకి మాయల మీద, మహిమలవంటి వాటి మీద నమ్మకం లేదు పొమ్మన్నాడట. కాస్సేపు యిద్దరూ ఎడముఖం పెడముఖంగా కూర్చున్నాక, ఆ సాధువు ఒక బత్తాకాయి బాలకృష్ణకు యిచ్చి తామిద్దరి మధ్య కోపతాపాలేమీ లేవని వొప్పుకుంటూ, నిదర్శనంగా ఆ పండు తీసుకుని తినమని కోరాడట. బాలకృష్ణ ఆ పండు తింటుండగాసాధువు వోస్టేషనులో దిగిపోయాడట. పండు పూర్తిగా తిన్న బాలకృష్ణ చట్టున మూగవాడయిపోయాడట. గింజుకున్నా మాటరాలేదట. ఫోర్ట్ స్టేషనులో పిచ్చివాడిలా దిగాడట. తరువాత జైన్‌కాలేజి ప్రిన్సిపాలువైద్యుల చేత నయం చేయింపచూశాడట. వో నాటి రాత్రి సాధువు బాలకృష్ణకు కలలోకనబడి మాట పోయిన పదోరోజు మధ్యాహ్నం [illegible]డున్నరకు తిరిగి [illegible] వస్తుందని, యీ [illegible] [illegible], విజ్ఞానశాస్త్రం ఫలితమివ్వదనీ, అయితె ఆ రోజు కొంత పూజ జరపాలని, ఆ విధిచెప్పాడట. ఆ ప్రకారమే బాలకృష్ణకు పదోరోజు మధ్యాహ్నం పన్నెండున్నరకు పూజా అదీ చేశాకటుక్కన మాట వచ్చేసిందట ఈ ఆశ్చర్యకరమైన సంఘటనను సైన్సు ఎలాఅన్వయించుకోవాలో తేలీక తికమక పడుతోందట— పడదామరి !

సెక్యులర్ వివాహం.

కేరళ అలెప్పికి చెందిన భువనేశ్వరి ఆలయానికి సంబంధించిన కిడంగంపరంబు (కళ్యాణ మండపం)లో ముప్పయ్యేళ్ళ నిసార్ అనే ముస్లిమ్ యువకుడికి 25 ఏళ్ళ నర్గిస్ అనే ముస్లిమ్ యువతికి 19వ తేదీన వివాహమయిందట. హిందూ ఆలయంలో ముస్లిమ్ వివాహం జరగడం యిదే బహుశాప్రథమం అని అక్కడి వారనుకుంటున్నారట— మేబీ!

పత్రికా డైరీ

పాముచర్మాలొదిలి ఓ జర్మన్ పలాయనం.

అక్టోబరు 27 వ తేదీన బొంబాయి విమానాశ్రయంలో విమానం దిగిన వో జర్మనీ దేశీయుని వద్ద చాలా ఖరీదుచేసే పాముతోళ్ళుదొరికాయట. అనధికారంగా వాటిని తీసుకువెళ్తున్నందుకు కస్టమ్స్ అధికారులు అతనిని, ఆ సరుకును అరెస్టు చేసి, యాభైవేల రూపాయల బెయిల్ మీదా యన్ని మాత్రం వదిలారట. ఆ జర్మనువో "ఫైవ్ స్టార్" హొటల్లో రూముతీసుకుని, గదిఖాళీ చేయకుండా గది తాళం చెవితో సహా ఎలాగో యీ దేశం నుంచి వెళ్ళిపోయాడట. ఈ విషయాన్నంతా పసిగట్టిన అధికారులు లక్ష రూపాయలుకిమ్మత్తు చేసే పాము చర్మాలు మిగిలాయనుకున్నారట. అతని పేరు కుద్రాన్‌కర్స్‌డార్ఫ్‌ట! ఏదోఒకటి పేరులో ఏముంది? వున్నదంతా బుర్రలోనె గాని.

తప్పతాగితే బాధలు తప్పవు.

రామనాథపురానికి 13 కిలో మీటర్ల దూరంలో వున్న వాలన్తరవై అనె స్టేషనులో తప్పతాగిన వో వ్యక్తి వో రైలులోని ఆడవారి కంపార్టుమెంటులోకి ఎక్కబోయాడట. దీన్ని వో పోలీసు ఆరికట్టేసరికి ఆ ఆసామికి కోపంవచ్చి సర్రున కత్తి తీసి ఆ పోలీసు చేతిమీద పొడిచాడట· ఈ సంఘటన చూసిన మరో పోలీసు తుపాకితో ఆ ఆసామిని డుమేల్న పేల్చేసరికి అతని చేతికి గాయం అయిందట. తత్ఫలితంగా ఆ ఆసామిని, గాయపడ్డ పోలీసును ఆసుపత్రికి తరలించారట.

ముంచిన మూఢ నమ్మకం.

సోమాలియాలో సోమాలియా రూలింగ్‌సుప్రీమ్ కవున్సిలు అధికార పూర్వకంగా స్త్రీలకు సమాన హక్కులు యిచ్చిందట. దీన్ని వ్యతిరేకిస్తూ "ఇస్లామ్ నమ్మకం"అనే దాన్ని వారిష్టంగా బోధనచేసినందుకు ఒక ఆరుగుర్ని అక్కడి ప్రభుత్వం పట్టుకుని వారికి మరణదండన విధించిందట. మరో అయిదుగురికి ఇరవైయ్యేసి, ముప్పయ్యేసి సంవత్సరాలు కారాగారశిక్షలు కూడా విధించిందట. భళి భళి. . . .స్త్రీలు పురుషులతో అన్నిరంగాలలో సమానంగా, కొన్నిచోట్లోపిసరంతెక్కువగా వుంటున్న యీ రోజుల్లో యింకా వారిని గుర్తించడానికి ఆలోచిస్తే ఎలా ?!

జనాభా పెరుగుదల నివారణకు సెక్సువిద్య.


అయిదో తరగతి నుంచి కూడా సెక్సు విద్యను తప్పకబోధ చెయ్యాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆలోచిస్తోందట. 1979 నుంచి విద్యావిధానాలలో సెక్సు విద్యాబోధనను కూడా చేర్చ గట్టి ప్రయత్నం చేస్తోందట. ఆదేశంలో పెరుగుతున్న జనాభాను అరికట్టడానికిదే మంచి మార్గమనక్కడి ప్రభుత్వం నిశ్చయించిందట. దీనితోపాటు వివాహం చేసుకునే వయస్సును 20 ఏళ్ళకు పెంచడం, గర్భస్రావానికి సంబంధించిన చట్టాలను సవరించడం కూడా చేస్తున్నదట. ప్రపంచ దేశాలలో అత్యధిక జనాభా కల దేశమట బంగ్లాదేశ్. అక్కడ 2.5 చతురపు కిలో మీటరుకు 1380. మంది తేలారట. దేశ జనాభా 72 మిలియనులట

ట్రూ-టోన్
హెయిర్ కండిషనర్‌తో కూడిన సాటిలేని హెయిర్ డై

ఇది మీ జుట్టును చక్కగా, సులభంగా సరియైన తీరులో సహజంగా డై చేస్తుంది. అంతేకాదు, దీనిలో గల హెయిర్ కండిషనర్ జుట్టును మెత్తగా, కాంతివంతంగా ఎంతో అనువుగా రూపొందిస్తుంది.



* ఇది ప్రముఖ హెయిర్ డ్రెస్సర్స్‌చే ఉపయోగించబడే హెయిర్ డై
* ఇది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హెయిర్ డైలను తయారుచేసే అమెరికన్ కంపెనీ హెలీన్ కర్టిస్ వారి విశేషానుభవంతో తయారుచేయబడిన హెయిర్ డై



సహజమైన నలుపు మరియు డార్క్ బ్రౌన్ రంగులలో— 2 సైజులలో లభిస్తుంది. మీ సౌకర్యం కోసం, మరకలను తొలగించేందుకు ట్రూ-టోన్ స్టెయిన్ రిమూవర్, రబ్బరుతో తయారుచేయబడిన హ్యాండ్ గ్లవ్స్ మరియు ప్రత్యేకంగా డెవలపర్ లభిస్తాయి.

జె.కె. హెలీన్ కర్టిస్ లిమిటెడ్,
బొంబాయి 400 038 వారి
నాణ్యమైన ఉత్పత్తి

దక్షిణ ఇండియాకు డిస్ట్రిబ్యూటర్లు: ప్యారీ & కంపెనీ లిమిటెడ్

everest/999/HC-ll

వారఫలం

—మహేష్

21-2-1975 శుక్రవారం మొదలు 27-2-1975 గురువారం వరకు

మేషం :— వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. ప్రయాణాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. మీ మంచితనమే మీకు ఇబ్బంది కలిగిస్తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం :— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వ్యాపారంలో పోటీవారిపోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా వుంటుంది. స్త్రీలకు-కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

మిధునం :— వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. మీ ఆలోచనలు ఫలించగలవు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

కర్కాటకం:— లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. వృత్తిలో ప్రయాసకు గురికాగలరు. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలించగలవు. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. స్త్రీలకు-ఆరోగ్యం బాగుండదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

సింహం :— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. వారం ఆఖరులో వృత్తివ్యాపారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు—అధిక వ్యయం జరుగుతుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

కన్య :— అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. ప్రయాణాలు ఫలించగలవు వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమకలుగుతుంది. పోటీ వారిలో గౌరవం బాగుంటుంది.

తుల :— మీ కార్యక్రమాలు బాగుంటాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభించగలదు. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.



వృశ్చికం :— ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో ప్రయాణాలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమకలుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు :— ఇతరులతో కలిసిచేసే వ్యాపారాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. వారం మధ్యలో మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. అనవసరమైన వ్యయం చేస్తారు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు అనుకూలంగా వుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

మకరం :— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. పోటీవారితో మాట పట్టింపులు తగవు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణంద్వారా కార్యసాధన చేయగలరు. వారం ఆఖరులో కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసంచేయడానికి ప్రయత్నిస్తారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

కుంభం :— వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. వారం ఆఖరులో రావలసిన డబ్బు సమయానికి అందగలదు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం :— మీ కార్యక్రమాలు హడావుడిగా వుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో వృత్తిలో పోటీవారి పోటీ పెరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు. స్త్రీలకు—బంధు మిత్రులను కల్సుకొంటారు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

ఇంతకు పూర్వం ఎన్నడూ లభించని సదుపాయం!

సింగర్ సమకూర్చే మరో సదవకాశం

మీయొక్క
మెరిట్*
కుట్టు మెషీన్
ఖరీదును
3 నెలలలో చెల్లించవచ్చు

అంతేకాదు, లిస్ట్ ప్రైస్‌కు మించి ఓ పైసా కూడా చెల్లించక్ఖర్లేదు!

"ఇది నిజంగా విచిత్రమే"

సింగర్ వాయిదాలలో కొనే సదుపాయాన్ని సమకూరుస్తోంది— అదనంగా ఏ మాత్రం చెల్లించే పని లేకుండా.





"నేనెంత ఆదా చేయగలనో ఊహించండి!"

దీని ఖరీదును 3 నెలలలో చెల్లించి వేస్తే మీరు ఎంత ఆదా చేయగలరో ఆలోచించండి. మీరు లిస్ట్ ప్రైస్‌కు మించి ఏమీ చెల్లించక్ఖర్లేదు. దీని ఖరీదును మీరు తిరిగి ఎంత త్వరగా రాబట్టగలరో ఆలోచిస్తే మీకే ఆశ్చర్యం వేస్తుంది. అపైన, ముందు ముందింక అంతా ఆదాయే మరి!

"అదనంగా ఓ పైసా కూడా చెల్లించక్ఖర్లేదు!"

మామూలుగా వాయిదా పద్ధతిలో కొంటే, ధర కొంచెం ఎక్కువగానే పడుతుంది. ఎందువలన?

మీరు చెల్లించే అదనపు సొమ్ము మీకా సౌకర్యాన్ని కల్పించేందుకు కంపెనీకయే ఖర్చు మాత్రమే. అయినా ఫరవాలేదు. ఎందుకంటే, మీ మెరిట్ కుట్టు మెషీన్ ఖరీదును చెల్లించడంతోపాటు ఆదా కూడా చేస్తారు మరి! (ఇక మీ బట్టలకు కుట్టు కూలి చెల్లించే పని ఉండదుగా).






"ఇది చిరకాలం మన్నుతుంది!"

అవును నిజమే మరి! అయితే సింగర్ సమకూర్చే సదుపాయం కొద్ది కాలానికే పరిమితం. అందుకే త్వరపడండి. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని మీరూ వెంటనే కొనుక్కోండి. మీకు దగ్గరలోని సింగర్ షాపునుగానీ డీలర్‌నుగానీ సంప్రదించండి.

ప్రపంచానికే మేము కుట్టు పనినేర్పాము. ఇది లోక విదితమే.



సింగర్

* సింగర్ కంపెనీవారి ట్రేడ్‌మార్క్.

సింగర్ సూయింగ్ మెషీన్ కం. 207, డి. ఎన్. రోడ్, బొంబాయి 400 001.

CHAITRA-SM-79 TEL

సీరియల్

అహం-అనురాగం

జి. పరిమళా సోమేశ్వర్

(గత సంచిక తరువాయి)

రఘు అటెండరు ఉద్యోగంలో చేరతాననేసరికి శ్యామలకి చిన్నతనం వేసింది. "ఇప్పుడు నీకేమంత కష్టం వచ్చిందని ఆ ముష్టి ఉద్యోగం చెయ్యాలి? చక్కగా చదువుకుంటే యింతకంటె మంచి ఉద్యోగం చెయ్యవచ్చునుకదా! నా మరిది అటెండరు ఉద్యోగం చేస్తున్నాడంటే నా కెంత అవమానం!" అన్నది.

"ఆ అహంభావమే నీకు వద్దు వదినా! ఏం? నువ్వు మంచి ఉద్యోగంలో ఉన్నంత మాత్రాన నీ వాళ్లందరూ కూడా నీలాగే మంచి హోదాలో ఉండాలని ఎక్కడ ఉంది? ఎవరి అర్హతలనుబట్టి వాళ్లకు తగ్గ ఉద్యోగాలు లభిస్తయ్. ఇందులో అవమాన పడవలసిన విషయ మేముంది? ఇలా అనవసరంగా కించపడే నువ్వు అన్నయ్యను దూరం చేసుకున్నావు. ఐనా నీకింకా కనువిప్పు కలగలేదా? ఐనా నాకులేని అవమానం నీ కెందుకు? నాకు 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' అంటే యేమిటో బాగా తెలుసు. అంతేకాదు, మనిషినిబట్టి ఉద్యోగానికి విలువ ఉంటుంది కాని ఉద్యోగాన్నిబట్టి మనిషికి ఎప్పుడూ విలువ రాదు. ఆ సంగతి గుర్తుంచుకో" అంటూ అక్కడనుండి వెళ్లిపోయేడు.

శ్యామల అతని మాటలను వింటూనే అవాక్కయిపోయింది. నిజమే! మనిషినిబట్టి ఉద్యోగానికి విలువ వస్తుంది కాని, ఉద్యోగాన్నిబట్టి మనిషి కెప్పుడూ విలువ రాదు. తనలాటి సంకుచిత మనస్కులకు, అహంకారపూరితులకు ఎంత గొప్ప హోదాలో ఉన్నా గడ్డిపోచ విలువకూడా ఉండదు. "చిన్నవాడివైనా నాకు బుద్ధి చెప్పేవు రఘూ! అంతేకాదు, మీ అన్నయ్య కంటె నిర్మోహమాటంగా, నిస్సంకోచంగా నా తప్పులను ఎత్తి చూపిస్తున్నావు" అనుకుంది మనసులో.

వాళ్ల సంభాషణని మంచంలో పడుకుని ఉన్న పార్వతమ్మ విన్నది. అన్నాళ్లుగా తన మనసులో మెదలుతున్న అనుమానాన్ని కాస్త వెల్లడి చేయదల్చుకుని కోడలిని దగ్గరకు పిలిచింది.

"చూడు శ్యామలా. నేనొక ప్రశ్న అడుగుతాను. నిజం చెప్తావా?" అనడిగింది.

"అడగండి. నిజమే చెప్తాను. నా తల్లిలాటి వారు మీరు, మీతో అబద్దం ఆడగల శక్తి నాకు లేదు" అంది శ్యామల.

"రవి యింట్లో నుండి ఎందుకు వెళ్లిపోయేడు?" సూటిగా ప్రశ్నించింది పార్వతమ్మ.

కళ్లవెంబడి బొటబొట కన్నీరు కారుస్తూ తల వంచుకుంది శ్యామల.

"సరే మరో ప్రశ్న అడుగుతాను చెప్పు. రవికి ఉద్యోగం లేదని, అతను నీ సంపాదనమీద ఆధారపడి బ్రతుకుతున్నాడని వాడి నవమానించేవు కదూ? ఔనా?"

"ఔనత్తయ్యా! మీ ఊహ సరియైనదే! నేనే పట్టి పాపిష్టిదాన్ని. అహంకారంతో, అసహనంతో ఆయన మనసు నొప్పించేను. ఆయన పరారీ అవటానికి కారణం నేనే! నేను చాలా పాపిష్టిదానిని అత్తయ్యా! చాలా పాపిష్టిదానిని" అంటూ భోరున ఏడ్చింది శ్యామల.

ఆమె యేడుస్తుంటే పార్వతమ్మ ఏమీ అడ్డు చెప్పలేదు. పశ్చాత్తాపంతో దహించుకుపోతున్న శ్యామల హృదయానికి కన్నీళ్ళ తప్ప ఏ ఉపశమన వాక్యాలూ ప్రశాంతతను చేకూర్చలేవని ఆమెకు తెలుసు. అందుకే ఆమెను ఏడవటానికి వదిలివేసింది. కాని తన కొడుకు గుండె ఎంత గాయపడితే యిల్లు వదిలి, అనుబంధాలన్నిటినీ తెంచుకుని వెళ్లగలిగేడోనన్న ఆలోచనకి అమె మాతృహృదయం తల్లడిల్లిపోయింది.

ఆమెకూడా నిశ్శబ్దంగా కన్నీరు కార్చసాగింది.

అత్తగారి కన్నులలోని కన్నీటిని చూసేసరికి శ్యామలలోని నేర భావం, పశ్చాత్తాపం మరింత ఎక్కువయినయ్. "అత్తయ్యా! ఆయనకి తీరని అపచారమే చేసేను. కనీసం మీరయినా నన్ను క్షమించండి" అంటూ ఆమె పడుకున్న మంచానికి తలానించి ఏడిచింది శ్యామల.

"ఊరుకో శ్యామలా! ఏడవకు. పశ్చాత్తాపంతో కాలి, పరిశుద్ధమైన నీ హృదయమే చివరికి నిన్ను నీ భర్త దగ్గరకు చేర్చుతుంది. మృత్యుముఖంలో వున్నదానిని. నా ఆశీర్వాదం తప్పక ఫలిస్తుందమ్మా. ఐతే ఆ టైము వచ్చేవరకు వేచి వుండాలి. అంతే! ఎవరు ఎంతకాలం దుఃఖపడవలసి వుందో అంతకాలం దుఃఖపడవలసిందే తప్పదు. ఐతే నాకొక్కటే దిగులు. అన్ని దుఃఖాలకూ అతీతమైన మృత్యు సాన్నిధ్యంలోకి చేరబోయే ముందు నా పెద్దకొడుకు నాదగ్గర లేకపోయేడే అనే నా బాధ. అంతకన్న నాకేం బాధలేదమ్మా! నీ స్వభావం నాకు తెలుసు. ఆవేశానికి అప్పుడప్పుడూ లొంగిపోయినా ఎంతో మెత్తని మనసు నీది. నా పిల్లలను కన్నతల్లిలా ప్రేమించగలవని, వాళ్ల బాగోగులను చూడగలవని నాకు నమ్మకం వుంది. అందుకే నేనింక నిశ్చింతగా వెళ్లిపోతాను." అన్నది.

అలా మరో పదిరోజులు గడచేక "రవీ! రవీ!" అంటూ పెద్దకొడుకునే కలవరిస్తూ ప్రాణం విడిచింది పార్వతమ్మ.

అత్తగారి మరణంతో శ్యామలకు షాక్ తగిలినట్లయింది. ఆమె చనిపోయేముందు అన్న మాటలనే పదే పదే గుర్తుకు తెచ్చుకుని బాధపడేది. రవితో తనకు గల అనుబంధాన్ని గురించే తను ఆ రోజుల్లో ఆలోచించిందే తప్ప రవి బాధలను చూసి బాధపడే వ్యక్తులింకా కొందరున్నారన్న విషయమే తనేనాడూ గుర్తించలేదు. అలా అనుకోగానే తన అపరాధం వెయ్యింతలుగా పెరిగి ఆమెను హింసించసాగింది.

ఒకరోజున పోస్టులో శ్యామల పేరిట ఒక కవరు వచ్చింది. దానిలో చంద్ర వివాహం జరగబోతున్నట్లు శుభలేఖ వుంది.

శుభలేఖలో చంద్ర పేరును, దాని ప్రక్కనే విద్య. యం. బి. బి. యస్. అని వధువు పేరునూ మార్చి మార్చి చూసింది శ్యామల.

పక్కపక్కనే వధూవరుల పేర్లు, డిగ్రీలు ఉద్యోగాలు అన్నీ చూసేక ఆమెలో అసూయతో కూడిన బాధ తలెత్తకపోలేదు.

"నాకీ శుభలేఖను పంపటంలో చంద్ర ఉద్దేశ్యమేమిటి? నన్ను పరిహసించటమే అతని లక్ష్యమా? నన్ను నువ్వు తిరస్కరిస్తేనేం? నీకంటె మంచి ఉద్యోగంలో ఉన్నదానిని, నీకంటె ఎక్కువ సంపాదిస్తున్న స్త్రీని వివాహమాడేను. నన్ను తిరస్కరించటంవల్ల చెడిపోయింది నేనుకాదు. నువ్వే!" అంటూ ఆ శుభలేఖలోని ప్రతి అక్షరంలోనూ చంద్ర ముఖం ప్రత్యక్షమై వెకిలిగా నవ్వసాగింది.

దాంతో కసి పట్టలేక ఖరీదైన, అందమైన ఆ శుభలేఖను ముక్కలు ముక్కలుగా చింపి గది మూలకు పడేసింది శ్యామల.

అయినా ఆ ముక్కలలో నుండి పెద్ద ముఖంతో చంద్ర ప్రత్యక్షమై "శ్యామలా! నా పెళ్లి లేఖనైతే చింపివేసేవుగాని నా జీవితాన్ని చింపలేవుకదా! ఆ మాటకి వస్తే నీ జీవితమే యీనాడు ముక్కలైపోయి ఉంది. నా జీవితానికేం? మూడు పువ్వులూ, ఆరు కాయలూ" అని పగలబడి నవ్వుతున్నట్లనిపించింది శ్యామలకు.

"చంద్రా! అసలే అవమానంతో, పశ్చాత్తాపంతో దహించుకుపోతున్న నన్ను హింసించటానికేనా యీ శుభలేఖను నువ్వు పంపింది? నిన్ను తిరస్కరించేనన్న కసితో జీవితాంతం నన్నిలా నీడలా వెంటాడుతూ హింసిస్తున్నావా? నా దారిన నన్ను బాధపడనీయక యింకా యీ బాధలు కూడా ఎందుకు చంద్రా?" అంటూ రెండు చేతులతోనూ ముఖాన్ని కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది శ్యామల.

జరిగిన కథ 11: స్త్రీల కళాశాల లెక్చరర్ శ్యామల, విద్యార్థినులతో నెహ్రూ జూలాజికల్ పార్కుకు వెళ్లివచ్చి, అక్కడ తనను ప్రమాదం నుంచి కాపాడిన వ్యక్తి బి ఎ. తప్పిన పేద చిరుద్యోగని అతనిద్వారా తెలుసుకుంటుంది. చంద్రను పెళ్లి చేసుకోవటానికి కూతురు శ్యామల నిరాకరించగా దిగులుతో ఆరోగ్యం చెడి మరణిస్తారు వెంకటేశ్వరరావుగారు. చంద్ర హెచ్చరిక లెక్కచేయక రవినే వివాహం చేసుకుంటుంది శ్యామల. ఇతరుల సూటీపోటీ మాటలవల్ల మనస్తాపం చెందిన శ్యామల వత్తిడితో అయిష్టంగా బి. ఏ. పరీక్షకు కట్టి తప్పుతాడు రవి. తను పనిచేస్తున్న కంపెనీలో రిట్రెంచిమెంటువల్ల వుద్యోగం పోయి మానసికంగా దిగజారిపోయిన రవి- శ్యామల తొందరపాటుతనంవల్ల ఇల్లు విడిచి వెళ్లిపోతాడు. తన తొందరపాటుకు పశ్చాత్తాపపడ్డ శ్యామల బాబులో రవిని చూసుకుంటూ, రవి కుటుంబాన్ని ఆదరిస్తుంది.

8

ఇంట్లో నుండి బయటకు వచ్చేసిన రవి ఆ అర్ధరాత్రి సరాసరి బస్టాపుకు నడచివెళ్లేడు. అక్కడ రెండు మూడు గంటల వరకు ఆలోచిస్తూ కూర్చుండిపోయేడు. ఆఖరి బస్సుకూడా వెళ్లిపోవటంతో జనం అంతగా లేరు. దూరాన ఇరానీ హోటల్ దగ్గర మాత్రం రిక్షావాళ్లు, టాక్సీ వాళ్లు చాయ్ తాగుతున్నారు. జేబులో మూడు రూపాయలు, చిల్లరతప్ప మరేమీ లేవు. తల దిమ్ముగా వుంటే ఇరానీ హోటల్‌లోకి వెళ్లి చాయ్ తాగేడు.

తరువాత బస్టాపులో వున్న సిమెంటు బెంచీ మీద నడుం వాల్చేడు. ఎక్కడికైనా వెళ్దామన్నా చేతిలో డబ్బులేదు. ఒకరిద్దరు స్నేహితులను అడగవచ్చు. కాని యింత అర్ధరాత్రి వాళ్ల దగ్గరకు వెళ్లటం బాగుండదు. రకరకాలుగా ఆలోచిస్తూ ఆ రాత్రంతా అక్కడే గడిపేడు. ఇంటికి తిరిగి వెళ్దామా అన్న ఆలోచన ఒకటి, రెండుసార్లు అతనికి రాకపోలేదు.

కాని తను వెళ్లినందున ప్రయోజనం ఏమీ లేదు — తమ శ్యామల దృష్టిలో మరింత పలచబడటం తప్ప. తనని చూడగానే శ్యామల తనని కౌగలించుకుని "ఇంత అర్ధరాత్రి ఎక్కడకు వెళ్లేరు ? నన్ను క్షమించండి" అంటూ కళ్లనీళ్లు కారుస్తుంది. ఆ కన్నీళ్లని చూస్తూనే తన మనసు కరిగిపోతుంది. మర్నాటి నుండి మామూలే !

తను ఉద్యోగంకోసం కాళ్లరిగేలా తిరగటం, ఏమీ దొరక్క యింటికి రావటం, శ్యామల తన అపహానానికి, అశాంతికి తాను బాధ్యుడైనట్లు భావించి తనని దోషిలా చూస్తూ యింట్లో ప్రవర్తించటం, ఆమె తనని సాధించటం, తనని తానే వూహించుకుని ఆమె బాధపడటం ... ఆ నరకం మళ్లీ మొదలు.

ఈ నరకానికి అంతం ఏమిటో తను చూడాలి. ఈ దౌర్భాగ్య జీవితానికి యీనాటితో స్వస్తి చెప్పాలి.


శ్యామల వివాహమైన తరువాత ఇంతగా మారిపోతుందని తానెన్నడూ అనుకోలేదు. ఆమెలో ఎంత అహంభావం ఉందో తనకి వివాహానికి పూర్వమే తెలియకపోలేదు. కాని ఆ అహంభావానికి తానుకూడా ఒకనాడు బలి కావలసి వస్తుందని తానా ప్రేమమైకంలో ఊహించలేకపోయేడు.

శ్యామల మాత్రం ఆ రోజుల్లో తన నెంతగా ప్రేమించింది ! ఆ రోజు పబ్లిక్ గార్డెన్సులో తను "నాలో యే అర్హతలు చూసి మీరు నన్ను భర్తగా స్వీకరిస్తున్నారో" అంటే "మీరు నాకు నచ్చేరు. అదే మీ అర్హత" అన్న శ్యామలేనా యీ రోజు తన నిలా అవమానపరచి యింటిలోనుండి గెంటివేసింది ?

పుట్టిన రోజున బలవంతాన కొత్త బట్టలు తొడిగించింది శ్యామల. ఇంత ఖరీదైన బట్టలు నా అంతస్తుకి తగినవి కావు అని తను అంటే "మీ అంతస్తును గురించి మాట్లాడేటప్పుడు మీ ఒక్కరి జీతాన్నే దృష్టిలో ఉంచుకుని ఎందుకు మాట్లాడతారు ? మనిద్దరి ఆదాయం కలిపి మన అంతస్తును నిర్ణయించుకోండి. భార్యా భర్తలు సంపాదించే డబ్బును యిద్దరూ ఉమ్మడిగా అనుభవించాలి గాని "నీ డబ్బు — నా డబ్బు" అని వేరు వేరుగా చూస్తే ఎలా ?" అన్న శ్యామలేనా "నా ఉప్పు తిని నన్నే కొడతావా ? ఫో ! నా యింట్లో ఒక్క క్షణం కూడా ఉండకు" అన్నది ?

ఏమిటీ మానవ మనస్తత్వం ? ఒకసారి అమృతాన్ని చిలికించే హృదయమే మరోసారి విషాన్ని కక్కుతుంటే యేం చెయ్యాలి ? ప్రేమాభిమానాలనేవి యింత అల్పమైనవా ? ఇంత చంచలమైనవా ?





అహం – అనురాగం

ఆస్తితో, అంతస్తుతో నిమిత్తం లేకుండా నిలబడే శక్తి ప్రేమకు లేదా ? డబ్బు! డబ్బు! డబ్బు! ఈ ప్రపంచంలోని అనుబంధాలన్నీ డబ్బుతోనే ముడి పడి ఉన్నయ్. ఈ రోజు శ్యామల తనని అవమాన పరచింది. రేపు తన కన్నతల్లి కూడా తన అసమర్ధ తని చూసి నిందించవచ్చు. తన కడుపున పుట్టిన కొడుకు తనకి అన్నం పెట్టలేకపోతున్నాడన్న బాధలో తనని తూలనాడవచ్చు. అప్పుడైనా తనిలా బాధపడవలసివచ్చేదే! ఉద్యోగం పురుషలక్షణం అన్నారు అందుకే కాబోలు. వ్యక్తిగా ఒక పురుషుడు ఎంత వున్నతుడైనప్పటికీఅతనుచేసే ఉద్యోగాన్నిబట్టీ అతను సంపాదించే డబ్బునుబట్టీ అతనికిగౌరవం లభిస్తుంది. డబ్బులేని పురుషుడికి ఎంత మంచితన మున్నా, ఎన్ని తెలివితేటలున్నా లాభంలేదు. డబ్బు వున్నప్పుడే మిగతా సుగుణాలన్నీ రాణిస్తయ్. ఏ రంగంలోనైనా మనిషికి గుర్తింపు లభిస్తుంది అనుకున్నాడు రవి.

ఐతే డబ్బు సంపాదించటం ఎలా ? తనలో కండబలం వుంది. తెలివితేట లున్నయ్. అక్షర జ్ఞానం వుంది. పైగా రచనా వ్యాసంగంలో కొంత ప్రవేశంకూడా వుంది. ఎన్ని వుంటే నేమి లాభం ? తనలోని అర్హతలను ఉపయోగించుకుని పని చేయించుకునే శక్తి వున్న పెద్దమనుష్యులు లేరు. మన దేశంలోని దౌర్భాగ్యమే అది. పని చేయ టానికి, అవసరమైతే గాడిదలా చాకిరీ చెయ్యటానికి కూడా లక్షలాది ప్రజలు సిద్ధంగా వున్నారు. కాని వాళ్లకి పనియిచ్చే నాధులే లేరు.

అలా ఆలోచిస్తుండగానే తెల్లవారింది. "శ్యామల నిద్రలేచి వుంటుందేమో యీపాటికి" అనుకున్నాడు. "అసలు తను రాత్రి నిద్రపోయి వుంటుందా ?" అన్న ప్రశ్నకూడా ఉదయించక పోలేదు.

ఏమైనాసరే. తను మాత్రం చలించకూడదు. శ్యామలకు దూరమవటం తనకీ, శ్యామలకీ ఇద్దరికీ శ్రేయస్కరమే! ముఖ్యంగా యీ పరిస్థితులలో శ్యామలకి తన వియోగం ఎంతో అవసరం. తను దూరంగా వుంటేకాని తన విలువ ఏమిటో శ్యామలకి తెలిసిరాదు. ఆమెకు తనమీద ప్రేమ లేకపోలేదు. కాని అంతకన్న ఎక్కువగా ఆమె తన అహాన్నే ప్రేమిస్తోంది. ఈనాటితో ఆమె అహంకారం తునాతునకలైపోవాలి. బంగారాన్నైనా శుద్ధిపరచా లంటే కాల్చక తప్పదు. ఆవేదనతో, పశ్చాత్తా పంతో దగ్ధమయితేతప్ప నిజమైన ప్రేమ పునీతం కాదు. ఆమెలోని అహంకారానికి ఆమె శిక్ష అనుభ వించాల్సిందే! తప్పదు. ఇంకా తను మెత్తపడ్డా డంటే ఆ అహంకారం మరింత విజృభించి ఆమెనూ తననీకూడా సర్వనాశనంచేసి తీరుతుంది.

అందుకే – ఆమెకు గుణపాఠం చెప్పటానికే తను ఆమెకు దూరమవ్వాలి.

అలా గట్టిగా తీర్మానించుకున్న రవి చటుక్కున లేచి బజారువైపుకు నడిచేడు. తనకి తెలిసిన మార్వాడీ దుకాణం దగ్గరకు వెళ్లి చేతికున్న వాచీ తీసియిచ్చి ఏభైరూపాయలు తీసుకున్నాడు.

ఆ వాచీకి అంతకంటె ఎక్కువ పైసాకూడా రాదని చెప్పేసరికి చేసేదిలేక ఏభై రూపాయలు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు రవి.

పన్నెండు గంటల వరకు భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ అసహనంగా తిరిగేడు. తరువాత హోటల్లో భోజనంచేసి తన ఆలోచనలకొక రూపాన్ని యివ్వదలచుకున్నాడు. ఒక ఇన్‌లాండు కవరు కొని ప్రక్కనే ఒక కుర్రవాడి నడిగి పెన్ను తీసుకుని శ్యామలకు లెటర్ వ్రాసేడు.

ఆ లెటర్ వ్రాస్తున్నప్పుడు మరోసారి ముందూ వెనకా ఆలోచించేడు రవి. "నేను తొందరపడటం లేదుకదా ?" అని మరల మరల తనని తాను ప్రశ్నించుకున్నాడు. ఇంతకన్న గత్యంతరం లేదని గ్రహించి, గుండెదిటవు చేసుకుని ఉత్తరం వ్రాయటం పూర్తిచేసేడు. అంతేకాదు. శ్యామలను సంబోధిస్తున్నప్పుడు ఆమె రూపం అతని కళ్ల ముందు ప్రత్యక్షమయింది. ఒకనాటి తన ప్రేయసిగా, మధుర దేవతలా కాదు — అహంకారంతో, మిధ్యాడంబరాలతో విర్రవీగే రాక్షసిలా. ఆ భయంకర స్వరూపం కనపడగానే అతని నిశ్చయం మరింత ధృఢమయింది. అతని కలంలో కూడా కటుతనం వచ్చింది. పగ సాధించాలన్న పట్టుదల పెరిగింది. ఆమెను హింసపెట్టి ఆమెవల్ల తానెంతగా హింసకు గురి అయ్యేడో చూపాలనుకున్నాడు.

ఉత్తరం పూర్తిచేసి పోస్టులో వేసిన తరువాత ఒక మహోద్రేకం చల్లారినట్లయింది అతనికి. తన జీవితంలో ఒక అధ్యాయం ముగిసినట్లు, మరొక ముఖ్యమైన అధ్యాయం ప్రారంభం కానున్నట్లు అతనికి అనుభూతి కలిగింది.

రేపీపాటికి ఆ ఉత్తరం శ్యామల కందుతుంది. తానేమో మద్రాసు వెళ్లే రైల్లో ఉంటాడు అనుకున్నాడు రవి.

ఆ రాత్రి ట్రైన్‌కే మద్రాసు బయలుదేరేడు రవి. ట్రైనులో కూర్చున్నాడన్న మాటేకాని అతనికంతా అయోమయంగా ఉన్నది. రైలు బయట అంతటా వ్యాపించి ఉన్న చీకటిలాగానే అతని మనసులోకూడా దట్టమైనచీకటి అలముకునిఉన్నది.

భవిష్యత్తు శూన్యంగా కనపడుతోంది. కాని పరుగెత్తే రైల్లో నుండి అంత చీకటిలోనూ మినుకు మినుకు మంటున్న దీపాలేవో దూరాన్నుండి కనబడుతున్నట్లుగానే అతని మనసులో కూడా ఏవో ఆశలు మినుకు మినుకు మంటూ మెరుస్తున్నయ్.

దీర్ఘంగా నిట్టూర్చి తలను కిటికీమీద ఆనించి కళ్లు మూసుకున్నాడు రవి. ఇంతలో ఎవరిదో పసిపిల్ల ఏడుపు వినిపించి కళ్లు తెరచి చుట్టూ చూసేడు.

తన కెదురుగా ఎవరో దంపతులు కూర్చుని ఉన్నారు. ఆమె చేతిలో ఆరు నెలల పసిపాప ఉంది. ఆ దంపతుల వయస్సుకూడా యించు మించు తమ వయస్సులాగానే ఉన్నది. వాళ్లని చూస్తుంటే శ్యామలా తనూ అలా కలసి ప్రయాణం చేస్తుంటే ఎంత బాగుండును ! అనిపించింది.

మరో వారం రోజుల లోపునే శ్యామలకు కాన్పు వస్తుందని డాక్టర్ చెప్పింది. కాని తనకి పుట్టబోయే శిశువును చూసుకునే అదృష్టంకూడా లేకపోయింది.

రవి కళ్లలో నీళ్లు తిరిగినయ్.

ఎందుకు వచ్చిన పంతాలివి ? భార్యాభర్తలన్న తరువాత మాటా మాటా అనుకుంటారు. తిట్టుకుంటారు కొట్టుకుంటారు అంతమాత్రాన విడిపోవలసిందేనా ? విడిపోవటమే పరిష్కార మార్గమా ? అంతకుతప్ప మరో మార్గం లేదా ? తానంటే పురుషుడు. ఎక్కడైనా తిరుగుతాడు. ఎన్ని అగచాట్లన్నా పడతాడు. కాని శ్యామల సంగతేమిటి ? ఎంత ఉద్యోగస్తురాలైతే మాత్రం భర్తని వదిలేసిన స్త్రీకి సంఘంలో గౌరవం వుంటుందా ? ముఖ్యంగా తమకి పుట్టబోయే శిశువు భవిష్యత్తేమిటి ?

లాభంలేదు. అలాటి ఆలోచనలు వచ్చినంత మాత్రాన ప్రయోజనం లేదు. ఒక మంచి పని చెయ్యదలచుకున్నప్పుడు దానివల్ల కొందరికి దుఃఖం కలుగవచ్చు. కార్యసాధననే లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తి ఎన్ని త్యాగాలకైనా సిద్ధంగా వుండాలి.

అలా పరస్పర విరుద్ధమైన భావాల మధ్య నలిగిపోతూ కూర్చున్నాడు రవి.

పాప నిద్రపోతోంది ప్రశాంతంగా. పాప చెక్కిళ్ళ ప్రేమగా స్పృశిస్తున్నట్లు నటిస్తూ భర్త — భార్యకి దగ్గరగా జరిగేడు. వెనకగా ఆమె చుట్టూ చెయ్యి వేసేడు. భార్య అతనివంక చిలిపిగా, లాలనగా, మందలింపుగా చూస్తూ తన భర్త చేసే కుర్ర చేష్టలను రైల్లోనాళ్లు ఎక్కడ గమనిస్తారోనని అతని చెయ్యి కనపడకుండా పమిట చెంగుతో కప్పివేసింది.

ఆ దంపతు లిద్దరూ అలా ఒకరి స్పర్శలో ఒకరు పరవశమౌతూ తమ ముద్దులపాపని కూడా మరచిపోయి తన్మయులై కూర్చునేసరికి రవి గుండెలో ఎవరో వెయ్యి శూలాలు గుచ్చినట్లు బాధపడసాగేడు.

ఎన్నడూ లేని అసూయ అతని హృదయాన్ని వశపరచుకుని హింసించసాగింది.

ఈ జన్మలో తను ఆ రకమైన మధురానుభూతులను పొందగలడా ? అనుకున్నాడు.

అలా అనుకోగానే తాను శ్యామలతో గడిపిన మధుర క్షణాలు కూడా ఎంతో వెగటుగా తోచినయ్ రవికి.

తన జీవితంలో యింక సున్నితమైన భావాలకు తావులేదు. దృఢమైన చేతలతోనే తను తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవాలి. అనుకున్నాడు.

ఆ తరువాత అతను ఆ దంపతుల వైపు చూడటమే మానివేసేడు. తల బయటకు పెట్టి చీకటిలోకి చూస్తూ కూర్చుండిపోయేడు. భవిష్యత్తును గూర్చి అతనికి నిర్దిష్టమైన ఆలోచన లేవీ లేవు. కాని ఏదో మహత్తరమైన సంకల్పబలం తనని సరియైన గమ్యానికే తీసుకుపోతుందన్న నమ్మకం అతనిలో చోటు చేసుకోసాగింది.

అలా ఎంతసేపు కూర్చుండిపోయేడో ! అర్ధరాత్రి కూడా దాటినట్లుంది. రైలు ఏదో స్టేషన్లో ఆగింది.

రవికి నాలుక పిడచగట్టుకుపోతోంది. ఆలోచనలతో వళ్ళు వేడెక్కిపోయి, దాహం విపరీతంగా కాసాగింది. ఎదురుగా ఉన్న దంపతులు ఒకరిమీద ఒకరు వాలిపోయి కునుకు తీస్తున్నారు. పొత్తిళ్లలోని పాప ముడుచుకుని పడుకుంది. వాళ్ల పక్కనే ఒక వాటర్ బాటిల్ కనపడింది. ఆ నీళ్ళు తాగుదామా అనుకున్నాడు. కాని వాళ్లకి నిద్రాభంగం కలిగించటం బాగుండదని ఊరుకున్నాడు. ఆ తరువాత వాళ్లకి మెలకువ వచ్చినాకనైనా ఎందుకో వాళ్ల నీళ్లు త్రాగకూడదనుకున్నాడు రవి.


"వయసొచ్చిన పిల్ల"లో శరత్, చంద్రకళ

నిర్మల ప్రేమతో ఒకరినొకరు బంధించుకున్న ఆ దంపతుల దగ్గరి నీళ్లు త్రాగటానికి బీదులాటి అతని మనసు ఒప్పుకోలేదు. వాళ్లేదో తనకి శత్రువు లయినట్లు వాళ్లకి సంబంధించిన ఏ వస్తువునీ తను స్పృశించకూడదన్నట్లు, వాళ్ల అనుభూతుల వాసనకూడా తనకి తగలటానికి వీల్లేదన్నట్లు మొండికెత్తుతోంది అతని మనసు.

అందుకే స్టేషన్లో రైలు ఆగిఉన్నది కనుక దిగి పంపు దగ్గర ఎక్కడైనా నీళ్లు త్రాగివద్దామనుకుని మెల్లగా దిగేడు రవి.

ప్లాట్‌ఫారం మీద జనం అంతగా లేరు. ఎక్కే దిగే ప్రయాణీకుల సంఖ్యకూడా చాలా తక్కువగానే ఉంది. రైలాగి ఎంతసేపైందో, ఎంతసేపు అక్కడ ఆగుతుందో అతనికి తెలియనే తెలియదు. అందుకే తను నీళ్లు త్రాగి వచ్చేలోపల రైలెక్కడ వెళ్లిపోతుందోనన్న భయంతో వడి వడిగా నడవసాగేడు ప్లాట్‌ఫారంమీద. ఎక్కడా దగ్గర్లో పంపే కనపడ లేదు. కాంటీను కూడా మూసి ఉన్నది. గాభరాగా ప్లాట్‌ఫారమంతా కలియజూసేడు.

మసక చీకట్లో దూరాన ఒక పంపు ఉన్నట్లు కనపడింది. అటువైపుకు పరుగెదుతున్నట్లుగా వెళ్లేడు రవి. ఇంతలో రైలుకూత వినిపించింది. అది తమ రైలో, పక్కన ఉన్న మరో రైలో ఆ హడావిడిలో గుర్తించలేకపోయేడు. ఎలాగో పంపును చేరుకుని రెండు గుక్కలు నీళ్ళ తాగేసరికి రైలు కదులుతున్నట్లు తెలిసింది. దాంతో దాహం సంగతి కూడా మరచిపోయి రవి రైలువైపుకు పరుగెత్తేడు. అప్పటికే రైలుపెట్టెలు ఒకదాని వెంట ఒకటి పరుగు తీస్తున్నయ్. రవికి కళ్లు బైర్లు క్రమ్మినట్లయింది. ఎటూకాని ప్రదేశంలో చిక్కుకు పోతానేమోనన్న భయం కలిగింది.

ఆ అయోమయంలో తను ఎక్కవలసిన పెట్టేదో కూడా అతను గుర్తించలేకపోయేడు. క్రమంగా రైలు వేగాన్ని పుంజుకుంటోంది. చక చక నడుస్తున్న రైలుపెట్టెల్లో ఒకదానికున్న కడ్డీ పట్టుకుని ప్రాణాలకు తెగించి ఒక్క ఉదుటున లోపలికి గెంతేడు రవి. [ఇంకా వుంది]





ప్రేమమూర్తులు !

పవిత్ర ప్రేమకు ఆస్తి, అంతస్తు, కులం—గోత్రం అడ్డుగోడలు కావు. అగర్భ శ్రీమంతుడైన రాము, అనాథ కరుణను మనసారా ప్రేమించాడు. ఆమె మాత్రం కాస్త సందేహించింది.

"కరుణా, ఒక్కమాట చెప్పు. నీ కిష్టం లేదంటే యీ చాయలకే రాను." అంటూ ప్రాధేయ పడ్డాడు.

"నన్నెందుకు అర్థంచేసుకోటానికి ప్రయత్నించవు రామూ ? చేజేతులా కోరి కోరి కష్టాల్నెందుకు కొనితెచ్చుకుంటావు ?" అని సలహా యిచ్చింది.

"భవిష్యత్తునునిర్ణయించేదిమనంకాదు" అన్న అతడి మాటలకు కరుణ సమాధానం చెప్పలేక పోయింది.

"కరుణా. నిన్ను భార్యగా తీసుకెళ్ళడానికి ఎవరూ అడ్డురారు. ఒకవేళ, అదే జరిగితే, అమ్మే కాదు ... యీ లోకాన్నే ఎదిరిస్తాను" అంటూ తన నిశ్చితాభిప్రాయాన్ని వెల్లడించాడు. కరుణ కళ్ళు ఆనందాశ్రువులతో నిండాయి.

కరుణను పెంచిన వార్డెన్, రాముతో వివాహాన్ని అంగీకరించి, ఆశీర్వదించింది.

దంపతులుగా వెళ్ళిన కరుణ, రాములపట్ల అమ్మ ఎలా ప్రవర్తించింది ? ప్రేమించి పెళ్ళి చేసుకున్న వారి జీవితం సాఫీగా సాగిందా ? అనేడి ప్రశ్నలకు సమాధానం కావాలంటే త్రిమూర్తి ప్రొడక్షన్స్ వారి "అభిమానవతి" చూడాల్సిందే. ఈ చిత్రానికి డూండీ దర్శకులు. నిర్మాతలు బాబ్జి, సాంబశివరావు. తండ్రిగా, తనయుడుగా కృష్ణ నటించారు. కరుణగా వాణిశ్రీ నటించింది. శ్రీ లింక్ రిలీజ్.

"అమ్మాయిల శపథం"లో చంద్రకళ, రామకృష్ణ

ఏటా కవలపిల్లలు !

రమాప్రభను పెళ్ళిచూపులనాడు చూచి, రాజబాబు ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే, అప్పుడే కన్నుకొట్టింది. ఆమె చర్యకు ప్రతిఫలమే రాజబాబుకు అర్ధాంగి గావడం.

పిల్లలు లేక ఎందరో బాధపడుతుంటే, వీళ్ళకు ఏటా కవలపిల్లలు పుట్టారు. పెళ్ళయిన మూడేండ్లకు ఆరుగురు తయారు. పిల్లలకు తల్లి వలె కన్నుకొట్టే పోలిక వచ్చింది.

ఆరోజు పెళ్ళిరోజు. గుడికి వెడదాము రండి అంటూ భర్తను పిలిచింది. అతడు కసిరికొట్టాడు.

"పెళ్ళిరోజు పేరిట సంతాన గోపాలస్వామి గుడికి వెళ్ళడం, ఏటేటా కవలపిల్లలు పుడి పడడం ... కన్నుకొట్టేవాడు, కళ్ళు ఆర్పేది పుట్టి నా ప్రాణం తోడెయ్యడం" అంటూ భార్యను గద్దించాడు.

"ఎందుకండీ అలా గంతులేస్తారు. తప్పు నాదే అయినట్లు ! కనిపించిన ఆడపిల్లకల్లా కన్నుగొట్టి చెంపలు యిస్త్రీ చేయించుకున్నదెవరో ? చూడ్డం తోటే ఎగిరిగంతేసి పెళ్ళి చేసుకుని, పైగా నన్నంటారేం ? అంది భార్య విసుగ్గా."

"బుద్ధి గడ్డితిని చేసుకొన్నాను. ఈరోజు అనుభవిస్తున్నాను" అంటుండగా ఒక పిల్లవాడు వచ్చి తండ్రి చెంప వాయిస్తాడు. "కట్" అన్నారు దర్శకుడు విశ్వనాథ్. ఈ గమ్మత్తయిన ఘట్టం డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ వారి "జీవనజ్యోతి" వర్ణ చిత్రంలో కడుపుబ్బ నవ్విస్తుంది. భార్యాభర్తలుగా రమాప్రభ, రాజబాబు అతి సహజంగా నటించారు. ప్రముఖ నిర్మాత డి. వి. ఎస్. రాజు నిర్మిస్తున్న యీ చిత్రానికి విజయా పంపిణీదారులు.

వేములవాడ భీమకవి

చిత్రాన్ని ఎన్టీఆర్ డైరెక్టు చెయ్యగలరని లోగడ రాశాము. ఇటీవల రామారావుగారిని కలిసి నప్పుడు, ఆ చిత్రానికి యోగానంద్ దర్శకులన్న సంగతిని తెలుసుకొన్నాను.

భీమకవిగా చిరంజీవి. బాలకృష్ణ నటిస్తున్న ఈ చిత్రానికి సముద్రాల రచనను, రాజేశ్వరరావు సంగీతాన్ని, సత్యనారాయణ ఛాయాగ్రహణాన్ని నిర్వహిస్తున్నారు.

"భీమకవి" చిత్రంలో అతి ముఖ్యమైన కళింగ యువరాజు పాత్రను రామారావు పోషిస్తున్నారు. రాజా గంగుగా సత్యనారాయణ నటించే యీ చిత్రంలో జయలలిత, విజయలలిత, కాంతారావు యితర ముఖ్య పాత్రలను పోషించగలరని తెలిసింది.

ఏప్రిల్ నుండి "దాన వీర శూర కర్ణ" షూటింగు ప్రారంభం కాగలదని, నటరత్న చెప్పారు.

"చిల్లర దేవుళ్ళలో" టి. రాజేశ్వరి







"జీవనజ్యోతి"లో వాణిశ్రీ, శోభన్‌బాబు

"చీకటి వెలుగులు"లో కృష్ణ, పద్మప్రియ

దుక్కిపాటి చిత్రానికి తాతినేని దర్శకత్వం

ప్రజలకు యిష్టమైన సంస్థలలో దుక్కిపాటి మధుసూధనరావుగారిదొకటి. ప్రేక్షకులు యిష్టపడే పద్ధతిలో చిత్రాలను నిర్మించే కొద్దిమందిలో దుక్కిపాటి ఒకరు.

ఇటీవల ఆయన్ను, ఆళ్వార్‌పేటలోని కొత్త ఆఫీసులో కలిశాను. నేనువెళ్ళిన సమయంలో ఆయన నాగేశ్వరరావుగారితో డైరెక్టుకాల్ మాట్లాడుతున్నారు. తాతినేని రామారావును దర్శకుడిగా పెట్టినట్టు అక్కినేనితో అన్నమాటలు నా చెవిని పడ్డాయి.

అన్నపూర్ణా ఆఫీసు యిరవై రెండేండ్లు భగీరధమ్మాళ్ వీధిలో నివసించింది. 1952 నుంచి





"అన్నదమ్ముల కథ"లో సుజాత, రోజారమణి

* * *

1974 వరకు అక్కడవుండి, ఎన్నో మంచి చిత్రాలను అందించింది.

1975లో, అన్నపూర్ణా అధినేత భగీరధమ్మాళ్ వీధినుంచి, నెంబర్ తొమ్మిది, అశోకా వీధి, ఆళ్వార్‌పేటకు మకాం మార్చారు. కొత్త ఆఫీసు ఫోన్ నెంబరు. 73436.

అక్కినేనితో ధర్మపత్ని

"విచిత్రబంధం" తర్వాత అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్ నిర్మించబోయే చిత్రం పేరు "ధర్మపత్ని." ఇందులో నటసామ్రాట్ కథానాయకుడు. కథను నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు రాశారు.

పి. ఎ. పి. తీసే రెండు చిత్రాలు

ప్రజా హృదయాలకు అనుగుణంగా చిత్రాలను నిర్మించే ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ యీసారి రెండు చిత్రాలను నిర్మించే పథకంలో వున్నది.

ఒక చిత్రంలో అక్కినేని నటించగలరు. రెండవ చిత్రంలో నాగేశ్వరరావు రొమాంటిక్ హీరోగా నటించగలరు.

ఒక చిత్రానికి ప్రత్యగాత్మ దర్శకుడు. మరొకదానికి తాతినేని రామారావు దర్శకుడు. ఈ రెండు చిత్రాల నిర్మాత ఏ. వి. సుబ్బారావు.

ఆడవాళ్లు - అపనిందలు


శుభ చిత్రాలయ నిర్మించిన ఈ చిత్రం మహిళాలోకానికి దగ్గరి చుట్టమయ్యే కథాంశమును గొనియున్నదని మకుటమే సూచిస్తున్నది. ఈ చిత్రానికి బి. ఎస్. నారాయణ దర్శకుడు. ప్రతిభావంతుడు గాబట్టి కథలో, కథనంలో కడు జాగ్రత్త వహించి, చిత్రం సర్వజనరంజకంగా రూపొందించియుండగలడు.

నటీనటుల గూర్చి వ్రాయాల్సివస్తే, ముందు కృష్ణంరాజును పేర్కొనాలి. మానసిక సంఘర్షణకు గురి అయిన అతి క్లిష్టమైన పాత్రను, ప్రజలు యిష్టపడే విధంగా నటించారు. తరువాతి స్థానం జయంతికి లభిస్తుంది. కరుణరస ప్రధానమైన వేషంలో జయంతిది పైచేయిగా వుంటుంది.


సహాయ పాత్రలను గుమ్మడి, శుభ, సుధీర్, మాడా, పొట్టిప్రసాద్, సత్యప్రియ, అనిత, రాధాకుమారి పోషించారు. హాస్యం పాలును నాగేష్, విజయభాను పూర్తిచేశారు.

ఈ చిత్రానికి దాసం గోపాలకృష్ణ మాటలను, జి. కె. వెంకటేష్ సంగీతాన్ని, బి. ఎన్. ప్రకాష్ ఛాయను, ధవ కోటేశ్వరరావు సహకార దర్శకత్వాన్ని నిర్వహించారు.

పవిత్రత వున్న యీ కథకు ప్రేక్షక ఆదరణ లభించవచ్చు. పూర్ణా విడుదల.



''పూర్ణమ్మకథ''లో ఒక దృశ్యం



''బలిపీఠం''లో ఒక సన్నివేశం

* సినిమా *

ఆదిరాజా ప్రొడక్షన్స్

పై సంస్థను ఆనందమోహన్ స్థాపించారు. ఈ ఆనందమోహన్ చిత్ర పరిశ్రమకు సుపరిచితుడే. మంచి కథకుడుకూడా. ఈసారి నిర్మాత కూడా ఆయ్యాడు. చక్కటి టేస్టువున్న మనిషి అని చెప్పడానికి తన చిత్రాన్ని ప్రఖ్యాత హిందీ ఛాయాగ్రాహకుడు, దర్శకుడు అయిన వి. యస్. రెడ్డి చేత డైరెక్టు చేయించడమే ఒక నిదర్శనం.

అంతేగాక మద్రాను మహానగరంలో వెలసివున్న ఫిలిం యాక్టింగ్ స్కూలు నుంచి మొదటి బాచ్ విద్యార్థి విద్యార్థినుల్లో కొంతమందిని ఎన్నుకుని తన చిత్రంలో నటింపచేస్తున్నాడు ఆనందమోహన్. రామకృష్ణారెడ్డి, గీతామాలిని, ఇంకొంతమంది ఆదిరాజా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న తొలి కలర్ చిత్రంలో ప్రముఖ పాత్రలను పోషిస్తున్నారు.

ఏ స్టుడియో ప్రమేయం లేకుండా అంతా అవుట్‌డోర్ ప్రదేశాల్లోనే చిత్రించాలని అభిప్రాయ పడుతున్నాడు నిర్మాత ఆనందమోహన్. అతి త్వరలో హైదరాబాద్‌లో చిత్రాన్ని ప్రారంభించి, రెండుమాసాల్లో చిత్రాన్ని పూర్తిచేయాలను కుంటున్నారట.

పరిశ్రమలో ఎంతోకాలంగా వుంటూ, అనేక మందికి అమూల్య సలహాలనిస్తూ, యిప్పటికి తన కంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకొన్న ఆనంద మోహన్‌కు, యీ కొత్త ప్రయత్నంలో ప్రయోజనం కలగాలి. ఇందులో నటించనున్న కొత్త కళాకారులకు ప్రేక్షకుల ఆశీర్వాదం లభించాలి.

ఇలాంటి కొత్త ప్రయోగాలను తలపెట్టే వ్యక్తులకు ప్రజాదరణ ఎంతేని అవసరం.

రాబోయే శోభన్ చిత్రాలు

ఈ ఏడు శోభన్‌బాబు చిత్రాలలో విజయాన్ని చవిచూచేవి చాలా వున్నాయి. జనవరి పదకొండున విడుదలైన 'దే. చే. పె' ప్రేక్షకులను ఆకర్షించింది.

మారుతీ ప్రొడక్షన్స్ వారి ''బాబు'', జెమినీ పిక్చర్స్ వారి ''కొత్త చిత్రం'', రవి శంకర్ ఆర్ట్ పిక్చర్స్ వారి ''బలిపీఠం'', సమత ఆర్ట్స్ వారి ''జేబుదొంగ'', డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ వారి

''జీవనజ్యోతి'' చిత్రాలు నెలకొకటి చొప్పున విడుదలవుతాయి.

పై నుదహరించిన చిత్రాలలో వెరైటీ శోభన్ బాబు కనిపిస్తారు. అన్నీ వర్ణ చిత్రాలే.

బాబులో అగ్రనటి, జెమినీ — సమతలలో మంజుల, బలిపీఠంలో శారద, జీవనజ్యోతిలో వాణిశ్రీ హీరోయిన్ పాత్రలను పోషించారు. అనుభవజ్ఞులైన దర్శకులు, సంగీత దర్శకులు, ఛాయాగ్రాహకులు పై చిత్రాలకు పనిచేశారు.

రోజు రోజుకు శోభన్‌మీద ప్రేక్షకులకు ప్రేమాభిమానాలు పెరుగుతున్నాయి. వారి అభీష్టాను సారంగా నటించే పద్ధతి శోభన్ అలవర్చుకొన్నారు.



కోర్టుకెక్కిన దంపతులు

అరుణా భాస్కరరావు అన్యోన్యంగా, అనురాగంగా కాపురం చేసేవారు. పరిస్థితుల ప్రభావం వల్ల, భార్యాభర్తలు విడిపోయారు. భార్య లేని యిల్లు నరకం అనిపించింది. తనతో కాపురం చెయ్యమని ఎన్నోసార్లు అర్థించాడు. ఆమె ససేమిరా రానంది. తనతో పిల్లల్ని పంపించమని కోరాడు.

అరుణ : పిల్లలుండేది తల్లి దగ్గరే.

భాస్కర్ : నిజమే. తల్లి తండ్రి దగ్గరకు రాదు. తండ్రికి పిల్లలు కావాలి.

అరుణ : కావాలి అంటే రారు.

భాస్కర్ : పంపిస్తావా లేదా ?

అరుణ : పిల్లలు మీకే స్వంతంకాదు.

భాస్కర్ : నీకూ కాదు.

అరుణ : నే చచ్చేవరకు నా పిల్లలు నాతోనే వుంటారు.

భాస్కర్ : పిల్లల్ని నాకు కాకుండా చేసే హక్కు నీకు లేదు.

అరుణ : పిల్లల్ని తల్లినుంచి వేరుచేసే హక్కు మీకు లేదు.

భాస్కర్ : తల్లిని వేరుచెయ్యడంలేదు. తల్లినికూడా రమ్మంటున్నాను.

అరుణ : గొర్రె కసాయివాడిని కత్తి ఎత్తే వరకే నమ్ముతుంది.

ఇలా భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. చివరకు భాస్కర్‌కు కోపం ఆగిందికాదు. దంపతులు కోర్టు కెక్కవలసి వచ్చింది.

ఈ గంభీరమైన ఘట్టం రవి శంకర్ ఆర్ట్ పిక్చర్స్ వారి ''బలిపీఠం''లో హృదయాన్ని కదిలిస్తుంది. భాస్కర్‌గా శోభన్, అరుణగా శారద అతి సహజంగా నటించారు. దాసరి దర్శకత్వంలో సింగారించుకుంటున్న ''బలిపీఠం'' వర్ణ చిత్రాన్ని వై. సునీల్ నిర్మిస్తున్నారు. ఏ. శేషగిరిరావు సమర్పించే యీ ప్రయోజనాత్మక చిత్రానికి నవయుగ పంపిణీదారులు.

రవి శంకర్ తరువాతి చిత్రం

''బలిపీఠం'' చిత్రం ప్రయోజనాత్మకమైన అంశాలను గొనియున్నదయితే, తరువాతి చిత్రం

వ్యాపార లబ్ధిని పొందే అంశాలను గొనియున్న దన్న నిజాన్ని, నిర్మాతల ద్వారా తెలుసుకొన్నాను.

తరువాతి చిత్రంలో శోభన్‌బాబు వైవిధ్యమున్న పాత్రను పోషిస్తున్నట్టు చెప్పారు. అన్యాయాన్ని త్రుంచి, న్యాయాన్ని పెంచే పుత్తమ పౌరుడి పాత్రను ఆయన పోషించగలరని తెలిసింది.

ప్రభుత్వం ఏం చేస్తుంది? వర్ణాంతర వివాహాలను చేసుకునే వాళ్లను ప్రభుత్వం సత్కరించగలదన్నది నిజమయితే, అట్టి మంచి పనికి దోహదంచేసే ''బలిపీఠం'' వంటి చిత్రాలకు వినోదపు పన్ను రద్దుచెయ్యాల్సిన బాధ్యత పరిపాలకులకు లేదా?

శ్రీకృష్ణ జరాసంధ

అమరావతి పిక్చర్స్ తలపెట్టిన ఈ పౌరాణికాన్ని జనవరి యిరవైనాలుగున కె. నందగోపాల్ స్విచ్ ఆన్ చెయ్యగా ఏ. వి. ఎమ్. మురుగన్ క్లాప్ కొట్టడం సంభవించింది.

జరాసంధకు సంబంధించిన కధను యిటీవలకాలంలో ఎవరూ ముట్టుకోలేదు. ఈ పురాణ కధకు, సముద్రాల రమ్యమైన రచనా శైలిలో మాటలను సమకూర్చారు.

పరిశ్రమలో పదేండ్ల అనుభవం ఆర్జించిన జి. వి. ప్రభాకరరావు యీ చిత్రానికి దర్శకత్వం నిర్వహిస్తూ, నిర్మిస్తున్నారు.

శ్రీకృష్ణుడుగా రామకృష్ణ, జరాసంధుడుగా సత్యనారాయణ నటిస్తున్న యీ చిత్రంలో సహాయ పాత్రలను మేటి నటీనటులు పోషిస్తున్నారు.

ఈ చిత్రం భాను పిక్చర్స్, (విజయవాడ) ద్వారా, శ్రీ రాజరాజేశ్వరీ పిక్చర్స్, (నైజాం) ద్వారా నటేష్ ఫిలిం ఎక్స్చేంజ్, (రాయలసీమ, మైసూరు) ద్వారా విడుదలవుతుంది.

పౌరాణిక కధలను ఎవరు తీసినా, ఎప్పుడు తీసినా, వాటిని చూచే మంచితనం ఆంధ్ర ప్రేక్షకులకు వున్నదిగాన, యీ కొత్త ప్రయత్నానికి విజయం చేకూరవచ్చు.

అడవిలో ఆనందరాగం

ఆమె డాక్టరు. అతడు ట్రైబల్ వెల్‌ఫేర్ ఆఫీసర్. ఇద్దరి మనసులు కలిశాయి. ఆమెకు అతడు మాంగల్య భాగ్యాన్ని యిచ్చాడు. ఆమె ఆనందానికి అవధులు లేవు.

ఇద్దరూ అలా ... అలా అడవిలో షికారు కెళ్లారు. ఒకర్ని విడిచి మరొకరు ఒక క్షణమైనా వుండలేని పరిస్థితిలో పడ్డారు. ఆ దంపతుల ఆనందరాగంపై, ఆత్రేయ ఎంత రమ్యమైన పాటరాశారు!

''నీవుకానిది ఈ లోకంలో ఏదీ కనబడదు
నీవు లేనిదే జీవితంలో ఏదీ మిగలదు
మనసూ మమతకు మరణం లేదని
మళ్లీ మళ్లీ పుడదాము.''

ఈ పాటను రామకృష్ణ, సుశీలచేత, చలపతి రావు కమ్మకమ్మంగా పాడించారు. డాక్టరుగా జమున, ఆఫీసరుగా రామకృష్ణ నటించారు. ఈ శృంగార దృశ్యం ఇ. కుప్పుస్వామి నిర్మిస్తున్న ''వనజ — గిరిజ'' లో కనిపిస్తుంది. ఇందులో రెండు జన్మల కధానాయికగా జమున వైవిధ్యమున్న పాత్రలను పోషిస్తున్నది.

పత్రికా రచయిత గౌతమ్ దర్శకత్వం నెరపుతున్న యీ చిత్రం త్వరలో ప్రేక్షకులను దర్శిస్తుంది.



''జేబు దొంగ''లో మంజుల

ఆత్రేయ ప్రత్యేకత

ఏ పాట రాసినా, అందులో ప్రత్యేకత చూపెట్టడం ఆత్రేయకే చెల్లు.

క్లబ్బు పాటలు ఎందరో రాశారు. ఏ. వి. కె. ప్రొడక్షన్స్ వారి ''లక్ష్మణరేఖ'' చిత్రంలో ఆత్రేయ ఒక క్లబ్బు పాటను వ్రాశారు. ఆయన కవితలోని ప్రత్యేకతను తెలుపుతాను.

''నేను కవిని కాను
ఊహలలో వూగటానికి
నేను రవిని కాను
మంటలలో వేగటానికి
మనిషిని! బ్రతకడం తెలుసుకున్న మనిషిని.''

ఈ పాటను బాలసుబ్రమణ్యంచేత బలేగా పాడించారు, సంగీత సారధి సత్యం.

జల్సా జీవితాన్ని గడుపుతూ, బరువు, బాధ్యతలు లేని అల్లరి మనిషి పాత్రధారి మీద పై పాటను చిత్రీకరించబోతున్నట్టు, యువ దర్శకుడు ఎన్. గోపాలకృష్ణ చెప్పారు. ఆ పాత్రను ధరిస్తున్నది చంద్రమోహన్. అతడి మాయమాటలను నమ్మి యిల్లువిడిచి వెళ్లిన వనితగా జయసుధ నటిస్తున్నది. ఈ చిత్రంలో గుమ్మడి, అల్లు రామలింగయ్య, కె. వి. చలం, రామదాసు, సుమ, ఛాయాదేవి ముఖ్య పాత్రధారులు. మురళీమోహన్‌కు మంచి వేషం యివ్వబడింది. గౌతమీ వెంకటరత్నం సారధ్యం వహిస్తున్న యీ చిత్రానికి కృష్ణారావు, షణ్ముగం నిర్మాతలు.

జనం చెప్పిన నిజం!

ప్రజలలో ఎవరికి ఎంత పలుకుబడి వున్నదో తెలుసుకుందామని, పది రోజులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాను. నేను అన్ని రకాల ప్రేక్షకులను కలిశాను.

రిక్షావాళ్లను, హోటల్ సర్వర్లను, కళాశాల విద్యార్థులను, గృహిణులను, పండితులను, బాల బాలికలను వేర్వేరుగా కలిసి, వారి వారి అభిప్రాయాలను సేకరించాను.

హీరోలని గూర్చి అడిగాను. అక్కినేని, నందమూరికి ఎక్కువ ఓట్లు వచ్చాయి. తరువాతి సీటు శోభన్‌బాబుకు యిచ్చారు. హీరోయిన్ల ప్రసక్తి వచ్చింది. వాణిశ్రీకి మాత్రమే ప్రజాదరణ వున్నదనిపించింది. గృహిణులు శారదకు ఓటు వేశారు.

ముగ్గురికి మాత్రం ప్రజలలో విపరీతమైన పేరు, ప్రఖ్యాతులు వున్నాయి. ఆ ముగ్గురు ఎవరన: రాజబాబు, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య.

సంగీత దర్శకులలో మహదేవన్‌కు మొదటి స్థానం. రాజేశ్వరరావుకు రెండవస్థానం, సత్యానికి— చక్రవర్తికి సమాన స్థానం, ఆదినారాయణరావుకు ప్రత్యేక స్థానం యివ్వడానికి ప్రేక్షకులు సుముఖంగా వున్నారు.

— శ్రీనివాస్

చిగురించిన జీవితం

ముద్దంశెట్టి హనుమంతరావు

(గత సంచిక తరువాయి)

> ***జరిగిన కథ 3:*** **డాక్టర్** రామరాజు యశోదమ్మల సంతానం శ్రీధర్, సీతలు. మెడిసిన్ చదివిన శ్రీధర్ ప్రయివేట్ డిస్పెన్సరీ ప్రారంభిస్తాడు. తనని ప్రేమించి, అమాయకంగా నమ్మిన సీతను పెళ్లి చేసుకొనటానికి సంశయించిన శ్రీనివాస్, ఆమె తల్లి కాబోతోందని తెలుసుకుని వెంటనే ఆ వూరినుంచి వెళ్లిపోతాడు. వంశ గౌరవం నిలుపుకోవటంకోసం సీతతోసహా తలిదండ్రులను తీర్థయాత్రలకు పంపిన శ్రీధర్ తన ప్రాక్టీసును మద్రాసుకు మార్చే ప్రయత్నంలో వుంటాడు.

మరి కొద్ది రోజులకి, బెంగుళూరునించి తండ్రి రాసిన కవరుత్తరం అందింది శ్రీధర్‌కి. ఒక నర్సింగ్ హోమ్‌లో సీత మగబిడ్డను కన్నట్టు, తల్లీ, బిడ్డా, క్షేమంగా వున్నట్టు ఆ వుత్తరంలో తెలియజేశారాయన. సంతోషమూ, బాధ, మిళిత మైన ఓ వింత అనుభూతిని పొందాడు, శ్రీధర్. అది శుభవార్తే అయినా, యెవ్వరికీ చెప్పుకోలేని వార్త? బాధతో కుంచించుకుపోయాడు, శ్రీధర్. తనే యింతగా బాధపడుతూ వుంటే, చెల్లాయి యెంతగా కుమిలిపోతోందో! అన్న ఆలోచన వచ్చి మరింత బాధ పడ్డాడు. శ్రీనివాస్ జ్ఞప్తికి వచ్చాడు. అనుకోకుండా పళ్ళు పటపటా కొరుక్కున్నాడు. అంత కోపం వచ్చిందతనిమీద. కాని, యేం లాభం? అతను అగుపించడంలేదు. ఆ వుత్తరాన్ని తన పెట్లో భద్రంగా దాచుకొని, శ్రీనివాస్ యింటి కేసి బైలుదేరాడు. ఆ మధ్య అప్పుడప్పుడూ వెళ్ళాడు గాని, ఓ నెల రోజుల్నించి వెళ్ళడం మానుకున్నాడు. అతను రాకపోతే, తానుమాత్రం వెళ్ళి యేంచేస్తాడు?

శ్రీధర్‌ని చూడగానే, శ్రీనివాస్ పక్కింటాయన బైటికొచ్చాడు. శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి లేక పోవడం శ్రీధర్ గమనించి. వుత్సాహంగా ముందుకి సాగిపోతూ ప్రక్కింటాయన్ని చూసి మందహాసం చేశాడు.

"శ్రీనివాస్ గురించేనాండీ?" అన్నాడు పక్కింటాయన.

"వచ్చేసినట్టున్నాడు కదండీ!" శ్రీధర్ హుషారుగా అడిగాడు.

"రాలేదండీ! ఇరవై రోజుల క్రితమే, ఇల్లుగల ఆసామీ ఇంట్లోని సామానంతా తన స్వంతం చేసుకొని, మరొకరికి అద్దెకిచ్చాడు. సుమారు యెనిమిది నెలలు దాటింది కదండీ! ఇంకెన్నాళ్ళు అతను తిరిగొస్తాడని, యెదురు చూస్తాడు? ఇంటాయన నష్టపోలా? సామాను ఖరీదైనదే వుంది. అయినా, శ్రీనివాస్ లాంటి వ్యక్తి యింత బాధ్యతా రహితంగా ప్రవర్తించడం యేం బావుండలేదు... మీరు యిన్నిసార్లు వస్తున్నారు. మీకు ఆయన బంధువా?" అంటూ యేవేవో చెప్పుకుపోయాడా పక్కింటాయన.

వుస్సురనుకుంటూ, ఓ నిట్టూర్పు విడిచాడు, శ్రీధర్. శ్రీనివాస్ వునికి ప్రస్తుతానికి తెలిసే అవకాశం లేదన్న నిర్ధారణకి వచ్చేశాడు.

"సరే, వస్తానండీ! శ్రీనివాస్ నాకు బంధువే! అందుకే, యిన్నిసార్లు వస్తున్నా." అని చెబుతూ స్కూటర్ని స్టార్ట్ చేశాడు, శ్రీధర్.

శ్రీధర్ మెదడు యేవేవో ఆలోచనలతో బరువెక్కింది. స్కూటర్ దూసుకుపోతోంది.

*   *   *

మద్రాసులో వున్న ఓ స్నేహితుడు రామనాథంకి వుత్తరం రాశాడు శ్రీధర్, అక్కడ మంచి యిల్లు అద్దెకు చూడమని. రామనాథం, ఇల్లు యేర్పాటయినట్టు వుత్తరం రాయంగానే ప్రయాణం కట్టాడు శ్రీధర్. సుబ్బారావు స్టేషనుకొచ్చి. శ్రీధర్‌ని సాగనంపాడు.

11

మద్రాసు త్యాగరాయ నగర్‌లో శ్రీధర్స్ డిస్పెన్సరీ కొత్తగా వెలిసింది. ఆ డిస్పెన్సరీకి ఆనుకునే శ్రీధర్ ఇల్లూ వుంది. అటువంటి చక్కని అద్దెకొంప ఏర్పాటు చేసినందుకు, స్నేహితుడు రామనాథంకి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు, శ్రీధర్.

శ్రీధర్ మద్రాసు చేరిన పదిరోజులకి, బెంగుళూరు నించి రామరాజు దంపతులు, సీత మద్రాసు వచ్చేశారు. సీత బిడ్డని యశోదమ్మ పొత్తిళ్లలో పెట్టుకుని రైలు దిగింది. శ్రీధర్ మేనల్లుణ్ణి తన చేతుల్లోకి తీసుకుని పరిశీలనగా చూశాడు. ఆ పసికందు ముద్దుగా వున్నాడు. ముమ్మూర్తులా సీత రూపాన్ని పుణికిపుచ్చుకున్నట్టే వున్నాడు వాడు. తల్లి పోలిక వచ్చినవాడు, చాలా అదృష్టవంతు డనుకున్నాడు. పసికందును తల్లి చేతికి యిచ్చేశాడు. సీతకేసి చూసి చిరునవ్వు నవ్వేడు. సీత మందహాసం చేసి, మొహం దించుకుంది. తప్పు చేసిన తాను, తనివితీరా నవ్వడానిక్కూడా అర్హురాలు కాదన్న భావం ఆమెలో పాతుకుపోయింది. అందుకే, కృత్రిమంగా నవ్వేందుకు అలవాటు పడింది. అందరూ కలిసి, టాక్సీలో యిల్లు చేరుకున్నారు.

*   *   *

శ్రీధర్స్ డిస్పెన్సరీ అనతికాలంలోనే ప్రజాదరణ పొందింది. శ్రీధర్, డాక్టరుగా చాలామంది విశ్వాసాన్ని, నమ్మకాన్ని పొందగలిగాడు. రెండు చేతులా సంపాదించుతున్నాడు. విశాఖపట్నం విడిచి వచ్చినందుకు, అతను విచారించాల్సిన అవసరం లేకపోయింది. అయితేనేం — అతని హృదయాంతరాళంలో ఎక్కడో బాధ కలుక్కుమంటూనే వుంది. చెల్లెలి జీవితం చక్కబడేవరకూ అతనిలోని ఆవేదన పూర్తిగా అంతమవ్వదు. అంతవరకూ అతను నిండుగా నవ్వలేడు. జీవితంలో తాను సుఖంగా వున్నాడన్న ఆనందాన్ని పొందలేడు. ఎలాగో రోజులు గడుపుతున్నాడు.

ఆ చుట్టుప్రక్కలవారికి శ్రీధర్ గురించి, అతని కుటుంబం గురించి తెలిసిన వివరాలు యేమిటంటే, శ్రీధర్‌కి వివాహమయ్యిందని, దురదృష్టవశాత్తూ, అతని భార్య ప్రసవంలోనే మగ పిల్లాణ్ణి కని. కళ్ళు మూసిందని, ఆ తరువాత శ్రీధర్ వివాహం చేసుకోలేదనీను. 'సీత' అవివాహితేనని, వాళ్లందరికీ తెలిసిన నిజం. శ్రీధర్ స్నేహితుడు, రామనాథంకి కూడా యివే వివరాలు తెలుసు.

సీత మాత్రం, విచిత్ర పరిస్థితుల్లో మసలుతోంది. అన్నయ్య కొడుకుని తాను సాకుతున్నట్టుగానే, అందరితోనూ చెబుతూ వస్తోంది. అలా చెప్ప వల్సి వస్తోన్నప్పుడంతా ఆమె హృదయం కుంచించుకుపోతోంది. కాని, యేం చేస్తుంది? చాలా అరుదుగా బైటికి వెళ్తోంది. సరదాల్ని చాలావరకు తగ్గించుకుంది. బండబారిన తన బతుక్కి యింక సరదాలేమిటన్న నిస్పృహ ఆమెను మరింత కృంగదీస్తోంది. ఎప్పుడు బైటికి వెళ్ళినా, తండ్రివెంట లేదా అన్నయ్యవెంట వెళ్తుంది. ఒంటరిగా వెళ్ళడం మానుకుంది. అసలు, యెక్కడికీ వెళ్ళడానికీ బుద్ధి పుట్టడంలేదామెకి. ఒక విధమైన నిస్తబ్దత ఆమె మనస్తత్వంలో యేర్పడినట్టయ్యింది. రాత్రుళ్ళు చంటివాణ్ణి ప్రక్కన వేసుకుని పాలిస్తూ పడుకున్నపుడు, ఆమెకి గతమంతా గుర్తుకొస్తోంది. అప్రయత్నంగా దుఃఖం వెల్లువలా పొంగుకొస్తుంది. జీవితం మీద విరక్తి కలుగుతుంది. అంతలోనే, తాను అన్నయ్యకి యిచ్చిన వాగ్దానం జ్ఞప్తికి వస్తుంది. గుండె దిటవు పర్చుకుని, తనని తాను ఓదార్చుకుంటుంది. తను యీ జీవితం యిలా యెన్నాళ్ళు గడుపుతుంది? తన యీ నిరీక్షణకి యెప్పటికయినా ఫలితం వుంటుందా? ఇంతకీ శ్రీనివాస్ మళ్ళీ తిరిగి వస్తాడా? మళ్ళీ అతను కనిపించకపోతే, తన బతుకంతా యిలా నిస్పృహ, నిరాశల మధ్య నలిగిపోవల్సిందేనా?... ఈ ఆలోచనలు, ఆమె మెదడులో రాకుండా వుండటంలేదు. ఏదో తెలీని బాధ, ఆవేదన, ఆరాటం, ఆమెని కలచివేస్తుంటయ్... మౌనంగా యేడుస్తుంది... అంతకుమించి, ఆమె చేయగలిగిందేమీ లేదుమరి!

12

కాలచక్రం తిరుగుతోంది. శ్రీధర్ డాక్టరుగా మంచి పేరు సంపాదించాడు. పేరుతోపాటు, పుష్కలంగా డబ్బుకూడా సంపాదిస్తున్నాడు. మనిషి అందగాడు, ఆత్మీయత గల సహృదయుడు, అర్థబలం వున్నవాడు... అలాంటి శ్రీధర్‌ని అల్లుడిగా చేసుకుంటే యెంత బావుణ్ణు...అనుకునే ఆడపిల్లలుగల తండ్రులు చాలామంది లోలోన అనుకోవడం ప్రారంభించారు. శ్రీధర్ మొదటి భార్య పోయిందని, అతనికో అబ్బాయి వున్నాడని తెలుసుకున్న తరువాత కూడా వాళ్ళ అభిలాష సమసిపోలేదంటే, ఆశ్చర్యం లేదు.

ఆరోజు శ్రీధర్స్ డిస్పెన్సరీకి సెలవు. సాయంత్రం, చెల్లెల్ని తీసుకుని సినిమాకి వెళ్లాలనుకున్నాడు, శ్రీధర్. సీత మాత్రం రానంది. ఆమెని నచ్చజెప్పి ప్రయాణానికి ఒప్పించడం, శ్రీధర్‌కి బ్రహ్మప్రయత్నమే అయ్యింది.

"వేగిరం తయారుకా చెల్లాయ్..." అన్నాడు, డ్రాయింగు రూమ్‌లోకి నడుస్తూ.

సీత, బట్టలు మార్చుకుందుకు తన గదిలోకి వెళ్లిపోయింది.

"ఏరా అబ్బాయ్, బైలు దేరుతోంది అమ్మాయ్ ?" అడిగాడు, రామరాజు యేదో పుస్తకం తిరగేస్తూ.

"ఎట్లాగో ఒప్పించాల్లెండి...ఏవిటో నాన్నా! చెల్లాయి రోజులు గడుస్తున్నకొద్దీ మరీ దిగులు పెంచుకుంటోంది." అన్నాడు, శ్రీధర్ బరువుగా నిట్టూరుస్తూ.

"అది సహజమేరా అబ్బాయ్. దాని ఆవేదన, మనకి అవగాహన కాదు. మనం వూహించుకోవాల్సిందే! జీవితాన్ని ఉల్లాసంగా, మూడు పువ్వులూ ఆరు కాయలుగా గడపాల్సిన యీ వయస్సులో, సీతకి మనోవేదన రాసిపెట్టిన భగవంతుడు చాలా నిర్దయుడు. అంతా దాని దురదృష్టం. ఎప్పుడు కాలం కలిసొస్తుందో, యేవిటో !" నీరసంగా అన్నాడు, రామరాజు.

బైట కారాగింది ... ఎవరా అని తండ్రీ కొడుకులు అటుకేసి చూశారు.

కారులోంచి, రంగనాథంగారు దిగటం చూసిన శ్రీధర్ లేచి నుంచున్నాడు.

"ఎవ్రరా ఆయన ?" అడిగాడు, రామరాజు.

"రంగనాథంగారని, యీ ప్రాంతాల్లోనే వుంటున్నారు. ఆయనకి రెండు సినీమాహాల్లు వున్నాయట. ఆమధ్య ఆయనకి ఒంట్లో బాగులేకపోతే, యిక్కడికొచ్చారు. నా ట్రీట్‌మెంటుతో ఆయన ఆరోగ్యం బాగుపడిన దగ్గర్నించీ, నేనంటే గురి. ఆయన్ని మీకు పరిచయం చెయ్యాలని ఎన్నో సార్లు అనుకున్నా! కాని, మీరు బైటికి వచ్చేవారు కాదు." అంటూ ముందుకు నడిచి,

"నమస్కారమండీ రంగనాథంగారూ! రండి ... రండి..." అంటూ సవినయంగా ఆహ్వానించాడు, శ్రీధర్.

రంగనాథం నిండుగా నవ్వేడు. లోపలికి వస్తూ, రామరాజుని చూడ్డంతోనే "నమస్కారం..." అన్నాడు.

"నమస్కారం ... కూచోండి..." అంటూ రామరాజు, తనకి అభిముఖంగా ఆసనాన్ని చూపాడు. రంగినాథం కూచున్నాడు.

"అన్నయ్యా, నేను రెడీ..." అంటూ చరచరా అక్కడికి వచ్చేసింది, సీత. ఆ కంగారులో, రంగనాథంగార్ని చూళ్లేదు. అతణ్ణి చూడగానే, నాలిక కర్చుకుంటూ, తుర్రున లోపలికి వెళ్లిపోయింది.

"మా చెల్లెలండీ !" రంగనాథం అడక్కుండానే చెప్పాడు శ్రీధర్.

"ఓ ! అలాగా ! ఎక్కడికో ప్రయాణం మీదున్నట్టున్నారు ... అర్జంటేమీ కాదుకదా ?" అన్నాడు, రంగనాథం.

ఇంటికి తగు పెద్దమనిషి వచ్చాక, సినీమాకి వెళ్లడం ఓ అర్జంటు వ్యవహారమని, అతనితో యెట్లా చెప్పగలడు, శ్రీధర్ ? అబద్ధం చెప్పడానికూడా మనస్కరించలేదతనికి.

"అబ్బే ! కాదులెండి..." ముక్తసరిగా అనేశాడు. "నాన్నగారూ, మీరూ మాట్లాడుతూ వుండండి. ఇప్పుడే వస్తాను." అంటూ లోపలికి నడిచాడు, శ్రీధర్.

రంగనాథం, రామరాజని వుద్దేశించి అన్నాడు. "మీ అబ్బాయి పేషెంటునండీ నేను. మీవాడి హస్తవాసి చాలా మంచిదండీ! అందుకేనేమో, అనతికాలంలోనే యెంతో పేరు సంపాదించాడు, డాక్టరుగా." అని.

రామరాజు మురిసిపోతూ మందహాసం చేశాడు.


"అదంతా మీవంటి పెద్దలు, సహృదయుల ఆశీర్వాద బలమే వాడి పురోగమనానికి దోహదం చేస్తోంది. తండ్రిగా, నేను కోరుకునేది మాత్రం యింకేముంటుంది చెప్పండి..." అన్నాడు.

శ్రీధర్, అప్పుడే లోపల్నించి వచ్చి కూచున్నాడు.

"ఇప్పుడు నేనెందుకొచ్చానో, వూహించారా?" రామరాజుకేసి మందహాసంతో చూశాడు, రంగనాథం.

"సాధ్యపడదండీ !" నవ్వేశాడు, రామరాజు.

"విషయం యేవిటంటే, మా అమ్మాయి బి. ఏ. వరకూ చదివిందండీ! దానికి యింకా చదువుమీద ధ్యాస లేక మానేసింది. నిజానికి అమ్మాయిని మెడిసిన్ చదివించాలనుకున్నాను. అబ్బే! మొదట్నుంచీ మెడిసిన్ చదవనని భీష్మించుక్కూచుని, ఆర్ట్సు తీసుకుంది. ఇంక చేసేదేవిటి ? కూతురు మెడిసిన్ చదవకపోయినా, మెడిసిన్ చదివిన అల్లుణ్ణి పొందాలన్న కోరిక బలపడింది. అయితే, నాకు నచ్చిన వ్యక్తి, యింతవరకూ నా దృష్టిలో పడలేదు. ఈ మధ్యనే మీ అబ్బాయిని చూడ్డం జరిగింది... అప్పట్నుంచీ, యీయన్ని నా అల్లుడిగా చేసుకోవాలన్న కోరిక నాలో ప్రబలింది. ఆ విషయమే మీతో సంప్రదించాలని వచ్చాను. మీరు మా అమ్మాయిని చూడవచ్చు. మీవాడు మా అమ్మాయిని నచ్చితేనే, మీ అంగీకారం తెలుపండి. మరో విషయం – మా అబ్బాయి ఇంజనీరుగా పని చేస్తున్నాడు యిక్కడే. వాడికి యేవేవో సంబంధాలొస్తున్నయ్. కాని, యింకా యేదీ నిశ్చయం కాలేదు. ఇప్పుడు మీ అమ్మాయిని చూశాను. ఆమెని చూశాక అనిపించింది, ఆమెనే మా ఇంటి కోడలుగా యెందుకు చేసుకోకూడదూ అని; మీరు అంగీకరిస్తే, యిదీ ఖాయం చేస్తాను." అన్నాడు, రంగనాథం.



రామరాజు మొహంలో రంగులు మారాయి. శ్రీధర్ కాస్త కంగారు పడ్డాడు. తండ్రీ కొడుకులు, పరస్పరం మొహాలు చూసుకున్నారు. వారికేం అర్థం కాలేదు, యేం చెప్పడమో! అటువంటి సమస్య, యెప్పుడో ఓసారి యెదురవుతుందని, వారికి తెలుసు. అందుకే చప్పున సంభాళించుకున్నారు. రామరాజు బలవంతంగా ఓ చిన్న చిరునవ్వు తెచ్చి పెట్టుకున్నాడు.

"మావాడిపట్ల మీకు యేర్పడిన అభిమానానికి, యెలా కృతజ్ఞత చెప్పాలో బోధపడ్డం లేదండీ! అయితే, ప్రస్తుత పరిస్థితులు కూడా మీతో విన్నవించుకోవాలికదా! మా శ్రీధర్‌కి రెండేళ్ళక్రితం వివాహ మయ్యింది. కాని, దురదృష్టవశాత్తూ, మా కోడలు బిడ్డని కని, ప్రసవ సమయంలోనే కళ్ళు మూసింది. ఆ బిడ్డని మా ఆవిడే సాకుతూవుంది. రెండో పెళ్లికి యెవరైనా ఒప్పుకుంటే, మా వాడికి పెళ్లి చెయ్యాలనే సంకల్పం వుంది. ఇప్పుడు మీరు ఆలోచించండి... మీ అమ్మాయితో సంప్రదించండి. మీవంటి వారితో వియ్యమందడం, నాకూ సంతోష కరమే!" అన్నాడు, రామరాజు.

రంగనాథం మొహం, కొద్దిగ వివర్ణ మయ్యింది. శ్రీధర్‌కి వివాహ మయ్యిందని, భార్య పోయిందని, గుర్తుగా ఓ అబ్బాయి వున్నాడని, ఆయనకి తెలీదు. అసలు, వూహించలేక పోయాడుకూడాను. అందుకే, ఆశ్చర్యపోయాడు. శ్రీధర్ తనకి అల్లుడు కాబోతున్నాడని, యెన్నో వూహల్ని పెంచుకుంటూ వచ్చాడు. కాని, ఆ వూహలన్నీ యెందుకు కొరగాని వైనందుకు, చింతించాడు. భార్యపోయి, ఒక అబ్బాయి వున్న వ్యక్తిని వివాహం చేసుకుందుకు తన కూతురు ఒప్పుకుంటుందన్న నమ్మకంలేదు. అయినా, అటువంటి విషయం అడగడానికే తను సాహసించకూడదుకూడాను ... అనుకున్నాడు.

"ఈ వివరాలన్నీ నాకు తెలీవండీ! శ్రీధర్ యింకా బ్రహ్మచారే అనుకున్నాను. అయామ్ సో సారీ..." అనేశాడు నీరసంగా.

అంతలో సీత, కాఫీలు తెచ్చి అందరికీ అందించింది. మళ్లీ లోపలికి వెళ్లిపోయింది.

"మరి, మీ అమ్మాయి సంగతి? ఆమెని నా కోడలిగా చేసుకుంటాను. మనకి బంధుత్వం ఏర్పడాలని నా కాంక్ష." మళ్లీ అన్నాడు, రంగనాథం.

రామరాజు, కంగారుపడలేదు. ఆ ప్రశ్నకి జవాబు సిద్ధంచేసుకునే వుంచాడు.

"మా అబ్బాయికి యేదేనా సంబంధం కుదిరే వరకూ, అమ్మాయి పెళ్లి ప్రస్తావనే లేదండీ!" అనేశాడు. అబద్ధం చెబుతున్నందుకు, అతని మనస్సు చివుక్కుమంది. కాని, తప్పదుమరి!

లోపలి గదిలోంచి, ఆ మాటలు విన్న సీతకి ఏడుపొచ్చింది. తనకోసం అటు అన్నయ్య, యిటు తండ్రి, యెంత కృత్రిమమైన జీవితానికి అలవడ్డారు? ఎన్ని అబద్ధాలు—? ఎన్ని సాకులు...? భగవాన్! ఎందుకీ పరీక్ష? ఏమిటీ శిక్ష? నా తప్పుకి వాళ్లు శిక్ష అనుభవిస్తుంటే. చూస్తూ వూరుకోవడమేనా నేను చెయ్యగలిగింది? ఈ జీవితాన్ని అంతం చేసుకోవాలనుకున్నా, అన్నయ్యకి

చిగురించిన జీవితం

చేసిన వాగ్దానం అడ్డొస్తోంది. ఇలా యెన్నాళ్ళు గడపడం? ... అనుకుంటుంటే, ఆమె కళ్లనించి అశ్రువులు బొటబొట క్రిందికి రాలినయ్. కళ్లొత్తుకుంది.

"మరి, వెళ్లొస్తాసండీ!" అంటూ రంగనాథం బైలుదేరాడు.

"అప్పుడప్పుడూ వస్తూ వుండండి..." అన్నాడు. రామరాజు, అతని వెంటే నడుస్తూ.

"మీరూ రండోసారి మా యింటికి..." అంటూ కార్లో కూచుని "వస్తాను డాక్టరు గారూ!" అన్నాడు రంగనాథం.

"మంచిదండీ!" నమస్కరిస్తూ సవినయంగా అన్నాడు, శ్రీధర్.

కారు కదిలింది, బుర్రుమంటూ. రామరాజు, శ్రీధర్ పరస్పరం మొహాలు చూసుకున్నారు. వారిలో ఒక విధమైన నిర్లిప్తభావం యేర్పడింది. లోపలికి నడిచారు.

వారికి, లోపలి ద్వారం దగ్గర, సీత వుదాసీనతతో అగుపించింది. ఆమె బాధపడుతున్నట్టు అర్థం చేసుకున్నారు. "ఇప్పుడు సినిమాకి వేళ మించి పోయింది చెల్లాయ్... అలా తిరిగివద్దాం పద..." అన్నాడు, శ్రీధర్.

సీత, బరువుగా ఓ నిశ్వాసం వదిలింది. "అన్నయ్యా! నీ మంచితనంతో, నీ బ్రతుకులో చీకటి సృష్టించుకుంటున్నావు..." అంది రుద్ధ స్వరంతో.

శ్రీధర్ మెల్లగా మందహాసం చేశాడు. "పొరబడుతున్నావు చెల్లాయ్. నా జీవితం యెప్పుడూ చీకటిమయం కాదు. ఆ విశ్వాసం, నమ్మకం, నాలో వున్నాయి. నా గురించి నువ్వేం బాధపడకమ్మా! పద... అలా తిరిగివద్దాం..."

"ఇప్పుడు నే నెక్కడికీ రానన్నయ్యా! మరో రోజు వెళ్దాంలే..." అంటూ ఖాళీ కప్పులు తీసుకుని, లోపలికి వెళ్ళిపోయింది సీత.

సీత మొహంలో విషాదచ్ఛాయలు ముసురుకుని వుండటం. ఆ తండ్రీ కొడుకులు గమనించారు. ఇరువురూ ఒకేసారి నిట్టూర్చారు.

"నేనలా బైటికి వెళ్ళొస్తాన్నాన్నా!" నిష్క్రమించాడు, శ్రీధర్.

రామరాజు సోఫాలో కూలబడ్డాడు. యశోదమ్మ లోపల్నించి వచ్చి అతని ప్రక్కనే కూచుంది.

"అంతా విన్నానండీ! ఏం చేస్తాం...?" నిస్పృహతో అంది.

రామరాజు యేమీ మాట్లాడలేదు. అతను యేదో ఆలోచిస్తున్నాడు. దూరంలో రేడియోనించి, విషాదగీతం వినిపిస్తోంది.

13

ఒక్కొక్కప్పుడు, మనం వూహించని సంఘటనలు, మనకి తెలీకుండానే హఠాత్తుగ సంభవిస్తూ వుంటాయి. వాటినే మనం విధినిర్ణయంగా నమ్ముతూ వుంటాం.

ఒక రోజు శ్రీధర్ ఓ పేషెంటుని చూడ్డానికి వెళ్తూవుంటే, బాటా షాపులోంచి బైటికొస్తున్న శ్రీనివాస్‌ని చూసి,తనకళ్ళనుతానే నమ్మలేకపోయాడు. స్కూటరు సడన్‌గా ఆపి, అతను శ్రీనివాస్ అవునా కాదా అని పరిశీలనగా చూశాడు. అతడు ముమ్మూర్తులా శ్రీనివాసే. సందేహంలేదు. అతని ప్రక్కనే మెరుపుతీగలాంటి ఓ అమ్మాయి మాట్లాడుతూ కనిపించింది. శ్రీధర్‌కి హృదయస్పందన అధికమయ్యింది. ఆమె ఎవరై వుంటుంది? శ్రీనివాస్ భార్యా? అతనిలో ఆరాటం పతాకస్థాయి నందుకుంది. ఇప్పుడేం చెయ్యడం? ... అన్న ఆలోచనలో పడేసరికి, శ్రీనివాస్ ఓ ఆటోరిక్షాను కేకవెయ్యడం గమనించాడు. ఆ యువతి అందులోకిపోయి కూచుంది. శ్రీనివాస్ 'టాటా' చెప్పి వెనక్కి తిరిగాడు. ఆటోరిక్షా కదిలింది. శ్రీధర్ మనస్సులోని ఆరాటం మాత్రం తగ్గలేదు.

అతని మెదడులో ఏవేవో ఆలోచనలు, ఒక నిర్దిష్టమైన నిర్ణయానికి రానివ్వలేదు. శ్రీనివాస్‌ని కలియడమా? కలిసి, అతణ్ణి తమ యింటికి తీసుకుపోవడమా? లేక, ఆటోరిక్షాలో వెళ్తోన్న ఆ యువతిని కలుసుకుని, వివరాలు తెలుసుకోవడమా? ... అన్న సందిగ్ధంలో పడ్డాడు. ప్రస్తుతం శ్రీనివాస్‌ని కలుసుకోవడంకంటె, ఆ యువతిని కలుసుకోవడమే శ్రేయస్కరంగా తోచింది. స్కూటర్ని ఆటోరిక్షా వెంట నడిపించాడు. శ్రీనివాస్ తనని చూడకుండా జాగ్రత్తపడ్డాడు ముందే. ఓ క్రాసింగు దగ్గర ఆటోరిక్షా ఆగింది. శ్రీధర్ తన స్కూటర్ని ఆటోరిక్షా ప్రక్కనే ఆపి,

"ఎక్స్క్యూజ్‌మి మేడమ్. మీకు అభ్యంతరం లేకపోతే, మీతో రెండునిమిషాలు మాట్లాడాలి..." అన్నాడు ఆమె నుద్దేశించి. ఆమె తెలుగు యువతి ఔనో కాదో అతనికి ఖచ్చితంగా తెలీకపోయినా, కట్టూ బొట్టూ చూసి, తెలుగువాళ్లే అయ్యుంటారన్న ధీమాతో అడిగాడు.

ఆమె ఆశ్చర్యంగా, కనుబొమలు ముడుచుకుపోగా, అతనికేసి చూసింది. అతని మొహం చూస్తే, రోడ్డుసైడురోమియో కాదన్న నమ్మకం ఏర్పడిందామెకి.


"నాతోనా?" అంది, కళ్లు చికిలిస్తూ.

"ఔనండీ! మీతో చాలా ముఖ్యవిషయం మాట్లాడాలి. ఆటోరిక్షాకి బాడుగ యిచ్చేయండి. మళ్లీ మరో టాక్సీ పిలుద్దాం. ఇందులో యేదో మోసం వుందని మీరు కంగారుపడొద్దు. నేను డాక్టర్ని. మీనుండి నాకు అవసరమయ్యే కొన్ని వివరాలు కావాలి. ప్లీజ్..." ప్రాధేయపూర్వకంగానే అన్నాడు. అతని అవసరంమరి!

శ్రీధర్ పట్ల, ఆమెకి అపనమ్మకం కలగలేదు. అతనికి సహకరించాలనిపించింది. ఆటోరిక్షా బాడుగ యిచ్చేసి, దిగింది. థాంక్స్ చెప్పుకున్నాడు శ్రీధర్.

[ఇంకా వుంది]

మానవుడికి ఆశలు రంగుటద్దాలు
అనుభవాలే యదార్థాలు





ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్

చదువు-సంస్కారం

ఈస్ట్‌మన్ కలర్

నిర్మాత
కె.రాఘవ

కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం
రాజశ్రీ

సంగీతం రమేష్‌నాయుడు కెమెరా మధుసూదన్ ఎడిటింగ్ బాలు ఆర్ట్ సి.హెచ్.ఇ.ప్రసాద్‌రావు

[illegible] తారకరామ [illegible] నవభారత్ [illegible] శ్రీతారకరామ

THARAKARAMA

డాక్టర్ సలహాలు

కె. ఎఫ్ – నెల్లూరు.

'లివరు' అంటే కాన్సర్‌కు సంబంధించిన జబ్బా లేక వేరే దేనికైనా సంబంధించినదా ?

'లివరు' అన్న పదం—కాలేయము అనే శరీర భాగాన్ని మాత్రమే సూచిస్తుంది. అయితే వ్యవహారికంగా 'లివరు' అనేదాన్ని, ఈ కాలేయము పెద్దది అయినప్పుడు అందరూ ఉపయోగించే పదంఅయింది.

లివరు వాయటం—లేక పెద్దదవటం చాలా కారణాలవల్ల జరుగుతుంది. 'సిర్రోసిస్' (లివరులోని వివిధభాగాలు కృశించి పోవటం) కామెర్లు, అమీబియాసిస్, అనేవి కొన్ని కారణాలు మాత్రమే. సాధారణంగా వాడబడే 'లివరు'కి, కాన్సర్‌కి సంబంధము లేదు. కాన్సర్‌వల్ల 'లివరు' పెద్దదవటం జరుగవచ్చును.

పి. ఎస్. కె.– మచిలీపట్నం.

నా చెవులలో చిన్న చిన్న కురుపులు ఉన్నాయి. మెల్లగా మాట్లాడితే వినబడదు. . .

ఇ. ఎన్. టి. వైద్యులు పరీక్ష చేసి చెవులలో ఏదైనా రోగం ఉన్నదా అని నిర్ణయిస్తారు. చెవులలో చీము ఏర్పడటం వల్ల కొందరికి చిన్న వయసులోనే ఇలా జరుగవచ్చును. వెంటనే చికిత్స చేయించుకోవటం అవసరం. కొన్ని సం.లు అశ్రద్ధ చేస్తే చెవుడు, నిరంతరంగా ఏర్పడగల ప్రమాదం ఉన్నది.

ఎ. – ర్యాలి.

నా కాలి పుండులో నుంచి రెండు సార్లు పురుగులు వచ్చినవి. కాలు అన్ని నడువలేకపోతున్నాను . . . చాలా మందులు వాడాను.

కాళ్లలో ఏర్పడిన పుండ్ల ద్వారా తెల్లని పొడుగాటి పురుగు రావటాన్ని 'గినీ వర్మ్' అని వ్యవహరిస్తారు. ఇది పురుగుల గ్రుడ్లతో కలుషితమైన నీరు శరీరంలో ప్రవేశించటం ద్వారా ఏర్పడుతుంది. ఈ క్రిమి— నీటిలో కాళ్లు ముంచినప్పుడు (తడి తగిలినప్పుడు) బయటికి వస్తుంది. దీనిని మెల్లగా అగ్గిపుల్లతో చుట్టి, కొద్ది కొద్దిగా బయటకు తీయటానికి కొన్ని రోజులు పట్టవచ్చును. ఈలోగా మీకు దగ్గరలో ఉన్న వైద్యులకు తెలియజేస్తే మీకు సహాయం చేస్తారు.

ఎ. ఆర్. ఎస్–బాపట్ల.

'వెయిట్ లిఫ్టింగ్' వల్ల మనిషి పెరగడంటారు. ఎంతవరకు నిజం?

ఏ రకం వ్యాయామమయినా శరీరంలోని కండరాల అభివృద్ధికి తోడ్పడుతుంది. పోతే ఈ వెయిట్ లిఫ్టింగ్ చేతులు, రొమ్ములలోని కండరాలు మొదలైనవి బాగా పెరగటానికి అవకాశం ఎక్కువ. అలాగే నడుములో ఉన్న కండరాలను కూడా ఈ రకం వ్యాయామం పుష్టి కలిగించగలదు.

కానీ, ఏ వ్యాయామము అయినా, క్రమంగా, విడవకుండా చేయగలిగినప్పుడే— ఆశించిన ఫలితం లభిస్తుంది.

ఎమ్. వి. పి.పి. – పుయ్యూరు

నాకు ఎక్కువగా చదివినప్పుడు తలనొప్పి విపరీతముగా వచ్చుచున్నది. దీనికి కారణమేమిటి ?

చదువుతుండగా, ఎక్కువ సమయాలలో, జరుగుతూ వుంటే కళ్లకు—మంచి నేత్ర వైద్యుల చేత పరీక్ష చేయించుకోవాల్సి వుంటుంది.

నేత్ర వైద్యులు— కంటిలో ఏ దోషమూ లేదని చెప్పిన తరువాత, "న్యూరాలజిస్ట్" (నరములకు సంబంధించిన రోగాల చికిత్స నిపుణులు) వద్ద పరీక్షించుకోవాలి.

అంతకుముందే— అనవసరంగా మాత్రలు— తలనెప్పికి—వాడటం మంచిదికాదు. అంతకుమించి చేయగలిగిందేమీ లేదు.

ఎస్. ఉ. – వరంగల్

2 నెలల క్రితం కంటిలో "గరగర" లాడుతూ ఉంటే 'టెర్రామైసిన్' ఆయింట్‌మెంట్ వాడాను. తగ్గక పోతే హాస్పిటల్‌లో 'ఫ్లోరోసిన్' వేశారు. ఇప్పుడు కంటి పాపకు ఆనుకొని అస్పష్టమైన తెల్లని మచ్చ ఏర్పడింది. కన్ను చూపులో కూడా కొంత భేదము ఉన్నది. ఈ మచ్చ పోవాలంటే ఏమి చెయ్యాలి?

మీరు వ్రాసిన లక్షణాలను పరిశీలిస్తే మీకు ఏర్పడిన రోగం, 'ట్రకోమా' అనే అంటు వ్యాధివల్ల ఏర్పడి ఉంటుందని తోస్తున్నది. ఈ రోగం-ఒక వైరస్ వల్ల ఏర్పడుతుంది. వ్యక్తిగత పరిశుభ్రత లోపించినప్పుడు ఇలా జరుగుతుంది.

రోగము యొక్క మూడవ దశలో కనుపాప ముందు వున్న 'కార్నియా'లో తెల్లని మచ్చ ఏర్పడుతుంది.

దృష్టి లోపానికి కంటికి సులోచనాలు వాడాలి.

అతి రహస్యం ... ...

తమ రహస్యాలు తెల్సుకోడానికి ఏమైనా ఎలక్ట్రానిక్ పరికరాలు అమర్చారేమో తెలుసుకోడానికి వీలుగా అమెరికాలో అనేక కొత్త సాధనాలు తయారవుతున్నాయి. ఒకదాని పేరు 'యాంటి–స్పైన్'. టెలిఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు ఆ సంభాషణ యింకో చోటెక్కడైనా రికార్డు అవుతూంటే ఈ సాధనంనుంచి సిగ్నల్స్ వెలువడుతాయట.

'మరొక సాధనం' ఆ సంభాషణని టేపు మీద రికార్డు అవకుండా చేస్తుందట. ఇంకో పరికరం వుందట. అది టెలిఫోన్ లలో మైక్రోఫోన్లు ఏమయినా ఉన్నాయేమో కనిపెడుతుంది. ఈ పరికరాల ఖరీదు చాలా ఎక్కువ కనుక యివి అద్దెకుకూడా దొరుకుతాయి. గంటకి 50 డాలర్లు. అమెరికాలో ప్రస్తుతం వీటికున్న గిరాకీ మరేవాటికీ లేదట.

అసహ్యంగా కనపడుతూ వుంటే వైద్యులు కను పాప రంగుకల మందుతో ''లూటూయింగ్''చేస్తారు.

టి. ఎస్. జె. కడప

నేను 6 నెలలుగా అరికాళ్ల మంటతో అవస్థ పడుతున్నాను. తెల్లవార్లూ నిద్ర ఉండటం లేదు. రాత్రి పడుకున్న తర్వాత మంట మొదలవుతుంది. ఈ మంటలు ఎందుకు వస్తాయి. పోగొట్టాలంటే ఏ మందులు వాడాలి ?

కొంత వయస్సు వచ్చిన తర్వాత, రక్తపుపోటు మూత్రపరీక్ష (చక్కెర వ్యాధికి) చేయించుకోవటం చాలా అవసరం. 3 నెలల కొకసారి అయినా ఇవి చేయించుకోవటం అవసరం. డయాబెటిస్, నరముల బలహీనత (పాలీన్యూరైటిస్) వల్ల ఇలా రావచ్చును. రోగ నిర్ధారణ చాలా ముఖ్యం.

డా. కె. వెంకటేశ్వరరావు

రోహిణికార్తె ఎండలకు నిజంగానే రాళ్ళు పగులుతున్నాయి. చెట్లమీది పక్షులన్నీ బెదిరిపోయినట్లు నోళ్ళు తెరుచుకొని, గుడ్లు మిటకరించి నాలుగు వైపుల చూస్తున్నాయి. దూరంగా వేపచెట్లు క్రింద చిల్లులు పడిన గిన్నెలకు మాట్లు వేస్తున్న కరీం సాయిబు, కొలిమితిత్తి కొట్టకుండా దిక్కులు చూస్తున్న ఎనిమిదేళ్ల కొడుకును చివాట్లు వేస్తూ తన పని తాను చేసుకు పోతున్నాడు.

శింగన పాలెం గ్రామం చుట్టూ తోటలు, గ్రామంలోనే పెద్ద పెద్ద చెట్లు వున్నాకాని సూర్యుడి ప్రభావం మాత్రం ఆ గ్రామం మీద ఏ మాత్రం తగ్గలేదు. వయస్సు మళ్లిన వాళ్లంతా కలోగంజో తాగి కడుపు నింపుకొని ఇళ్ల వసారాల్లో నులక మంచాల మీద పడుకొని ఇప్పటి ఎండల తీవ్రత గురించి, తాము చూసిన ఇదివరకటి వేసవి కాలాల తాలూకు మండు టెండల గురించి ప్రక్కవాళ్లతో కబుర్లు చెబుతూ నిట్టూరుస్తున్నారు.

"ఏంది మాఃవాః తీరిగ్గా కూసుండావు—పట్నం ఎల్లలేదా ?" అప్పుడే నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని వచ్చి, పైగుడ్డతో ముఖానికి పట్టిన చెమటను తుడుచుకొని పంచ అరుగుమీద కూర్చుంటూ అడిగాడు శివయ్య.

"లేదురా—ఎల్లలేదు" చుట్ట చుట్టుకోడానికి పొగాకు కాడను తీసి సరి చేస్తూ అన్నాడు భూషయ్య.

"అవునులే—ఎండలిట్టా మండిస్తావుంటే ఎవరు మాత్రం గడపదాటి బయటకెల్తున్నారు ? ఎండాకాలం వొస్తే మన పంచాయతి రాజకీయాలక్కూడా శలవులేగావాల—



"ఇస్కూలు మాదిరి" శివయ్య మాటలు చురుక్కున తగిలాయి భూషయ్యకు.

భూషయ్య పెద్ద ఆస్తిపరుడే కాని, వ్యవసాయం అంటే అతనికి మహావిరాకు. అందుకే అతను ఎప్పుడూ పంచె పైకి ఎగకట్టి గట్టు దిగి పొలంలో అడుగుపెట్టడు. అందుకే అతనికి వ్యవసాయంగురించి ఏమాత్రం తెలియదని, కాబట్టే రాజకీయాల్లోకిదిగి తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మినిచేసి నెట్టుకొస్తున్నాడని ఆ వూళ్ళో శివయ్యలాంటివాళ్లు చాలామంది అంటుంటారు. దానికితోడు భూషయ్య నెలకు ఇరవై రోజులదాకా రాజకీయాల్లో మునిగితేలుతూ ప్రక్కనేఉన్న బస్తీలో గడుపుతుంటాడు. భూషయ్య ఎప్పుడన్నా గ్రామంలో కనపడినా, తీరుబాటుగా ఉన్నట్లు కన్పించినా శివయ్య అతనిని ఆటలు పట్టిస్తూంటాడు. ఊళ్లోని పెద్ద మోతుబరిరైతుల్లో ఒకడైన శివయ్య ఎన్నివిసుర్లు విసిరినా వాటిని చిరునవ్వుతో కొట్టేస్తుంటాడు భూషయ్య.

"నీకేం తెలుసురా రాజకీయాలగురించి—దిగితేకాని లోతు తెలీదు" చుట్ట వెలిగించి అన్నాడు భూషయ్య.

"నిజమేఁ మావాఁ — రాజకీయాల్లో లోతులు నీకెంతమాత్తరం తెలుసునోకాని, ఇయ్యాల అంకమ్మగుడిదగ్గర మంచినీళ్ళబావి ఎంతలోతుందో నేను చూశాను."

భూషయ్య శివయ్యవైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఏందయ్యా అట్టా చూస్తావ్? సిత్త కార్తిలో పడిన సినుకులెకాని మళ్ళీ వొర్సమే లేదాయె. అంకమ్మగుడి బావిలో తప్ప, వూళ్ళోని మిగిలిన బావులన్నింటితోనూ బురదలు దోర్సుకుంటున్నారు. గుడిబావి కూడా అంతంత మాత్తరంగా ఉంటే, ఇయ్యాల పూడిక తీశారు. ఈ ఎండాకాలాం ఎట్టా గడుస్తదో ఏమో?" — శివయ్య మాటలకు భూషయ్య బదులుపలకలేదు. నోట్లో చుట్టతీసి తుపుక్కున ఉమ్మేసి నిట్టూర్చాడు.

"ఇది ఇన్నావంటారా — మాదిగోళ్ళ పాలెంలో కొత్తగా తవ్వించిన బావి పూర్తిగా ఎండిపోవచ్చిందంట. ఆళ్ళ పాతబావి సంవత్సరాది పండక్కే ఎండిపోయింది. ఏదవలు సత్తన్నారంట బురదలు తాగలేక." శివయ్య మాటలువిని బయటకు వచ్చిన భూషయ్యభార్య చంద్రమ్మ అంది.

"ఆళ్ళుకంతే కావాల్లే అప్పా! లేకపోతే ఏదవనాయాళ్లు మానూళ్ళ సమయానికి కూలిరేట్లు పెంచేసి ఏడిపిస్తారా? ?—" శివయ్య కసిగాఅన్నాడు.

"ఆళ్ళు మరీ నెత్తినెక్కి కూర్చుంటున్నార్రా— పెబుత్వంకూడా ఆళ్లపక్కనే సేరి ఆళ్ళకు ఇళ్లు వాకిళ్లు కట్టించి, బావులు తవ్వించి, బంజర్లకు పట్టాలు ఇస్తా వుండె. ఇంక ఆళ్లకు కళ్లు కనపడుతున్నాయా?"

"అట్టా అనకూడదులే అప్పా! రేపు ఎలచ్చన్లలో ఆళ్ల ఓట్లే మనకు దిక్కు." శివయ్య ఓరకంట భూషయ్యను చూస్తూ అన్నాడు.

భూషయ్య విసురుగా చుట్టతీసి, ఉమ్మేసి, "ఏడిశారు— ఆ సన్నాసులు ఓట్లెయ్యకపోతే మనం గెలవలేమా? పచ్చనోట్లకు, కల్లు ముంతలకు కళ్లు బైర్లు కమ్మి ఓట్లేసే నాయాళ్ళకు పెద్దపట్టం కడుతున్నారు ఆ పైవోళ్లు"- అన్నాడు కర్కశంగా.

"అదేందయ్యా అట్టాఅంటావ్? ఆళ్లకు బంజర్లు పట్టాలు ఇయ్యడానికి మంతిరొచ్చినప్పుడు నువ్వేగా—ఆళ్ళంతా పైకిరావాలని ఉపన్యాసాలు దంచింది—"

శివయ్యమాటలకు భూషయ్యకు చిర్రెత్తుకొచ్చింది.

"ఒరేయ్ శివాయ్! నీకు రాజకీయాలు తెలీవుగాని ఊరుకో—ఎప్పుడెట్టా మాట్టాడాలో అట్టా మాట్టాడి పబ్బం గడుపుకోవాలి—" అంతకుమించి ఎంతచెప్పినా, ఏమిచెప్పినా శివయ్యకు అర్థం కాదని భూషయ్య మౌనం వహించాడు.

ఇంతలో దూరంగా వేపచెట్లక్రింద గిన్నెలకు మాట్లు వేస్తున్న కరీంసాయిబు గొంతు బిగ్గరగా, ఆందోళనగా విన్పించింది.

"అయ్యో! ఎట్టాగరా పుల్లిగా! సాయిబులబావికూడా నిన్నటినుంచి ఎండిపోయింది. ఇంకా భగమంతుడే కాపాడాల—" కరీంసాయిబు మాటలు పూర్తయ్యీ, కాకుండానే ఏదో గందరగోళం విన్పించింది.

"ఏందిరా శివయ్యా-ఆ గంద్రగోళం?" భూషయ్య మాటలు ఇంకా పూర్తి కాకుండానే మునసబు, మోతుబరి రైతులు శేషన్న, వెంకటయ్య, నారయ్య, పిచ్చయ్య, కరణం అంతా హడావుడిగా భూషయ్య ఇంటి లోగిట్లోకి వచ్చారు. ఊరి పెద్దలందరు ఒక్కసారిగా కట్టకట్టుకొని రావడం చూసి ఆశ్చర్యపోతూ, "ఒరేయ్ పోలిగా! కుర్చీలు తేరా పెద్దోళ్లంతా వొచ్చారు" అని పాలేరును కేకవేశాడు భూషయ్య.

నాపేరు జ్యోతి

— కృష్ణప్రియ

పూజించగ ప్రతిఒక్కరు
వెలిగింతురు నా తనువును
మదినిండిన కోరికతో
దేవునిపై ధ్యానముంచి;
తృప్తిదీర దర్శించి
భక్తిమీర తలుతురు
పెనుగాలికి అల్లాడెదు
నను తలపంగ నేరరు!
నన్ను నేను దహియించి
నలుదెసల వెలుగునింపి
అంధకార మందిరమున
మలిగిపోదు నెప్పుడో!

భూషయ్య భార్య లోపలికి వెళ్లిపోయింది. పోలిగాడు పంచ అరుగుల మీద అందరికి కుర్చీలు వేశాడు.

"ఏందయ్యా — అంతా ఆదరాబాదరాగా వొచ్చారు కొంపలు మునిగిపోయినట్లు" అని నవ్వాడు భూషయ్య.

"కొంపలు మునిగినట్లని ఇంకా నెమ్మదిగా అంటావేంది భూషయ్యమావాఁ — నిజంగానే మునిగాయి. నీకేం కడుపులో సల్ల కదలకుండా కూసుంటావు లేకపోతే రాజకీయాలు నడపడానికి పట్నం పోతావు. ఊళ్లో ఇసయాలు నీకేమయినా పట్టినయ్యా" — మునసబు నిష్ఠూరంగా అన్నాడు.

"ఇంతకీ అసలు ఇసయం ఏంది మునసబూ"-భూషయ్య కరమీసాన్ని సన్నగా దువ్వి మెల్లిగా నవ్వాడు.

"ఆ ఇసయం అంట సెప్పండయ్యా" అసహనంగా అందరివైపు చూసి అన్నాడు మునసబు.

"ఏంలేదు భూషయ్యా! మన గ్రామంలో మొత్తం మూడు మంచినీళ్ల బావులు వున్నాయిగదా! అందులో సాయిబుల బావి నిన్నటి నుంచి పూర్తిగా ఎండిపోయింది. ఇయ్యాల మాదిగపాలెం బావి ఎండిపోయింది. ఇంక మనం నీళ్లు తెచుకొనే అంకమ్మ గుడి బావి ఒక్కటే ఇప్పుడు అందరికి ఆధారమైపోయింది. ఇప్పుడు మాదిగపాలెం అంతా

దాహం

గుక్క తడుపుకోను నీళ్ళబొట్టు లేక కటకట లాడి పోతున్నారు. మన గుడిబావి నుంచి నీళ్ళు ఇప్పించమని అడగడానికి మాదిగపాలెం వాళ్ళంతా కట్టకట్టుకొని వస్తున్నారని తెలిసి నీకు చెబ్దామని ఇట్టా వచ్చాం'' శేషన్న పూర్తిచేసి అందరివైపు చూశాడు.

''ఆ ఎదవ నాయాళ్ళు నీళ్ళు లేకుండా అరసకలాడి సచ్చినా మేలేగాని గుడిబావి నుంచి ఆళ్ళకి ఒక్క సుక్క కూడా ఇయ్యడానికి ఈల్లేదు''శేషన్నమాటలు పూర్తి కావటంతోనే పిచ్చయ్య అరిచినంత పనిచేశాడు.

''బాగా సెప్పావు సిన్నాయనా! మొన్నటికి మొన్న మాసూళ్ళల్లో ఆళ్ళెంత ఏడిపించారు మనల్ని?– తెల్లారి లేస్తే గంజినీళ్ళకు గతి లేక కాళ్ళమీదపడే ఈ నాయాళ్ళు పొరుగూరి వాళ్ళతో సమంగా కూలి ఇస్తేకాని పొలంలో అడుగు పెట్టమని మొరాయించలేదూ? సివరకు ఎంత ఖర్చుసేసి పొరుగూళ్ళ నుంచి కూలోళ్ళను తెప్పించాం? ఇయ్యాల బావిఎండి పోబట్టిగాని లేకపోతే ఆళ్ళకు మనం కనబడుతున్నామా?''నారయ్యకసిగా అన్నాడు.

''బంజర్లకు పట్టాలు వచ్చిన కాడ్నించి ఆళ్ళకు పట్టపగ్గాల్లేకుండా పోయాయి ఆళ్ళ దగ్గర ఎరువుందా? ఎద్దులున్నాయా? ఏం పెట్టి ఎవసాయం చేస్తారని ఇచ్చారయ్యా పట్టాలు?'' బంజరుభూములు తనకు దక్కలేదన్న అక్కసుతో అరిచాడు వెంకటయ్య. పట్టాలు ఇవ్వడానికి భూషయ్యే కారణం అన్నట్లు అతని వైపు సూటిగా, ఎర్రగా చూశాడు వెంకటయ్య.

''నన్నేం సెయ్యమంటావన్నా– పెదాన మంతిరి కాడ్నించి పంచాయతి నెంబరుదాకా అంతా హరిజనులు ముందుకు రావాలంటూ అరుస్తావుండె. నన్నొక్కడ్ని ఏం సెయ్యమంటావ్? ఇప్పుడైనా పోయిందేముంది? ఆళ్ళ సేద్యానికి మనమేగా అప్పు పెట్టాల్సింది– అందుకు ఆపంట రాబట్టుకొంటే సరిపోలా? కష్టంలేకుండా ఇంటి ముందుకు గింజలు వస్తాయి''–భూషయ్య అన్నాడు.

''అదంతాసరే–ఇప్పుడు ఆళ్ళు బావి మీదకు వస్తున్నారు–ఏం చెబుదాం?''శేషన్న ప్రశ్నించాడు.

''ఆఁ అది తేల్చండి ముందు''కరణం రెట్టించాడు.

''ఆళ బావికి పూడికతీసే నీళ్ళురావా?'' భూషయ్య సాలోచనగా అన్నాడు.

''ఇంక ఆళ్ళ బావిలో గడ్డపలుగేస్తే మొత్తం కూలిపోద్ది. అంతలోతు తవ్వారు ఆ బావిని ఇప్పటికే'' పిచ్చయ్య అన్నాడు.

''మరి సాయిబులెట్టా గడుపుకుంటున్నారు?''భూషయ్య అడిగాడు.

''రెండిళ్ళేకదా సాయిబులవి. ఒక్క కరీం సాయిబు, ఆడికొడుకు తప్ప, మిగిలిన వాళ్ళందరూ పట్నం పోయారు ఆళ్ళిద్దరూ కూడా సాయంత్రం బస్సుకు పోతారంట''నారయ్య అన్నాడు.

ఇంతలో వీధిలో కోలాహలం విన్పించేసరికి అంతా అటువేపు చూశారు. మాదిగపాలెం పెద్దపుల్లిగాడు ముందునడుస్తూండగా అతని వెనక మొత్తం పాలెం అంతానడిచి భూషయ్య ఇంటికి అల్లంత దూరంలో ఆగింది.

''అయ్యా! ఇయ్యాల్టితో మా పాలెంలో మంచినీళ్ళ బావి ఎండిపోయిందయ్యా. పిల్లా, మేకా గొంతు తడుపుకోను కూడా లేకుండా అవస్థపడుతున్నారు. అంకమ్మగుడి బావి నుంచి నీళ్ళు ఇప్పించండయ్యా?'' పుల్లిగాడు వీధిలోనే చతికిలబడి కూర్చుని చేతులు జోడించి దీనంగా అర్థించాడు.

కొద్దిక్షణాలు గ్రామపెద్దల్లో ఎవరూ మాట్లాడలేదు. చివరకు మునసబు కోపంగా అరిచాడు.

''నాయాళ్ళి ఇయ్యాల కన్పించామంటా మేము మీకు? మా సూళ్ళల్లో మమ్మల్ని మూడు చెరువుల నీళ్ళు తాగించిన్నాడు మేమంతా మీ కంటికి పురుగుల్లా కన్పించాం కదూ?''–

''ఆయేల న్యాయంగా అందరితోపాటు సమంగా కూలిగింజలు ఇప్పించమని అడిగాం కాని ఇంకేమన్నాం?'' పట్నంలో పెద్ద చెప్పుల కంపెనీలో ఉద్యోగం చేస్తూ శెలవుమీదవచ్చిన కొండడు అన్నాడు.

''ఇంకాకూడా ఏమైనా అంటావ్రా– అనరూమరి?– పొలిమేరలుదాటి పట్నంపోయి నేర్చుకొచ్చిన తెలివితేటలు అన్నీ అవేగా.'' –శేషన్నమొహం కందగడ్డలాతయారైంది.

''దొరా! అట్టా కోపగించుకోకండి. ఆడు మాత్తరం ఏమన్నాడు. నాయంగా కూలి ఇమ్మని అడిగాం కదా అనే వాడన్నాడు. మున్నాట అరవైరోజులూ మీ గడపల కాడు పడి బతికేవోళ్ళం. మమ్మల్ని కనికరించి



ఆమె సున్నితమైంది...
ఆమె అర్థంకానిది...
ఆమె మృదువైంది, దృఢమైంది,
సౌందర్యం సంతరించుకున్నది...
అందుకే ఆమె పరిపూర్ణ స్త్రీ...
పట్టువంటి టాల్క్... అనురాగపూరితమైనది. మిమ్మల్ని అలరించేందుకే ... సరిక్రొత్త సువాసనలతో మిమ్మల్ని రంజింపచేసేది... క్షణక్షణం మీలో అపూర్వానుభూతిని కల్గించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడింది. అదే మీ వీయిల్ ఆఫ్ లౌ... హేలో మాత్రమే సమర్పించగలిగేది.
హేలో
వీయిల్ ఆఫ్ లౌ టాల్క్
NEW
Halo
VEIL OF LOVE
TALC
ప్రత్యేకమైన
రూ. 1.50 తగ్గింపు
అవకాశం
మా ప్రతి ఎకానమీ సైజ్ ప్యాక్ ఖరీదులో
ఈ చుక్కల వెంబడి కత్తిరించండి.
ఈ కూపన్ కత్తిరించండి. మీ పేరు, చిరునామా ఇంగ్లీషులో వ్రాసి కూపన్‌లో గల చిరునామాకు పంపండి. ఆపైన మీకు ప్రత్యేకమైన ఓ డిస్కౌంట్ వౌచర్ లభిస్తుంది. ఆ డిస్కౌంట్ వౌచరను మీ డీలర్ వద్దకు తీసుకువెళితే, అతను మీకు హేలో వీయిల్ ఆఫ్ లౌ టాల్క్‌ను మామూలు ఖరీదుకన్న రూ. 1.50 తక్కువకు ఇస్తారు.
ఈ ప్రత్యేకమైన తగ్గింపు సౌకర్యం కొద్ది కాలానికే పరిమితం. అందుకే త్వరపడండి.
నేడే మీ కూపన్ పోస్ట్ చేయండి.
COUPON
To
Halo Veil of Love Talc D.O.
C/o Colgate-Palmolive (India) Pvt. Ltd.
12-A Ritchie Street, Madras 600 002.
APW
Dear Sirs,
I would like to have my Halo Veil of Love Talc discount voucher sent to:
Name
Address

దాహం

ఇన్ని నీళ్ళు ఇప్పించండయ్యా" — పుల్లిగాడి పెత్తండ్రి ముసిలిగాడు ప్రాధేయ పూర్వకంగా అన్నాడు.

"అవున్నా - మీకు న్యాయం కావాలి. న్యాయం. మాకాడ తీసుకొన్న బాకీలల్లోకి సెల్లెయ్యడానికి గతిలేని ఎదవలకు — మీకు న్యాయమే కావాల్లా. అర్ధరాత్రనక, అపరాత్రనక మీకు అప్పులిచ్చినందుకు ఆయేళ బాగా బుద్ధి చెప్పారు" పిచ్చయ్య విసురుగా అన్నాడు.

"మాకు వూరికేనే ఇచ్చారా అప్పులు? నూటికి పదిరూపాయలు వడ్డీ వసూలు చేస్తున్నారు. ఎంత సెల్లేసినా, మీ ఇళ్లకాడబడి అందరం ఎంత కాయకష్టం చేసినా మీ లెక్కల ప్రకారం ఆ బాకీలు ఎప్పటికీ తీరవాయె!" మా ఆడోళ్ల మెళ్లో పుస్తెలు కాడ్నించి, గొడ్డు గోదా దాకా అంతా మీ ఇళ్లకు చేరినాకాని మీరిచ్చిన అప్పులు ఇంకా అట్టాగే వుంటాయి. సివరికి నోరు తెరిచి నాయం అడిగితే మాది తప్పైపోయింది." పారుగూరి హైస్కూల్లో టీచరుగా పనిచేస్తున్న వీరయ్య ఆవేశంకొద్దీ అరిచాడు

"ఒరేయ్ వీరిగా! నోరు పారేసుకున్నావంటే మర్యాద దక్కదు జాగ్రత్త. ఏం చూసుకొనిరా ఆ అహంకారం? నీ ఉద్యోగం ఊడగొట్టడం నిమిషాలమీదపని తెలుసా? సచ్చిన గొడ్లను కోసుకొనే నాయాళ్లు కూడా మాటలు నేర్చి మాకు ఎదురునిల్చి జవాబులు చెప్తున్నార్రా?" — భూషయ్య కళ్లు చింత నిప్పుల్లాగా మండాయి. అతని అరుపులకు దిక్కులు దద్దరిల్లాయి.

"ఏంది దొరా! మా కులవృత్తి నంటారు? కులవృత్తి చెయ్యడం ఎవరికైనా గౌరవమే. కుమ్మరోళ్లు కుండలు సెయ్యకపోతే, రజకులు బట్టలు ఉతక్కపోతే, మనకు గడుస్తదా? అట్టాగే సచ్చినగొడ్లను మేం నరక్కపోతే అసలు వూరే ఉండదు. చెమటోడ్చి పనిచేసే వాళ్లం నాయం అడిగితే తప్పా? ఇంతాసేస్తే గుక్కెడునీళ్లకు ఇన్నిమాటలు అడుగుతారా? మంతుర్లు, పోలీసోళ్లముందు మమ్మల్ని ఉద్ధరిస్తామని ఉపన్యాసాలు సెప్పి, ఆళ్ళు పోయింతర్వాత మాకు గోతులు తవ్వుతారా? మీ పెద్దోళ్ళు, మా పెద్దోళ్లను ఇట్లాగే

చూసేవాళ్ళా? ఆళ్ళు మమ్మల్ని కన్నబిడ్డల్లా కడుపులో పెట్టుకొని ఆదుకొనేవాళ్ళు. ఇప్పుడు కాలంఅంతా తిరగబడిపోయింది'' ముసిలిగాడు ఆవేదనగా అన్నాడు.

కొద్దిక్షణాలు మౌనం రాజ్యం చేసింది.

''దొరల్లారా — ఇన్ని మాటలెందుగ్గాని మా అందరి తరఫున చేతులెత్తి మొక్కుతూ అడుగుతున్నాను. మాకిన్ని నీళ్ళిప్పించి ఈ ఎండాకాలం మమ్మల్ని ఆదుకోండి: మీ పెద్దోళ్ళ పేరు నిలబెట్టండి.'' పుల్లిగాడు రెండు చేతులూ పైకెత్తి జోడించి వణుకుతూ అన్నాడు.

''ఒరేయ్ — మా పెద్దోళ్ళు తెలివితక్కువోళ్లరా-ఆళ్ళుచేసినట్టు మేం చేస్తామా? ఇదిగో అంతా ఇనండి. మమ్మల్ని మీరు పెట్టినబాధల్ని మేమింకా మర్చిపోలేదురా— మీరు గొడ్లు నరక్కపోతే అసలు వూరే వుండదంట్రా? ఏం మీరు కోతలకు రాకపోతే మాపంట మా ఇళ్లకు రాలేదా? అట్టాగే మీరు ఎవరూ లేకపోయినా మాకు గడుసుద్దిరా — మీకు గుక్కెడు నీళ్లు కాదుకదా ఒక చుక్క కూడా ఇచ్చేదిలేదు. ఫోండి— దిక్కున్నచోట చెప్పుకోపోండిరా'' — మునసబు, శేషన్న కలిసి అరిచారు. భూషయ్య మీసాలు సన్నగాదువ్వి నవ్వాడు. మిగిలిన పెద్దలంతా మునసబు, శేషన్న మాటలకు అంగీకరిస్తున్నట్లు తలలూపారు.

పుల్లిగాడు, పుల్లిగాడి పెత్తండ్రి, ఇంకా పెద్దవాళ్లు, ఆడవాళ్లు ఎంతగానో బ్రతిమాలారు. కొంతమంది ఆడవాళ్లు కన్నీళ్లు పెట్టుకొన్నారు. కాని పెద్దల నిర్ణయం మారలేదు. పైన ఎండ పేలిపోతోంది.

''అమ్మా-మంచినీళ్ళే-మంచినీళ్లు కావాలే''—రంగిచంకలోని పిల్లవాడు గట్టిగా అరిచాడు. తల్లికసురుకొనేసరికి వాడు ఏడుపు లంకించుకొన్నాడు.

మునసబు రంగివేపుచూశాడు. రంగి మాదిగ పాలెంలో తప్పబుట్టింది. లేకపోతే దాని ఒంటి రంగు, దానిఅందం ఆ పాలెంలో ఎవరికుంది? అసలు ఆ వూరిలోపల్లే అంత అందగత్తె మరొకర్తి లేదు. గతంలో రంగిని స్వంతం చేసుకోవాలని తనెన్నిసార్లు ప్రయత్నించాడు? కాని రంగి-అది-తనను దగ్గరకు చేరనిచ్చిందా?— కళ్లు చెదిరే మండు టెండలో పుత్తడిబొమ్మలా మిలమిలా మెరిసిపోతున్న రంగివేపుచూసిన మునసబు మనస్సులో ఎన్నో ఆలోచనలు ముసురుకొన్నాయి.

రంగి కొడుకు ఏడుపువిని మరో ఇద్దరు పసిపిల్లలు ఏడువడం ప్రారంభించారు. అప్పటిదాకా సహనంతో ఆ ఎర్రటి ఎండలో నిల్చున్న వాళ్ళందరికి పెద్దలనోటినుంచి మరోమాట రాకపోయేసరికి ఆందోళన ఎక్కువైపోయింది.

''ఇంక ఎంతసేపు నిలబడ్తా ఇంతేరా— బస్సులో పోవడానికి డబ్బుల్లేకపోతే పదిమైళ్లు నడిచి పట్నం పొండి. ఆడైతే లారీల్లో నీళ్లు సప్లయి చేస్తున్నారంట''కరణం మాటలకు మిగిలిన పెద్ద మనుషులంతా నవ్వారు.

''ఏందయ్యా! మేం మంచినీళ్లకోసం పట్నం పోవాలా? ఏం- ఎందుకుపోవాలి? ఈ ఈ వూళ్లోని గాలి, నీళ్లు, ఎలుత్తురు అంతా మీ సొంతమా?— మీ మీద గౌరవం కొద్దీ. ఇంతదాకా వున్న కట్టుబాటు కొద్దీ ఇంత దూరం నోరు తెరిచి గుక్కెడు నీళ్లిమ్మని అడిగాం. బదులుగా మీరు నానామాటలు అన్నారు. ఎగతాళి చేశారు. అయినా మళ్లీ మళ్ళీ బ్రతిమాలాం. చేతులెత్తి దండంపెట్టి

పైవారమే!
లక్షల్లో ఒకడు

మరీ అడిగాం. అవునయ్యా మాదే బుద్ధి తక్కువ. ఎంతయినా మేం అంటరానివోళ్ళం కదా! మీ తెలివితేటలు మాకెట్టావొస్తాయ్? మమ్మల్ని ఆదుకొని మీ గౌరవం నిలబెట్టుకొంటారేమో అనుకొన్నాం. మాదిగోళ్లు, మాలోళ్లు అనకుండా హరిజనులు అంటూ మాకు కొత్తపేరు పెట్టగానే ఇంక మా బతుకులు బాగుపడినాయని బెమపడ్డాం. దొరల్లారా! ఇయ్యాల అసలుఇసయంతెలిపోయింది. ఎవడు అడ్డు నిలుస్తాడో చూస్తాం'' కొండడు గర్జించాడు. అంతవరకు చిత్రహింసకు గురవుతున్న వాళ్లందరికి ఒక్కసారిగా విముక్తి లభించినట్లు కుర్రకారు అంతా అంకమ్మ గుడివేపు పరిగెత్తారు.

హఠాత్తుగా సంభవించిన ఈ పరిణామానికి గ్రామ పెద్దలు నిశ్చేష్టులైనారు. వారి కళ్లల్లో మంటలు రగిలాయి. ఆ మంటలే ఆ రాత్రి మాదిగ పాలాన్ని దహించివేశాయి. పాలెం నుంచి అంతా కకావికలై పరుగెత్తి పోతూంటే గ్రామ పెద్దలంతా కసితీరా నవ్వుకొన్నారు.

ఇంతలో మునసబుకు ఏదో ఆలోచన మెరుపులా తట్టింది. అతను విసురుగా రంగి గుడిసెవేపు కాలు సాగించాడు. చంకలో పిల్లవాడితో రంగే, అతనికి ఎదురుగా వస్తూ కన్పించింది. మునసబు చటుక్కున పైగుడ్డతో ఆమె మొహం కప్పేసి, నోరు నొక్కి ఆమెను బరబరా దూరంగా వున్న గడ్డివాముల చాటుకు లాక్కుపోయాడు.

''ఏమే రంగీ! ఇయ్యాల ఎవుడు అడ్డువొస్తాడే నాయాల - ఇంతకాలం నన్ను తప్పించుకు తిరిగావు 'దూ'—రంగి మొహం మీద నుంచి గుడ్డ తీసి వికృతంగా నవ్వాడు మునసబు.

''నువ్వా మునసబూ—నన్ను, నావోళ్లను నాశనంచేస్తేగాని నీ పగ సల్లారదా — పగటి పూట నేను ముట్టుకున్న నీళ్లు పనికిరావు కాని రాత్రిపూట నేను నీకు పనికివస్తానంట్రా —ఎదవనాయాల-అరేయ్ - ఈ రంగి అంటే ఎట్టాటిదనుకొన్నావో — మరేదగా వదిలావా సరే — లేకపోతే ... లేకపోతే ... '' ఆపైన ఆవేశంతో ఆమెకు మాటలు రాలేదు.

''లేకపోతే-ఏంచేస్తావే ఎరిమొగమూ — నోరు మూసుకొని లొంగిపోయావా గుట్టు బయటపడదు. లేకపోతే నీకే నష్టమే —'' మీద మీదకు వస్తున్న మునసబును తప్పించుకోవడానికి వెనక్కు జరుగుతూ అక్కడ కాలికి అడ్డంగా తగిలిన పెద్ద తుమ్మమొద్దుమీద పడిపోయింది రంగి. ఆమెచంకలో పిల్లవాడు నేలమీద విసురుగా పడిపోయి గట్టిగా ఏడవడం ప్రారంభించాడు.

క్రిందపడ్డరంగికి పైట తొలగిపోవడంతో మునసబుకళ్లు బైర్లుకమ్మాయి. నిల్చున్న పళంగా అమాంతం ఆమె మీద పడి వాలిపోయాడు. తన మీద పడబోతున్న మునసబు నుండి తప్పించుకోడానికి రంగి చటుక్కున పక్కకుదొర్లింది. తుమ్మమొద్దుమీద బలంగా పడ్డ మునసబుకు ప్రక్కటెముకలు కలుక్కుమన్నాయి అతను వెంటనే లేవలేకపోయాడు. రంగికి పరిస్థితి అర్ధమైంది. మునసబును బలంగా ప్రక్కకు దొర్లించి క్రిందఉన్న తుమ్మమొద్దును విసురుగాఎత్తి మునసబు మీదకు విసిరేసి, ఏడుస్తున్న పిల్లవాడిని ఎత్తుకొని చీకట్లోకి పరిగెత్తిపోయింది. మునసబు బరువుగ మూల్గి ప్రక్కకు ఒరిగిపోయాడు.

జరిమానా



మల్లాది వెంకట కృష్ణమూర్తి

హావురానుంచి హైద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైల్లోని వో లేడీస్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కాడు సూర్యం డోర్నకల్ స్టేషన్‌లో, ప్రయాణీకుల టిక్కెట్లు తణిఖీ చేయడానికి. అంతకు ముందే రెండు కంపార్ట్‌మెంట్స్ తణిఖీ చేయడం పూర్తిచేసి ఆ మూడో పెట్టె లోకి ఎక్కాడు సూర్యం.

పేరుకి స్త్రీలకోసం ప్రత్యేకింపబడ్డ సెకండ్‌క్లాస్ (పూర్వం థర్డ్‌క్లాస్) పెట్టె అయినా, దాంట్లో సగానికిపైగా మొగవాళ్లు ప్రయాణం చేస్తున్నారు. సూర్యం ఒక్కొక్కళ్ల దగ్గరకే వెళ్ళి, టిక్కెట్ అడిగి తీసుకుని, దానిమీద తన నీలంరంగు పెన్సిల్‌తో సంతకం చేస్తున్నాడు. చేసి, తిరిగి ఎవరిటిక్కెట్లు వాళ్లకి ఇచ్చేస్తున్నాడు.

శనివారం అవటంవల్ల, వరసగా నాలుగు రోజులు పబ్లిక్‌హాలీడేస్ రావటంవల్ల, ఎండా కాలం అవటంవల్ల ఆ హౌరా-హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ బాగా రద్దీగావుంది. మనిషి కాలు కదిపేందుకు కూడా చోటు లేనంతగా ఆక్రమించుకున్నారు ఆ కంపార్ట్‌మెంట్‌ని. ఆఖరికి, టాయ్‌లెట్ తలుపు తెరచి, దాన్లోపలకూడా అయిదారుగురు కూర్చుని వున్నారు, వేరేఎక్కడా చోటులేక.

రైలు అంతరద్దీగా వుంటుందన్నసంగతి తెలిసే, స్పెషల్‌స్క్వాడ్‌కి చెందిన సూర్యాన్ని, మరికొందరినీ చెకింగ్ డ్యూటీకి పంపారు అధికారులు. టిక్కెట్‌లేకుండా ప్రయాణం చేసేవాళ్ళు చాలామంది దొరుకుతారు అలాంటి సందర్భాలలో. అందుకే సూర్యం జాగ్రత్తగా తణిఖీచేస్తున్నాడు, వేగంగావెళ్తున్న ఆరైల్లో.

వెలుగుపడనిచోట, ఓ మూలగా ఎత్తుగా వున్న రేకు పెట్టెమీద కూర్చొనివున్న ఓ అరవై అయిదేళ్ల ముసలావిడదగ్గర ఆగి, అడిగాడు సూర్యం, ఆ విడ వంక చూడ కుండానే, మరొకరి టిక్కెట్ తణిఖీచేస్తూ.

"మీ టిక్కెట్ తీయండమ్మా."

తనుచూస్తున్న టిక్కెట్‌మీద సంతకం చేసి, తిరిగిఇచ్చేసి, మళ్లీ అడిగాడు సూర్యం ఆ ముసలావిడని.

"మీ టిక్కెట్ ?"

"లేదు." వణుకుతున్న స్వరంతో జవాబిచ్చింది ఆ ముసలావిడ సూర్యానికి.

"ఎక్కడెక్కారు ? ఎంతదాకా ?" సూర్యం కంఠం అలవాటుగా పలికింది డబాయింపుగా.

"విజయవాడ, వరంగల్ దాకా."

"టిక్కెట్ కొనలేదా ? పోయిందా ?"

"కొనలేదు"

"అయితే ఇప్పుడు కొనండి. రసీదు రాసిస్తాను. పదిరూపాయలు జరిమానాకూడా కట్టాలి"

"డబ్బులేదు" నూతిలోంచి వచ్చినట్టుగా వుంది ఆ ముసలావిడ స్వరం.

ఏదో అనబోయి సూర్యంఆగి, ఆవిడవంక కొద్దిగా పరిశీలనగా చూశాడు. ఓసారి చేత్తో ముక్కుని పిండుకున్నాడు ఆలోచనగా. మళ్ళీ ఇంకోసారి ఆవిడని తేరిపారచూసి అడిగాడు, గొంతుతగ్గించి నెమ్మదిగా.

"మీది బందరు కదూ ?"

"అవును" జవాబు చెప్పిందావిడ.

"బందరునుంచి కట్టాలా ? నాదగ్గిర చిల్లిగవ్వలేదు. వరంగల్‌లో మా అబ్బాయి దగ్గరకి వెళ్తున్నాను."

"మీ పేరు వర్ధనమ్మగారు కదా?" అడిగాడు.

"అవును. నన్నెరుగుదువా ?" ఆవిడ వక్షలో విభ్రాంతి, సంకోచం, కొద్దిపాటి సంతోషం-కలిసిపోయాయి.

"నేను సూర్యమండి. సూరిగాడనే వారు మీరు. ఎస్సెసెల్సీ చదివేరోజుల్లో మీయింట్లో అద్దెకుండే వాళ్లం" సంతోషంగా చెప్పాడు సూర్యం వర్ధనమ్మతో.

- ఆవిడ ఏదో వెదుకుతున్నట్లుగా సూర్యం వంక చూసి అన్నది కొద్దిగా బాధగా. "ఈమధ్య కళ్లు మసక బారాయి. ఆనటంలేదు చూపు సరిగా. సూరిగాడివా నువ్వు ? అవును ఆమధ్య మీనాన్న కనబడి చెప్పాడు నువ్వు రైళ్లమీద తిరిగే వుద్యోగంలో చేరావని."

"టిక్కెట్ కొనలేదే ?" ఈసారి వీలయినంత మృదువుగా అడిగాడు సూర్యం వర్ధనమ్మని.

పెద్దగా నిట్టూర్చి అన్నది "డబ్బులేక"

"మీఇల్లు ? ఇంటిమీద వచ్చే అద్దెలు ?" ఆశ్చర్యంగా అడిగాడు సూర్యం.

"ఆడదాని పెత్తనంతో ఆస్తి ఎంతకాలం నిలుస్తుంది ? వుండటమేకాని, ఎవరూ అద్దె సరిగా ఇచ్చిన పాపాన పోలేదు. ఇప్పుడు ఆ ఇల్లుకూడా మా పినతండ్రి అధీనంలో వుంది. పోట్లాడే ఓపిక వయసు లేవు ఇప్పుడు."

సూర్యం కొద్దిగా బాధగా అన్నాడు.

"మేం వున్నప్పుడు కూడా ఘనాపాటి అద్దె ఇవ్వకుండా మిమ్మల్ని ఏడిపించేవాడు. మానాన్న కలుగచేసుకుని ఇప్పిస్తే సరేసరి. లేకపోతే ఇచ్చేవాడుకాడు ఆరోజుల్లో."

రెండు వందల పైనే ఎగ్గొట్టి వెళ్లిపోయాడు ఆచచ్చినాడు. పోతూ పోతూ, కిటికీ తలుపులు, ఇంటి తలుపులు పీక్కుపోయాడు, రాత్రికి రాత్రే దొంగతనంగా; లాయర్‌చేత కాగితం ఇప్పించాననే కోపంలో."

"మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు వరంగల్‌లో ?" అడిగాడు సూర్యం.

"ఓ బస్ కంపెనీలో డ్రయివర్‌గా పని చేస్తున్నాడు: వాడుకూడా సరిగా చూడడు. కోడలు మంచిది కాకపోతే వాణ్ణని ఏంలాభం? నారాత ఇలాక్కాలబట్టే ఇంకా బతికున్నాను"

సూర్యం తన కాకీపేంట్‌జేబులోంచి చేతిరుమాలు తీసి, ముఖం ఓసారి తుడుచుకున్నాడు. చేతిలో తెరచి పట్టుకున్న రసీదు పుస్తకాన్ని మూసేసి అన్నాడు వర్ధనమ్మతో.

"మిమ్మల్ని వరంగల్‌లో కలుస్తాను స్టేషన్‌లో. టిక్కెట్ లేకపోతే బయటకి పంపడం కష్టం. ఈరోజు ప్రత్యేకంగా చాలా మందిని వేసారు అయినా ప్రయత్నిస్తాను. వరంగల్‌లో నాకంతా కొత్త."

వర్ధనమ్మ చెయ్యెత్తి దణ్ణం పెట్టి అన్నది.

"నీ దయ బాబూ."

సూర్యం కళ్లు కొద్దిగా చెమ్మగిల్లాయి. పదిహేనేళ్ల క్రితం వర్ధనమ్మ ఎంత దర్జాగా బతికేది ? కాలం మసిషిలో, అదృష్టంలో ఎంత మార్పు తీసుకువస్తుంది ?

ముందుకు కదిలాడు వరంగల్ స్టేషన్‌లో తనకి పరిచయం వున్నవాళ్లు ఎవరయినా గేటుదగ్గర వుంటే బావుండుననుకుంటూ

అయిదారుగురి దగ్గర చెక్ చేసాడు. మూడేళ్లు నిండిన పిల్లాడికి టిక్కెట్ కొనలేదు. ఓ తండ్రి. తన పిల్లవాడికి మూడేళ్లు నిండలేదని వాదించాడు: ఇలాంటి వాదనలు అలవాటే కాబట్టి సూర్యం గట్టిగా చెప్పాడు.

"ఫైన్‌తోసహా టిక్కట్టు కొనకపోతే స్టేషన్‌లోంచి ఎలా బయటకి వెళ్తారో చూస్తాను. కోర్టులో చెప్పుకుందురు గాని మేజిస్ట్రేట్ ముందు."

వెంటనే చల్లబడిపోయి డబ్బు బయటకి తీసాడు సణుగుతూ. రసీదు రాసిచ్చి, డబ్బు తీసుకున్నాడు సూర్యం.

"మీ టిక్కెట్స్" అడిగాడు కొంచెం దూరంలో కూర్చున్న వాళ్లని.

అయిదుగురు స్టూడెంట్స్, ముగ్గురు కోడి గుడ్ల వ్యాపారం చేసుకునే వాళ్ళు టిక్కెట్లు అందించారు సూర్యానికి. ఇద్దరు పిల్లలతో ప్రయాణంచేస్తున్న ఓ ఏభై ఏళ్ల తను తన టిక్కెట్లు భార్య హేండ్‌బేగ్ లోంచి తీసి అందించాడు తాపీగా.

సూర్యం అన్నిటిక్కెట్లమీద సంతకాలు చేసి ఎవరివి వాళ్లకి అందించాడు, ఒక్క ఆ ఏభై ఏళ్ల వ్యక్తికి తప్ప.

"ఎంతమంది మీరు?" అడిగాడు సూర్యం తన చేతిలోని టిక్కెట్లు లెక్క పెట్టి, వాళ్ల కుటుంబ సభ్యులని లెక్కవేస్తూ



''నలుగురం''చెప్పాడు ఆ ఆసామి.

సూర్యం తన చేతిలోని టిక్కెట్లని మరో సారి లెక్కపెట్టి అన్నాడు.

''ఒక టిక్కెట్ తక్కువ కొన్నారే?''

''తక్కువా? నాలుగూ ఇచ్చానే''అన్నా డతనుకంగారుగా.

''మీరే చూడండి''

తన చేతిలోని టిక్కెట్లని ఆ ఆసామి చేతిలో వుంచాడు సూర్యం. ఆయన లెక్క పెట్టాడు. మూడే వున్నాయి. సూర్యం నేల మీదకి చూసాడు వంగి, కిందపడి వుండచ్చుని. నేలమీద లేవు.

''నాలుగూ ఇచ్చానే'' అన్నాడా ఆసామీ సందిగ్ధంగా.


''ఇస్తే ఏమవుతుంది. చూడండిసరిగ్గా'' అసహనంగా అన్నాడు సూర్యం.

తన భార్య హేండ్‌బేగ్ అందుకుని గబ గబా లోపలి వస్తువులన్నీ తన సీట్ మీద బోర్లించాడు. టిక్కెట్‌తప్ప చాలా వస్తువులు పడ్డాయి. సీటుమీద పరిచివున్న తువ్వాలమీద. ఖాళీ హేండ్ బేగ్‌లో చేతిని పెట్టి వెదికాడు. తన జేబులు వెదుక్కున్నాడు.

''టిక్కెట్స్ బయటకి తీసావా మధ్యలో ఎక్కడయినా?''అడిగాడు భార్యని.

ఆవిడతల అడ్డంగా వూపింది.

''నాలుగూ కొని నీ హ్యాండ్ బేగ్ లోనే వేసానే? కాంపతీసి ఇందాక మీరు టీ తాగి నప్పుడు డబ్బులివ్వడానికి హేండ్‌బేగ్ తెరిచి నప్పుడు జారిపడిపోయిందేమో'' అన్నాడాయన



జరిమానా

ఆదుర్దాగా. ఆవిడ వెంటనే ఒడి దులుపుకొని అన్నది.

''ఉహూ. పడివుంటే నా ఒళ్ళోనే పడాలి. మీరు నాలుగూ కొన్నారా ?''అనుమానంగా అడిగింది.

''నీ మొహం ఈడ్చు, ఎక్కడో నువ్వే పారేసావు'' కోపంగా అరిచాడా ఆసామి భార్య మీద మండిపడుతూ.

సూర్యం కిటికీలోంచి బయట కనబడు తున్న చీకటివంక చూస్తూ అంతదాకా శ్రోత అయ్యాడు వాళ్లిద్దరికీ.

''నాలుగు కొనలేదా?''అడిగాడు ఖంగున.

''కొన్నాను. నా భార్య ఎక్కడోపడేసింది''

''లేదు. మీరు తీసుకునేటప్పుడే నాలుగు బదులు మూడు తీసుకుని వుంటారు''అన్నదా విడ తన అహం దెబ్బతిన్నట్లుగ.

''సరిగ్గా చూడండి'' అన్నాడు సూర్యం విసుగ్గా.

మళ్ళీ మరోసారి వెదికి నిస్పృహగా అన్నాడు ఆ ఆసామి సూర్యంతో.

''మా ఆవిడ ఎక్కడో పారేసింది''

సూర్యం తనచేతిలోని బేగ్‌లోంచి ఓఅచ్చు పుస్తకం బయటికి తీసాడు, 'రైల్వే ఫేర్స్‌రెడీ రికనర్' అది

''మీరు డబ్బు కట్టాలయితే'' అన్నాడు ఆ పుస్తకంలో ఎంత కట్టాలో చూస్తూ.

''నిజంగా నాలుగూ కొన్నాను. మూడు కొన్నవాణ్ణి నాలుగు కొనలేనా ?'' ఆ ఆసామి అరిచాడు కోపంగా సూర్యంమీద.

''నేను కొనలేదంటాను'' సూర్యం సౌమ్యంగా అన్నాడు.

''కొన్నాను''వత్తిపలికాడాయన.

''కొనలేదు''ఇంకా సౌమ్యంగా పలికాడు సూర్యం.

''నిజంగా కొన్నాను. నాలుగు టిక్కెట్లకి డబ్బిచ్చాను.''

''మరో నాలుగు టిక్కెట్లకి డబ్బిచ్చా వంటే సరిపోదు. అలా ఇచ్చారనడానికి నిదర్శనమే టిక్కెట్. టిక్కెట్ వుంటే చూపించండి. లేకపోతే ముప్పైఆరు రూపా యల చిల్లర బయటికి తీయండి'' కర్కశంగా అన్నాడు సూర్యం.

''దేనికి ముప్పైఆరూ? ఇరవై ఆరేగా? అయినా మళ్ళీ దేనికి టిక్కెట్ ఛార్జీకట్టాలి నేను ?'' గొంతు పెద్దదిచేశాడాయన లేస్తూ.

శాంతంగా చెప్పాడు సూర్యం, పోట్లాడే ఓపికలేక. ''జరిమానాతోసహా ముప్పైఆరు కట్టకపోతే మాత్రం మీరు సికింద్రాబాద్ స్టేషన్‌లోంచి బయటికి అడుగు పెట్టలేరు. రేపు వుదయం కోర్టులో మీరు మేజిస్ట్రేట్‌కి చెప్పుకుందురుగాని'' అని ఆగి అన్నాడు కాస్త గట్టిగా ''అయిదువందల జరిమానా లేదా మూడు నెలల జైలు. లేదా రెండూ. మెజిస్ట్రేట్‌నిబట్టి వుంటుంది తీర్పు.''

''పోతేపోయింది కట్టేయండి పాడుడబ్బు లేచి ఎవరి వెధవమొహం చూసామోకాని...'' ఆ ఆసామి భార్య భర్తకి సలహా ఇచ్చింది.

''ఇటీజ్ అబ్సర్డ్. ఐ కాంట్ టాలరేట్ సచ్ ఏ...'' గట్టిగా ఇంగ్లీష్‌లో ఏదో చెప్ప బోయాడు ఆ ఆసామి.

''డబ్బు కడతారా, కట్టరా ?'' విసుగ్గా అడిగాడు సూర్యం, రైలువేగం తగ్గడం గమనించి.

అంతదాకా మౌనంగా వున్న ఆ ఆసామి కొడుకు తన జేబులోంచి డబ్బుతీసి సూర్యా నికి అందించి అన్నాడు. ''మీపని కానివ్వండి. పొరపాటు మాదయినప్పుడు ఏంచేస్తాం?''

సూర్యం డబ్బు అందుకుని రసీదు రాసిచ్చాడు ఆముసలాయన కొడుక్కి.

''ఈ రసీదు పారేయకండి మళ్ళీ'' అన్నాడు కనీ కనబడకుండా నవ్వి.

రైలు మెహబూబాబాద్‌లో ఆగింది. వర్ధనమ్మతో, తను వరంగల్ స్టేషన్‌లో కలుస్తాననిచెప్పి, ఆకంపార్ట్‌మెంట్‌లోంచిదిగి, ప్రక్క కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కాడుసూర్యం స్టేషన్ కాంటీన్‌లో టీ తాగి.

రైలు బయలుదేరింది మళ్లీ!


రైలు వరంగల్ స్టేషన్‌లో ఆగాక సూర్యం చెప్పాడు వర్ధనమ్మ ఎక్కివున్న కంపార్ట్ మెంట్‌లోకి వచ్చి.

''ఇక్కడ మూడే మూడు నిముషాలు ఆగు తుంది. త్వరగా దిగండి''

తనే సహాయం చేసాడు దిగడానికి. వర్ధనమ్మ రేకు పెట్టెని తనే పట్టుకుని నడుస్తూ అన్నాడు.

''నాకు చాలా బాధగా వుందండి. మొగ దిక్కు లేకపోతే కష్టం, ఈ కాలంలో ఆడ వాళ్లకి. అందరికీ అలుసే మీలాంటి వాళ్ళంటే''

ఆవిడ నిశ్శబ్దంగా కళ్ళొత్తుకుంది. తన



Thomas/DCM 15

జ రి మా నా

కోడలిని తలచుకునో, తన నిస్సహాయతకో, లేక పొందుతున్న సహాయం వల్ల ఏర్పడ్డ కృతజ్ఞతకో తెలియలేదు సూర్యానికి. ఆవిడ కళ్ళలో నీళ్లు తళుక్కుమనటం మాత్రం గమనించాడు.

"నీకు తెలిసినవాళ్లు ఎవరయినా వున్నారా? ఇబ్బందేం వుండదుగా ?" అడిగింది వర్ధనమ్మ సూర్యాన్ని, గేటుదగ్గిరవగానే.

"టిక్కెట్ వుంది. మిమ్మల్ని ఎవరూ ఏమీ అడగరు."

సూర్యం తన జేబులోంచి, సికింద్రాబాద్ దాకా కొన్న ఇరవై అరురూపాయల చిల్లర కిమ్మత్తు చేసేటిక్కెట్‌ని, బయటకి తీసి అందించాడు వర్ధనమ్మకి.

"టిక్కెట్ ఎక్కడిది? కొన్నావాబాబూ?" అడిగింది కృతజ్ఞత నిండిన కంఠంతో.

"కొనలేదు. మీ పాత బాకీ కొద్దిగా వసూలు చేసానంతే" నవ్వాడు సూర్యం.

"పాత బాకీయా ?" అడిగింది ఆశ్చర్యంగా. "మీ నాన్న నెల నెలా అద్దె సరిగ్గానే ఇచ్చేవాడేగా ?"

"మాదికాదు. మరొకరి అద్దె."

"ఇంకెవరు ?"

"ఘనాపాటి"

"ఘనాపాటి ?"

"అవును."

"నీ కెక్కడ కనపడ్డాడు ?"

"మీరు ఎక్కివస్తున్న పెట్టెలోనే భార్య, ఇద్దరు కొడుకులతో వస్తున్నాడు, చాలా దూరం నుంచి. చూడగానే గుర్తుపట్టగలిగాను, మీకు రెండువందల చిల్లర బాకా ఇవ్వాల్సినా, ఈ కాస్తే వసూలు చేయగలిగాను" అన్నాడు గర్వంగా నవ్వి.

"ఇచ్చాడా గొడవచేయకుండా?" వర్ధనమ్మ నమ్మలేనట్టుగా అడిగింది.

"కాలం, నా వుద్యోగం, అవకాశం అన్నీ కలిసివచ్చాక ఇవ్వక ఏంచేస్తాడు ? అంతేకాదు. మీకు డబ్బు ఎగ్గొట్టడంవల్ల చిన్న జరిమానా కూడా వేసాను."

వర్ధనమ్మ గేటులోంచి బయటకి వెళ్ళాక, తిరిగి మళ్ళా బయలుదేరబోతున్న రైలువైపు నడుస్తున్న సూర్యాన్ని చూసి, తండ్రితో అన్నాడు ఘనాపాటి కొడుకు సంభ్రమంగా.

"నాన్నా మనదగ్గర డబ్బు వసూలుచేసిన టి. సి. సూరిగాడులా వున్నాడు చూడు. నడక చూస్తే అలాగేవుంది అచ్చం."

సరిగ్గా అదే సమయంలో అనుకున్నాడు సూర్యం.

'ఏ న్యాయాధికారి మాత్రం వర్ధనమ్మకి ఇంతకంటే ఎక్కువ న్యాయం చేయగలడు ? ఘనాపాటికి ఇంతకంటె ఎక్కువ జరిమానా వేయగలడు ?'

నా శ్వాసలో శ్వాసించే నా ప్రియుడు



నన్ను విడిచి క్షణం


స్వర్గంలో కూడా ఉండలేనంటాడు

నిర్మలమై, తాజా రుచి గలిన బినాకా గ్రీన్ నాకెంతో అవసరమైన ఆత్మ విశ్వాసాన్ని చేకూర్చుతుంది. ముఖ్యంగా నేనతని చేరువనున్న మధుర క్షణాలలో. ఎందువల్లనంటే, బినాకా గ్రీన్‌లో శ్వాసయొక్క దుర్వాసనను హరించి మీ నోటికి రోజంతా హాయి గొల్పే తాజా తనాన్నివ్వగల ప్రకృతిసిద్ధమైన దుర్గంధ-సంహారక పదార్థము, క్లోరోఫిల్ ఉన్నది. అందు చేత బినాకా గ్రీన్ నాకత్యంత ప్రియతమమైంది.

నన్నంతగా ప్రేమించే నా ప్రియుణ్ణి కేవలం నా వాడిని చేసిన బినాకా గ్రీన్‌కు ధన్యవాదాలు.



మా గాఢ అన్యోన్య ప్రేమకు కారణం-బినాకా గ్రీన్



బినాకా టూత్ బ్రష్‌కి గుండ్రటి కొనలు ఉంటాయి ఇగుళ్ళను ఏమాత్రం గాయపరచవు.

CIBA-GEIGY

Rediffusion/CG/194 e Tel

నీతి శతకం

మహమ్మద్‌హుస్సయిన్ కవి రచించిన నీతి శతకం తెలుగుబాల మా కార్యాలయం చేరింది. వెల రూపాయి. దొరుకుచోటు రచయిత కేరాఫ్ జూనియర్‌బేసిక్‌స్కూలు, దొరసానిపాడు, పి.ఒ.

అపి - ఇపి - అన్నీ

పాంచజన్యం

శ్రీ ''పరమాత్మ'' రచన ''పాంచజన్యం'' మా కార్యాలయం చేరింది. 48 పేజీలు. వెల : మూడు రూపాయలు. ప్రతులకు : శ్రీ జోశ్యుల వెంకటేశ్వరరావు, ప్రచురణకర్త, నరసాపురం.

వికాసం

ఎ. వి. రామమూర్తి సంపాదకత్వాన వె[illegible] తున్న వికాసం జనపరిపత్రిక మా కార్యాలయం చేరింది. చిరునామా గాంధినగరం, విజయవాడ—3 ●

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna


ఆద్యంతం
భక్తి పారవశ్యంలో
ఓలలాడించి
భాగవత గాథామృతాన్ని
మీ హృదయాలపై
చిలికించే
మనోహర
వర్ణకావ్యం!
విజయవంతంగా
నడుస్తోంది!
వీనస్ మహీజా పిక్చర్స్
యశోద కృష్ణ
ఈస్ట్‌మన్ కలర్
నిర్మాత: సి.హెచ్.ప్రకాశరావు దర్శకత్వం: సి.ఎస్.రావు B.A(Litt).
నవయుగ
ఒరిస్సా, నార్త్ ఇండియా: సత్యా ఎంటర్‌ప్రైజెస్
Veekay


తమ్మారెడ్డి కృష్ణమూర్తి
సమర్పించు
ధ్రువ చిత్ర వారి
DHRUVA CHITRA
చిన్నాటి కలలు
దర్శకత్వం: టి.లెనిన్ బాబు B.Sc., నిర్మాతలు: టి.భరద్వాజ్ B.E., ఇ.యస్.రెడ్డి M.B.B.S.,
ఆంధ్ర-నైజాం: లక్ష్మి ఫిలింస్ సీడెడ్ హక్కుదార్లు విజయమల్లేశ్వరి కంబైన్స్ రిలీజ్: జయలక్ష్మి పిక్చర్స్ మైసూరు: సుధాచిత్ర
LAKSHMI PUBS